# కథామంజరి


## పది కథల సమాహారం



అక్టోబర్ 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**అక్టోబర్ 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 10

ఈ నెల కథామంజరి సంచికకి
చేయూతనిచ్చినవారు

**శ్రీ హరిచరణ్ ప్రసాద్**

**శ్రీమతి సుకన్య**

**కుమారి అపూర్వ**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## ‘గళ’ సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... ... ... | iii |
| కథా మార్గదర్శి | ... ... ... ... ... ... | v |
| కథా పరిచయం | ... ... ... ... ... ... | vii |
| కథాపుస్తక పరిచయం | ... ... ... ... ... ... | ix |
| వినదగునెవ్వరు చెప్పిన | ... ... ... ... ... ... | xi |


## కథలు, వ్యాసాలు


| | | | |
|---|---|---|---|
| అశ్వత్థామ హతః | ... | వసుంధర ... ... ... | 1 |
| వైకుంఠపాళి | ... | యస్వీ కృష్ణ ... ... ... | 6 |
| రంగుల కల | ... | వాడపల్లి పూర్ణ కామేశ్వరి ... ... | 13 |
| ఒక్క చిన్న సినిమా | ... | శ్రీ హవిష ... ... ... | 18 |
| మానవతామూర్తి | ... | సుస్మితా రమణమూర్తి ... ... | 22 |
| మనసు గాయం | ... | పి. ఎల్. ఎన్. మంగారత్నం ... | 26 |
| మామిడి జీడి | ... | భమిడిపాటి గౌరీశంకర్ ... ... | 31 |
| కథకుడి అంతరంగం | ... | మెడికో శ్యామ్ ... ... ... | 38 |
| పూజారి పున్నయ్య | ... | అరిగే రామారావు ... ... | 47 |
| లీల | ... | స్మైల్ ... ... ... ... | 54 |


Cover Page Credit : Jeremy Hynes, Ontario, Canada

ఆధునిక తెలుగుభాషా వైతాళికులుగా మనం చెప్పుకునే గిడుగు రామమూర్తిగారి జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రతి సంవత్సరం ఆగస్టు 29 తేదిన "తెలుగు భాషా దినోత్సవం" తెలుగు రాష్ట్రాలే కాకుండా, తెలుగువారందరూ ఎక్కడున్నా సరే జరుపుకోవడం... నిజంగా గర్వించదగ్గ విషయమే! చెప్పాలంటే.. అవసరం కూడా! భాష విషయంలో ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలు, అలోచనల మాట ఎలా ఉన్నా, మన భాషని మనం కాపాడుకోవాలనే తపన ఈ మధ్య ప్రజల్లో కనబడుతుతోంది. అయితే ఈ తపన ముఖ్యంగా యువతరంలో కనబడటం లేదు. ఈ పరిస్థితి కొనసాగితే... రేపు మన భాష ఏమవుతుందా అనే ఆందోళన ఉండటం సహజమే! మాతృభాషని ఈ రోజు పదిలపరిచి, రేపటికి భాషావైశిష్ట్యం అందించాలంటే అన్ని తరాలవాళ్ళు తప్పనిసరిగా నడుం కట్టాలి!

ఇక... ఈ విషయంలో 'మనం ఏం చేయగలం?" అనే ప్రశ్నకి తావులేకుండా, రచయితల పాత్రను మనం గుర్తు చేసుకోవాలి.

రచయితలందరు రోడ్డు మీదకు వచ్చి, భాష కోసం బందులు, ధర్నాలు చేయనవసరం లేదు, చేసినా ప్రయోజనం ఉండదు! రోజులు మారాయి, సాంకేతికంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రజల జీవన విధానం, వారి ఆలోచనలు చాలా మారిపోయాయి. పరభాషా వ్యామోహం కంటే, అవసరం అనే గట్టి నమ్మకం మనస్సులో నాటుకుపోయింది. ఈ పరిస్థితులలో మన భాషని రక్షించుకునే ప్రయత్నం... మన ఇంట్లో నుంచే ప్రారంభమవాలనీ, ఇంట్లో తెలుగుభాషలోనే మాట్లాడుకోవాలనీ, ముఖ్యంగా పిల్లలతో తెలుగులోనే మాట్లాడాలనీ, తెలుగువారి సాంప్రదాయాలను పాటించాలనీ... ఇలా ఎవరికి చేతనైనట్టు వారు కృషి చేస్తున్నారు. 'ఈ ప్రయత్నాలు చాలు' అని కొంతమంది భావిస్తారు. నిజానికి ఇది సరిపోదు. రానురాను సంభాషణలలో సరళం పోయింది. ఒకప్పుడు ఇళ్లలో వాడే, చాలా పదాలు వినబడటం లేదు! వాడుకలో కొన్ని పదాలు కుచించుకుపోతున్నాయి. చివరికి ఈ మధ్య కాలంలో ఆంగ్లపదాలకి కూడా ఈ జాడ్యం అంటుకుంది. బ్రదర్‌కి 'బ్రో' అని కూడా వాడేస్తున్నారు.

ఈ పరిస్థితులలో మనమేం చేయగలం అని కవులు, రచయితలు ప్రశ్నించుకుంటే... తప్పకుండా జవాబు దొరుకుతుంది! ఎలా?

తమతమ రచనలలో తెలుగు పట్టుపదాలు, జాతీయాలు, వాడుకభాషా పదాలే ఉపయోగించి వాక్యనిర్మాణం చెయ్యాలి. ఆంగ్ల భాషాపదాలను సాధ్యమైనంత వరకు నివారించాలి. కొత్తపదాలను కనుక్కోవచ్చు... కాని అవి పండితులకే కాదు, పామరులకి కూడా సునాయాసంగా అర్థం అయేటట్టు ఉండాలి. అలాగే... సాంకేతికపరమైన పదాలకి సరియైన పర్యాయపదాలు తెలుగులో లేనప్పుడు, ఆంగ్లపదాలు వాడినా పర్వాలేదు. అంతేగానీ, పలకడానికి వినడానికి కూడా ఇబ్బందిగా ఉండే పదాలు వాడనవసరం లేదు. ఉదాహరణకు రైలు అనే మాటకి ధూమశకటం అనడం తప్పు కాకపోవచ్చు... కాని ఈ రోజుల్లో ఆ ధూమశకటాలు ఎక్కడా కనబడవు. అలాగని వాడుకలో ఉన్న తెలుగుపదాలకు ఆంగ్లపదాలు వాడక్కర్లేదు! అన్నానికి బదులు రైస్, నీళ్ళకి బదులు వాటర్, పుస్తకానికి బదులు బుక్.... ఇలా ఎన్నో సరళమైన పదాలను మనమే పక్కకు నెట్టేస్తున్నాం! కొన్ని ఆంగ్లపదాల్ని కష్టపడి తెలుగులో అనువదించి.. పది పదిహేను అక్షరాలతో ఓ కొత్త పదాన్ని సృష్టించి, వాటిని రచనలలో ఉపయోగించడం వలనన అస్సలు ప్రయోజనం ఉండదు. అంతే కాదు, ఆ రచనల ద్వారా చెప్పవలసిన విషయం అవగాహన కాకుండా దెబ్బతింటుంది. ఈ పదప్రయోగాలతో పాటు, మన మాటల్లో ఆశువుగా వచ్చే పట్టుపదాలు, సామెతలు, జాతీయాలు... వీటిని కూడా రచనలలో తప్పనిసరిగా వచ్చేటట్టు వాక్య నిర్మాణం చెయ్యాలి. అలాగే తెలుగుభాషలో ఉన్న మాండలికాల్ని అందరికి అర్థమయేలా సరళంగా అందించాలి. కథల్లో, నాటకాల్లో, సినిమాల్లో సహజమైన సంభాషణలే ఉండేటట్లు రచయితలు చూడాలి.

ఈ సూచనలు పాటిస్తే... తెలుగుభాషకి ఇక డోకా ఉండదా అనే ప్రశ్న వస్తుంది! ఖచ్చితంగా లేదనే చెప్పాలి!! కాని, ఇది మన భాషని రక్షించుకోడానికి... మన పరిధిలో మనం చేయగలిగే ఉడుత సహాయం!


మన ఉనికికి, మన మాతృభాష మనుగడకు... నేటి కథ ఊపిరిని అందిస్తుంది. ఆ దిశలో కలం కదపడమే మన ముందున్న కర్తవ్యం!

**సంపాదకుడు**






# విశిష్ట అతిథి



**శ్రీ అరిగే రామారావు**

చదివించే శైలి, ఎటువంటివారినైనా మంత్రముగ్ధులను చేసే కథాంశం, మంచి వస్తువుతో కథలు వ్రాయడానికి ఆయనకి స్ఫూర్తిని ఇచ్చింది మాత్రం 'ఊహించలేనన్ని రచనలు చదవడమే'. నూజివీడులో అప్పుడే డిగ్రీ చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నప్పుడు, కనబడ్డ పుస్తకాలన్నింటిని చదివి, ప్రభావితుడై, "పూజారి పున్నయ్య" అనే ఓ కథ రాసి ఆంధ్రపత్రికకి పంపితే, వారికి నచ్చి వెంటనే ప్రచురించారు. కాని ఆ రోజుల్లో ఆంధ్రపత్రికలో కథలు ప్రచురణ అయ్యాయంటే.. ఆ కథలు చాల గొప్పవనే చెప్పేవారు. అలాగే ఆ కథలకు బాపుగారు బొమ్మలు వేయడం కూడా మరో ప్రత్యేకతగా ఉండేది. కాని ఈ కథ బాపుగారి బొమ్మతో రాలేదు. రచయితగా కొంత నిరుత్సాహం వచ్చినా, పట్టుదలతో మరో కథ "నచ్చానోడు" రాసి పంపితే, ఆ కథ బాపుగారి బొమ్మతో ప్రచురితమయింది. అదో మరపురాని అనుభూతిని, ఉత్సాహాన్ని ఆయనికి ఇచ్చింది. అంతకంటే గొప్ప విషయం ఏమిటంటే... ఆ ఏడాది బాపుగారు ఎంపిక చేసిన కథలతో ఓ సంకలనం వచ్చింది. అందులో మల్లాది రామకృష్ణశాస్త్రిగారు, రావిశాస్త్రిగారు, కొడవటిగంటి కుటుంబరావుగారు, సి. రామచంద్రరావుగారు వంటి ప్రముఖుల కథల సరసన ఈ కథ కూడా చోటు చేసుకుంది. అలాగే 'చిన్నకథల గురించి నిర్వచించాలంటే, ఈ కథ గురించి చెప్పాలని' బాపుగారు అన్నారంటే... ఆ కథ గొప్పతనం గురించి వేరే చెప్పక్కర్లేదు. అంత గొప్ప కథలతో రచనావ్యాసంగంలో అరంగేట్రం చేసిన ఆ రచయిత మరెవరో కాదు.. నేటి విశిష్ట అతిథి శ్రీ అరిగే రామారావుగారు.

"ఆ రోజుల్లో మా ఊర్లోనే చలంగారు ఉండేవారు. రోజూ ఆయన మా ఇంటి ముందునుంచే నడుచుకుంటూ వెళ్ళేవారు. ఆ అదృష్టంతో పాటు, ఆయన ప్రభావం నా మీద ఉంది. అంతే కాదు... అప్పట్లో విశ్వనాథ సత్యనారాయణ, రావిశాస్త్రి గారల రచనలు ఎక్కువగా చదివేవాడ్ని... వీరి ప్రభావం కూడా నా మీద పడి, కథలు రాయడానికి ఉపక్రమించాను! జీవితంలో అనుభవాలను, తారసపడే సంఘటనలను కథావస్తువుగా తీసుకుని కథ రాస్తాను. నాకు వైవిధ్యమంటే ఇష్టం! కళ్ళకెదురుగా కనబడే కొన్ని సంఘటనల్ని, వ్యక్తుల్ని చూసిన వెంటనే... ఎక్కడో ఓ ఫ్లాష్ వస్తుంది. దాన్ని కథగా మలచొచ్చు అనే ఆలోచనలే కథలుగా రూపుదిద్దుకుంటాయి!" అంటూ రామారావుగారు తన రచనల వెనకనున్న విషయాల గురించి ఎన్నో సంగతుల్ని చెప్పారు. ఆ రోజు నుంచి అంటే 1958 నుంచి నేటి వరకు పాఠకుడ్ని మెప్పిస్తున్నవారి కథలన్నీ ఇలా రూపు దిద్దుకున్నవే! 1936లో నూజివీడులో జన్మించిన రామారావుగారు, ఈ రోజుల్లో అంటే 87వ వసంతంలో కూడా వాసి ఉన్న కథలు


ఝుళిపిస్తున్నారంటే... ఆయన వాసి తగ్గని ఉత్సాహానికి, మంచి ఆరోగ్యానికి... ఈ కథారచనల వ్యాపకమే ఔషధమని చెప్పాలి.

రామారావు గారు... డిగ్రీ పాసై, రాష్ట్ర రవాణాశాఖలో ఉద్యోగం వచ్చే లోపల, పుస్తకాలు చదువుతూ, నిత్యం ఏదో అన్వేషణలో గడిపేవారు. ఆ రోజుల్లోనే సాయంత్రం పూట, ఆ ఊర్లో శివాలయంలో నిశ్శబ్దంగా నూనెదీపాలు వెలిగించే పూజారిగార్ని చూసిచూసి, ప్రేరణతో మొదటికథ రాసారు. ఆ కథే "పూజారి పున్నయ్య"! ఆ తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు. తనకి ప్రేరణ కలిగించి, కదిలించిన సంఘటనలు, జీవితాలు, మనుషులు.. కథావస్తువు లయ్యాయి. తన కళ్ళల్లో తడి, గుండెలో నిట్టూర్పులకు అక్షరరూపం ఇచ్చారు. అందువలననే, ఆయన కథలలోని ప్రతీ పాత్రలోని వ్యక్తి మనకి నిత్యజీవితంలో ఎక్కడో అక్కడ తారసపడిన వారే ఉంటారు! ప్రతీ కథా, జీవితాలని తాకుతుంది. ఏడు దశాబ్దాల రచనాజీవితంలో వేలల్లో కథలు రాయొచ్చు... కాని రామారావుగారు 'రాసి' కంటే 'వాసి'కి ప్రాధాన్యత ఇచ్చి, చిరస్మరణీయమైన కథలనే రాసారు. సుదీర్ఘమైన తన రచనాజీవితంలో ఆయన రాసిన కథలు రెండువందలకు అటుఇటుగా ఉంటాయి. నాలుగైదు నవలలు కూడా ఆయన ఖాతాలో ఉన్నాయి. అయితే రామారావుగారు ఎప్పుడూ తన కథాసంకలనాలు వేసుకునే ఆలోచన చేయలేదు. "నా మిత్రులు ఆదివిష్ణుగారు తరుచు కథాసంకలనాల అవశ్యకత గురించి రోజూ చెప్పేవారు, కానీ నేను ఆలోచన చేయలేదు! ఆ తర్వాతికాలంలో వేదగిరి రాంబాబుగారు నడుం కట్టుకుని, నా కథాసంకలనాన్ని తీసుకురావడం, ఆ సంకలనానికి శ్రీ బుచ్చిబాబుగారి స్మారక పురస్కారం లభించడం చాలా తృప్తిని ఇచ్చాయి" అంటూ రామారావుగారు మరో విషయం కూడా చెప్పారు... "కథలకు మాములుగా అయితే సాహితీసుగంధం ఉందో, లేదో తెలియదు గాని... కథాకదంబంగా వెలువడిన తర్వాత పువ్వులకు కట్టిన నారకు కూడా సుగంధం అబ్బినట్లు, కథారచయిత పేరుతో పాటు కథలు కూడా పరిమళిస్తాయని నేను గాఢంగా నమ్ముతాను!" ఇది ముమ్మాటికి నిజం! నెలపొడుపు, నోరులేని వాళ్ళు, లేతమొలకలు, విముక్తి, జీవనచక్రం, అక్కరకు రాని.., ఈశ్వర అల్లా తేరేనామ్... వంటి వీరి అన్ని కథలు కొత్త రచయితలకు మార్గదర్శకంగా ఉపయోగపడతాయనడంలో అతిశయోక్తి లేదనే చెప్పాలి.

రామారావు గారు 1959 సంవత్సరంలో ఆర్టీసిలో గుమస్తాగా చేరి, ముప్పైఐదు సంవత్సరాలు సుదీర్ఘ ఉద్యోగపర్వంలో అంచెలంచెలుగా ఎదిగి, డిప్యూటీ చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసరుగా 1994లో పదవీ విరమణ చేసి, హైదరాబాదులో వారి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. వీరి తండ్రిగారు నూజివీడులో ఉన్న వందెకరాల మామిడితోట అమ్మేసి, నూజివీడు జమిందారుగారితో మద్రాసు వెళ్ళి, సినిమాలను తీసే ప్రయత్నాలలో నూజివీడు తిరిగి రాలేదుట.. దాంతో రామారావుగారు చదువుకునే రోజుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలా తన జీవితం, తన చుట్టూ ఉన్న జీవితాలు, అనుభవాలతో అజరామరంగా నిలిచిపోయే కథలు రాస్తున్న శ్రీ అరిగే రామారావుగారు... కథామంజరి అభ్యర్థనను మన్నించి విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు వారికి, అలాగే వివరాలను అందించి సహకరించిన వారి కుమారులు శ్రీ ప్రకాష్‌గారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ... మరింత కాలం ఆయురారోగ్యాలతో, కథారత్నాలను అందించగలరని ఆశిస్తూ, వారి మొదటి కథ "పూజారి పున్నయ్య"ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాము!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**శ్రీ స్మైల్**

స్మైల్ పేరు చూడగానే తెలుగువారికి స్ఫురించేది "ఖాళీ సీసాలు" కథ. అంతే కాదు "ఒఖడే" కవిత కూడా గుర్తుకు వస్తుంది. చెరో చేత్తో కవితా, కథా రాయగల సత్తా ఉన్నా, వాటిలో 'సత్తా' ఉండాలనే గట్టి సిద్ధాంతంతో.. వాడియైన కథలు, కవితలు రాశారు. అందుకే ఆయనా, ఆయన సాహిత్యం తెలుగు సాహితీప్రపంచంలో అజరామరంగా నిలిచిపోయాయి. ఎత్తుగడ, సహజమైన సంభాషణలు, వస్తువులో కొత్తదనం, చదివించే కథనం, శైలి, కొసమెరుపుతో ముగింపు... కథకి ఉండవలసిన మౌలికమైన లక్షణాలు ఇవని చెప్తారు. సాధారణంగా మంచికథల్లో ఈ లక్షణాలు కనబడతాయి. అయితే కొందరు కథకుల కథల్లో వర్ణణ, విస్తరణ వంటి కవితా లక్షణాలు కూడా కనబడతాయి. వచనం, కవనం.. రెండిటినీ సమన్వయం చేస్తూ, (కథాసాహిత్యంలో జుగల్బంది అనొచ్చా?!) కథలు గాని, కవితలు అందించిన కథకులు, కవులు ఉన్నారు. అయితే మెప్పించే వారు బహు తక్కువమంది ఉన్నారు. చలం, కృష్ణశాస్త్రి, రావిశాస్త్రి గార్లను ఈ కోవకి చెందినవారిగా చెప్పుకోవాలి! అలాంటి మహనీయులు సరసన చేర్చగల రచనలు చేసినవారిలో స్మైల్ కూడా ఒకరు.

స్మైల్‌గారు అతి తక్కువగా రాసిన కథలు, అతి గొప్పగా రాసారనే సత్యాన్ని... వల, పృథ్వి, కంబళి(అనువాదం), సిగరెట్, సముద్రం. మొదలైన కథలు చదివిన ప్రతిపాఠకుడూ గుర్తిస్తాడు. అప్పటివరకు కవితాసాహిత్యం అందిస్తున్న స్మైల్‌గారి మొట్టమొదటి కథ "వల" 1964లో వ్రాసారు. ఆ రోజుల్లో ఆ కథాంశం ఓ రకంగా వివాదాస్పదమైనదే... సాంప్రదాయానికి విరుద్ధమైన కథే! 1966 లో ఆ కథ "భారతి" పత్రికలో ప్రచురించారు. ఓ వినూత్నమైన రీతిలో కథనం సాగుతుంది. కవితలా కథను నడిపించి, సాహితీస్రష్టల చేత కూడా 'భేష్' అనిపించుకున్నారు. "ఆయన కొద్దిగా రాసినా, చాప కింద నీరులా, కమ్మేస్తున్న జీవనవ్యాకులత గురించి మనకు తెలియని పార్శ్వాన్ని, గ్లోబుకు మరో పక్కన చీకటిని, వెలుతురు కావలసిన చీకటిపక్షుల పంజరపు బ్రతుకుల్ని తెలుగు సమాజానికి పరిచయం చేసిన గొప్ప రచయిత స్మైల్‌గారు!" అని పత్రికలు వేనోళ్ళ పొగిడాయి. పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు స్మైల్‌గారి 'గాజు సీసాలు' కథ గురించి.. "ఇది కథేనా... లేక ఓ రకంగా జీవితంలో నుంచి కట్ చేసిన ఓ ముక్కా!" అంటూ ఒకేఒక్క మాటలో నిర్వచించారు. ఈ ఒక్క మాట చాలు... స్మైల్‌గారి రచనలలో వస్తువు, శైలి, శిల్పం, కథనం... వంటి వాటి గురించి మరే విశ్లేషణ అక్కర్లేదు. స్మైల్‌గారి కథలు చదువుతుంటే, పాఠకుల అంతరంగంలో ఆ కథావస్తువు, కెన్వాసు మీద దృశ్యరూపంగా కనబడుతుంది.

1943లో కృష్ణా జిల్లా తేలప్రోలులో జన్మించిన స్మైల్‌గారి అసలు పేరు 'మహ్మద్ ఇస్మాయిల్'. విద్యాభ్యాసం ఏలూరులో జరిగింది. విజయవాడ లయోలా కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసి, తర్వాత పోటీపరీక్షలో పాసై, వాణిజ్యపన్నుల శాఖలో ఎసిటీవో ఉద్యోగంలో చేరారు. 2003 లో డిప్యూటీ కమీషనర్‌గా కాకినాడలో పదవీవిరమణ చేసారు. ఆయన రాజమండ్రిలో ఉంటున్న రోజుల్లో "రైటర్స్ పాయింట్" అనే సాహితీసంస్థను నెలకొల్పి, సాహితీమిత్రులందర్నీ చేర్చి, సాహితీగోష్టులు నిర్వహించేవారు. ఎవరైనా, ఆయన్ని 'మీరు ఎందుకిన్ని తక్కువ కథలు రాసారని' అడిగితే 'చదవాల్సినది చాలా వుందని' అనేవారు. చాలాకాలం కవిత్వమే రాసేవారు. అందులో ఎక్కువ అనువాదాలు ఉండేవి. ఒకట్రెండు నాటికలు వ్రాసారు. వాటిలో బాగా గుర్తింపు పొందిన తర్వాత, స్మైల్ గారు కథారచనలోకి అడుగుపెట్టారు. 'కన్యాశుల్కం' అంటే చాలా ఇష్టం... అందులో గిరీశం పాత్ర అంటే మరీ ఇష్టం. ఇంట్లో పిల్లలతో చతురసంభాషణ ఎక్కువగా ఆ పాత్ర మీదే చేస్తూ, సరదగా ఉండేవారుట! పదహారేళ్ల పిల్లల దగ్గర్నుంచి, తొంభై సంవత్సరాల వృద్ధుల వరకు స్మైల్‌గార్కి స్నేహితులు ఉండేవారు. ఆయన పేరులో స్మైల్ ఉంది గాని, ఆయన కథలలో గుండెల్ని పిండే కరుణార్ధం కనబడుతుంది. ఎన్నడూ మొహంలో స్మైల్ చెదరని, అదే పేరుతో కనబడే వ్యక్తి .. 'స్మైల్'గారు.

డిసెంబరు 5, 2008 న కనుమూసినా చెక్కుచెదరని ఆ 'స్మైల్' సాహిత్యం తెలుగు సాహితీప్రపంచంలో నిత్యం ప్రకాశిస్తూనే ఉంటుంది. విలక్షణమైన వ్యక్తిత్వం, విలక్షణమైన సాహిత్యం, విలక్షణమైన జీవితంతో... సార్ధకనామధేయుడు 'స్మైల్' గా అనబడే మహ్మద్ ఇస్మాయిల్‌గారిని కథామార్గదర్శిగా తలచుకుంటూ... ఆయనకి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

## కాళోజీ గారి కథ – తెలియక ప్రేమ తెలిసి ద్వేషం

"ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అన్న ప్రజాకవి, తెలంగాణా ఉద్యమకారుడు కాళోజీ లేక కాళోజీ నారాయణరావు. ఆయన అసలు పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ. కన్నడ–మహారాష్ట్రీయ దంపతులకు పుట్టిన కాళోజీ కుటుంబం బీజాపూర్, కర్ణాటక నుండి తరలి వచ్చి వరంగల్ జిల్లాలోని మడికొండలో స్థిరపడింది.

కవిగా, ఉద్యమకారుడిగా, తన భావాలను నిర్మొహమాటంగా చెప్పిన వ్యక్తిగా స్థిరపడ్డా, ఆయన కొన్ని కథలు రాశారన్న సంగతి చాలామందికి తెలియక పోవచ్చు. కొన్ని స్వంతకథలు, కొన్ని అనువాదాలతో (ముఖ్యంగా మరాఠీ నుండి) సుమారు 1937–47 మధ్యకాలంలో రాసిన కథలను ఒక సంపుటంగా వరవరరావు, తదితరులు కష్టంతో సేకరించి కాళోజీ ఫౌండేషన్ పేరిట 'కాళోజీ కథలు' పేరిట 2000 డిసెంబరులో ప్రచురించారు. చిన్నవి, మూడునాల్గు పేజీలకు మించనివే చాలామటుకు. కొన్ని అనువాదాలు, అనుకరణలు ముఖ్యంగా మరాఠీ నుంచి.

అన్ని కథలూ రచయితకు ఉన్న తాత్వికభావనలకు, సంఘం సంస్కరించబడాలనే ఆలోచనలకు అద్దం పడతాయి. కథలు రాసే సమయానికి ఆయన వయస్సు కేవలం 23 – 33 సంవత్సరాలే. చుట్టుపక్కల సమాజపు స్థితిగతులు ఆయనపై ఎంత ప్రభావాన్ని చూపాయో, చిన్నప్పటినుంచి అతిచురుకుగా ఉండే ఆయన ఎలాంటి మానసికస్థితి అలవరచుకున్నారో ఈ కథలు చెప్పక చెబుతాయి.

ఈ మాసం నేను ఎంచుకున్న కథ 'తెలియక ప్రేమ తెలిసి ద్వేషం' కాళోజీ కథల సంపుటిలోనిది.

ఇద్దరు యమభటులు రెండు విగతజీవుల్ని యమలోకానికి తీసుకెడుతూ గంధర్వుల గానం వినాలనే కోరిక పుట్టి, పాశాల్లో ఉన్న జీవాల్ని వైతరణి తీరాన వదిలి వెళ్తారు... కొద్ది సేపటిలో తిరిగి వద్దామని! అప్పుడు ఆ ఇద్దరు విగతజీవుల మధ్య సంభాషణ మొదలవుతుంది.

అవి హరిజనులను దేవాలయాలలోకి రానివ్వని రోజులు! ఆ ఊళ్ళో ఒక పురాతనదేవాలయం ఉంది. ఓ ఏడు జరిగే జాతరప్పుడు, హరిజనులను ప్రవేశానికి అనుమతి ఇచ్చే విషయంలో సవర్ణ హిందువులకు, అస్పృశ్యులకు మధ్య తగాదా వస్తుంది. సవర్ణులలో కొందరు హరిజనుల పక్షం వహిస్తారు. అందులో ఒకరిద్దరు బ్రాహ్మణులు కూడా ఉన్నారు. జాతరకు ఒక వారం ముందుగానే హరిజనులు తమకూ ప్రవేశం కావాలంటూ, నిరసనవ్రతం పట్టి సత్యాగ్రహం మొదలుపెట్టారు. బ్రాహ్మణులూ, ఇతర హిందువులూ, లాఠీలు పట్టుకుని దేవాలయం చుట్టూ తిరుగుతూ కాపలా కాస్తున్నారు. అయితే ఆ ఉదయం హరిజనులు కూడా సత్యాగ్రహం వదిలి లాఠీలు పట్టుకొని దేవాలయ ప్రవేశం చేయడానికి ఉపక్రమించారు. ఆ కొట్లాటలో ఒక హరిజనుడిని ఒక బ్రాహ్మణుడు తలపై కొట్టడం జరుగుతుంది. అది చూసి రెండో హరిజనుడు ఆ బ్రాహ్మణుడిని గొడ్డలితో అతని బుర్రపై కొట్టి చంపడం అవుతుంది. ఆ దుడ్డుకర్ర దెబ్బతిన్న హరిజనుడూ, గొడ్డలివేటు తిన్న ఆ బ్రాహ్మణుడూ, ఇద్దరూ ప్రాణాలు కోల్పోతారు. యమభటులు తీసుకెడుతున్న రెండు ప్రేతలూ వీరివే.

యమభటులు గంధర్వుల గానం వినడానికి వెళ్ళిన వెంటనే, రెండు ప్రేతలూ ఒకరితో మరొకరు పరిచయం చేసుకుంటారు. ముందుగా ఒకరినొకరు భారతీయులుగా గుర్తించుకుంటారు. తరువాత తామిద్దరిదీ తెలుగుభాషే అన్న గుర్తింపు.

బ్రాహ్మణప్రేతలో వెంటనే సోదరభావం కలుగుతుంది అవతలి ప్రేతపై. ఇక్కడికెలా వచ్చావని అడుగుతుంది. రెండో ప్రేత చెప్పుకుపోతుంది – వారి ఊరి దేవాలయంలో ప్రవేశసందర్భంలో తనని ఎవరో తలపై మోదినట్లు, ఆపై తనకు తెలిసింది ఇప్పుడే అని. బ్రాహ్మణప్రేత తనకు కూడా తన ఊరి దేవాలయంలో ఎవరో గొడ్డలివేటు వేయడం వల్ల తనిక్కడికి రావడం జరిగిందని చెబుతాడు. ఇద్దరూ ఒక ఊరివారు, ఒకే దేవాలయానికి సంబంధించిన విషయమే అని గుర్తించి, అవతలి ప్రేతకి ఎంత అన్యాయం జరిగిందో, ఎవరు అలాంటి అన్యాయం చేసారో అని అడుగుతుంది బ్రాహ్మణప్రేత. 'అన్యాయంగా మమ్మల్ని దోచుకు తిని బాగా బలిసిన ఒక లావుపాటి బాపనయ్య, ప్రక్కనుండి, నా తలపై దుడ్డుకర్ర వేసాడు, అయినా ఆ బాపనయ్యకు తగిన శాస్తే జరిగింది', తనని చూసిన వెంకడు ఆ బాపనయ్య తలపై గొడ్డలిపెట్టు పెట్టాడని చెప్తుంది ఆ హరిజనప్రేత.


అంతే. అంతవరకు ఒకరిపై ఒకరికి సానుభూతితో ఎంతో మర్యాదతో జరిగిన సంభాషణ ఒక్కసారిగా పోట్లాటగా మారిపోతుంది. ఇద్దరి మధ్యా ఘర్షణ విని యమభటులు పరుగెత్తి వచ్చి యముడి దగ్గరకి తీసుకెళ్తారు. బ్రాహ్మణప్రేత ఒప్పుకుంటుంది తను చంపానని, అయితే ధర్మసంరక్షణ కోసమని. యముడు బ్రాహ్మణప్రేతకి పదిరోజులు అగ్నిగుండం, తరువాత కొచ్చిన్‌లో ఒక పరయా (మాదిగ) కుటుంబంలో జీవనం శిక్ష విధిస్తాడు – అప్పుడే ధర్మం అంటే తెలుస్తుందని. హరిజనప్రేతకి రెండురోజులు మంచులో వాడిని శాంతపరచడం, మూడోరోజు నుంచి తిరువాన్‌కూర్‌లో ఒక హరిజన కుటుంబంతో జీవనం. తెలుగుదేశం కాక మళయాళదేశం ఎందుకు తండ్రీ అన్న ప్రశ్నకు యముడిచ్చిన సమాధానం "మళ్ళీ దేవాలయపు ప్రవేశపు చిక్కు లేకుండా. లేకపోతే ఏ బ్రాహ్మణుడి చేతనో తల పగులగొట్టించుకుని చేరుకుంటావు నాదగ్గరకు" అని. కథ అక్కడితో అయిపోతుంది.

కథంతా సంభాషణారూపంలో జరిగిపోతుంది. రచయిత ఎన్నుకున్న టెక్నిక్ అది. ముఖ్యంగా అవతలి వ్యక్తి తనకి తెలియనప్పటికి, తెలిసిందానికి ఆలోచనలలో ఉండే తేడా సంభాషణల ద్వారా ఎంత త్వరగా ఎలా బయటకు వస్తుందన్నది పాఠకుడికి కథలో చెప్పిన తీరది.

ఇంత చిన్న కథలో రచయిత చెప్పదల్చుకున్న అంశాలలో ముఖ్యమైనది, విగతజీవులైనప్పటికీ, తమకు ఎదుటివారి గురించి తెలియనంతవరకూ ఎంత మర్యాదిచ్చి పుచ్చుకున్నారో, తెలిసిన తర్వాత మళ్ళీ పాతకక్షలూ, అగ్రకులాల జులుం, హరిజన వర్గాల ఆగ్రహం, అన్నీ తిరిగి చేరతాయి. అంటే, ఏదో సామెత చెప్పినట్లు పుట్టుకతో వచ్చిన బుద్ధి... అన్నట్టు అది అంత త్వరగా పోదు. అంతవరకు ఎంతో మర్యాదగా, సానుభూతితో మాట్లాడిన బ్రాహ్మణ విగతజీవి అవతలి మనిషి హరిజనుడని, దేవాలయ ప్రవేశానికి అనర్హుడు, ధర్మసంరక్షణార్థం తను చంపాలనుకునే హరిజనుడని తెలియగానే "ఓరి ముండాకొడకా! మాదిగ వెధవవు ఇక్కడా దాపురించావు? పొద్దున్నే కసితీరా లాఠీతో కొట్టి దేవాలయ ప్రవేశం కంటే మొదలు యమపురి ప్రవేశం చేయిస్తామని అనుకుంటే ఆ గొడ్డలిదెబ్బ నా తలపై పడడం చేసి తప్పించుకుపోయావు. కాని ఇప్పుడెటు పోతావురా? గొంతుపిసికి పారేస్తాను చూడు." అని అంటాడు. ఒక్కసారిగా వచ్చిన మార్పు. తామేస్థితిలో ఉన్నామన్న ఆలోచనలేదు. సానుభూతి మనవారికే పరిమితం. గీతకు ఆవలి మనిషైతే శత్రుత్వమే. అంటే మన, తన భావాలు మానవత్వాన్ని విస్మరించేలా ఎలా చేస్తాయో చూపిన కథ.

మనుషుల మనస్తత్వాన్ని వ్యంగ్యాత్మకంగా చూపించాడు రచయిత. ఆ రోజుల్లో బ్రాహ్మణులు, సవర్ణ హిందువులు, ధర్మం పేరిట హరిజనుల్ని చంపి అయినా వాళ్ళని దేవాలయాలలోకి రానివ్వకపోవడం లాంటి విపరీత సంఘటనలతో నడిపిన ఈ కథ సంఘ సంస్కరణలో రచయితగా తనవంతుగా చేసిన ప్రయత్నం.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*





## బెలగాం కథలు

బెలగాం కథలుగా చాలా ప్రాచుర్యం పోందిన ఈ కథల రచయిత శ్రీ ఓలేటి శ్రీనివాసభాను. కథలతో సాహితీప్రియుల్ని అలరింపచేసే ఈ కథాసంకలనం జూలై 2019 లో విడుదలయింది. ధర. ₹. 200/-.

**ప్రతులకు**

శ్రీ ఓలేటి శ్రీనివాసబాను,
4-ఎ, 5వ అంతస్థు, శ్రీ రామ్స్ శ్రీ ఎన్ క్లేవ్,
కేమ్లెట్ లేఅవుట్, కొండాపూర్,
**హైదరాబాదు – 500084**
(ఫోన్: 7032480233)





## కథా కృపాకరం

పాఠకుల్ని కట్టిపడేసే శ్రీ కృపాకర్ పోతుల, ఇరవై కథల సమాహారం. అక్టోబర్ 2022 లో విడుదలైంది. ధర: ₹. 175/-

**ప్రతులకు**

శ్రీ కృపాకర్ పోతుల,
సి-802, ఇండిస్ వన్ సిటీ,
మలేషియన్ టౌన్‌షిప్ దగ్గర, కెపిహెచ్ బి కాలనీ,
ఫేజ్ -5, కూకట్ పల్లి,
**హైదరాబాదు – 5000085**
(ఫోన్: 8008416660)




## కోనసీమ కథలు

అందమైన ప్రకృతి, ప్రత్యేకమైన తెలుగు మాండలికం... కళ్లముందు కనబడే కథనలతో, శ్రీ చాగంటి ప్రసాద్ కలం నుంచి జాలువారిన కథల సంకలనసీమ "కోనసీమ కథలు". మార్చి 2020లో విడుదలైన ఈ పుస్తకం ధర :₹. 90/-. (రచయిత ఫోన్: 9000206163)

**ప్రతులకు**

సాహితీ ప్రచురణలు,
33-22-2, చంద్రం బిల్డింగ్స్,
సి.ఆర్.రోడ్, చుట్టుగుంట,
**విజయవాడ - 520004**
(ఫోన్ : 0866-2436641/43)




## నా భార్యకింకా పెళ్ళి కాలేదు

గిలిగింతలు పెట్టే, 'విరించి' విరచితమైన ఈ కథాసంకలనం... ఆగస్టు 2023 లో విడుదలైంది. ధర ₹. 150/-.

**ప్రతులకు**

ఎమెస్కో బుక్స్ ప్రైవేటు లిమిటెడ్,
1-2-7, భానూకాలనీ,
గగన్ మహల్ రోడ్, దోమలగూడ,
**హైదరాబాదు - 500029**
e-mail: emescobooks@yahoo.com



ఎప్పటిలాగే కాంతారావుగారి కళాదృష్టిని పట్టిస్తూ అందమైన ముఖచిత్రంతో సెప్టెంబర్ కథామంజరి వెలువడింది. కొన్ని పేజీలు తిప్పగానే ఈ సంచిక వితరణశీలురు పరిగి దంపతుల వివరాలు, దీపావళి కథలపోటీ ప్రకటన. శ్రీరమణగారి పేరడీ ప్రేమలేఖలు.. ఇంతకు ముందు చదివినా... మరోసారి చదివినా... మరోసారి.... అదే నవ్వు మనలో మొలిచే చమత్కారం. చమత్కారం తడి అరకముందే శాయి రాచకొండగారు చేసిన 'బంగారు మురుగు' కథ పరిచయమూ బంగారమే!

సినిమాలో నటించడం అనే కీటకం కుట్టిన తర్వాతి తరాన్ని నిర్వికారంగా చూసిన వెంకట్రావు అనే వాక్యంతో ముగిసిన ఓ వెంకట్రావు అతని మనవరాలి కథ. 'అనామతరువు' అనిల్ ప్రసాద్‌గారి కథ వాస్తవానికి అర్థం పట్టింది. యమునగారి 'రంగస్థలం', సుందరీ నాగమణిగారి 'నిన్నటి దాకా....' కథా బాగున్నాయి.

ఈ సంచికలోని కథలకు విభిన్నంగా ఉన్న, నన్ను ఆకట్టుకున్న కథ 'నేను, నాన్న, బంగారం'. రసవాదం అదే... పరుసవేది అనే ప్రక్రియను మిళితం చేస్తూ తల్లిదండ్రులపై పుత్రుని ప్రేమను గురించి రాసిన కథ. ఇటువంటి కథలు రాయాలంటే కేవలం ఎక్కువమంది రాస్తున్నట్టుగా 'రాయడం' మాత్రమే వస్తే రాయలేరు. అందుకు తగిన శాస్త్రపరిజ్ఞానం ఉండటమో, తెలుసుకొని ఆకళింపు చేసుకోవడమనే లక్షణమో ఉండి తీరాలి. నిజానికి ఇలా సైన్స్ ఫిక్షన్ రాస్తున్న, రాయగలిగే రచయితలు చాలా అరుదు. నాకు తెలిసీ ఓ ముగ్గురు నలుగురు... లేదూ ఇంకో ఇద్దరు. ఆ కోణంలో శ్రీసుధామయిగారిని ప్రామినెంట్‌గా భావించవచ్చు, వారు ఈ దిశగా సీరియస్‌గా ఆలోచిస్తే! కాస్త శైలిలో అక్కడక్కడా పట్టు దప్పినప్పటికీ ఈ ప్రయత్నం బాగుంది.

మిత్రుని తల్లిదండ్రులతో ఆ ఇంట్లో ఒకరోజు గడిపాక అతనికి తన ఇంట్లోని వారిని గుర్తుకు తెచ్చిన కథ 'ఆ ఇంట్లో ఒక రోజు..' కథలో ఉన్న అంశం కంటే అందులో వచ్చిన వాక్యాలు ఇంకా బాగున్నాయి. అల్జీమర్స్ కంటే వృద్ధాప్యం, అంతకంటే పీడించేది... పిల్లలతో అరుదైపోయిన సాంగత్యం... వంటివి. ఈ కథ చదివాక సాయిబ్రహ్మానందంగారి కథలు వెతుక్కొని చదవాలనిపిస్తోంది. ఇక చివరిది అబ్బూరి గారి కథ 'బోన్‌సాయి బ్రతుకు'. ఇతర భాషల్లోకి తర్జుమా అయిన ఈ కథ గురించి చెప్పడానికి బోన్‌సాయ్ లాంటి నేనెంత? ఒక సిద్ధాంతానికి లేదా వాదానికి నమ్మి బలమిచ్చే, సాంఘిక అసమానతల లోతులు విప్పిచెప్పే ఇలాంటి పెద్దలు ఎందరిలోనో ఆలోచనల విత్తు నాటడంలో కృతకృత్యులయ్యారు. వారి జాడలు సమకాలీన రచయితలకు ఆచరణీయం!

**రాంబో**

సెప్టెంబర్ సంచికలో రంగమార్తాండ పోటీలో సాదారణప్రచురణకు సెలెక్ట్ అయిన కథలన్నీ చాలా బాగున్నాయి. అనిల్ ప్రసాద్ లింగంగారు 'అనామతరువు'లో తాతామనవరాళ్ళ ద్వారా సినిమారంగంలో ఎన్నెన్ని మోసాలు జరుగుతాయో చక్కగా చెప్పారు. యమునగారి "రంగస్థలం"లో రిటైర్మెంట్ అన్నది భరించలేకపోయిన హీరో మనోవేదన అర్థం చేసుకుని మేనల్లుడు ఇచ్చిన సలహా బాగుంది. ఎవరికైనా పదవీవిరమణ తరువాత ఏమిటి అన్నది ప్లాన్ చేసుకోవాలన్న ఒక హెచ్చరిక వినిపిస్తుంది. సుందరీ నాగమణిగారి "నిన్నటి దాకా శిలనైనా..."లో సినిమాలో డైలాగ్ డెలివరీ ఎంత ముఖ్యమో, తప్పు చెప్పినప్పుడు భాషను ఖూనీ చేస్తే ఎంత బాధవుతుందో ఫీలయ్యేలా చక్కగా చెప్పారు. అలిమేలు మృదులగా మారినా నలుగురికీ

సాయం చేసే తత్వం మనసులో నిలిచిపోతుంది. చాగంటి ప్రసాద్‌గారి " స్క్రీన్‌ప్లే " జరుగుతున్న పచ్చి నిజాలను చెబుతుంది. ఘోస్ట్ రైటర్స్ ఎంతోమంది ఉన్నారనీ, ఎంత అందంగా మోసాలు చేసి, సినిమాను ఎలా అందలానికి ఎక్కిస్తారో స్పష్టంగా చెప్పారు. నాలుగు కథలూ వేటికవే ప్రత్యేకం!

**డా. లక్ష్మీ రాఘవ**

---

కథామంజరి మాసపత్రిక నిర్వహించిన రంగమార్తాండ సినిమా కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలపై నా అభిప్రాయం.

శ్రీ వి. రాజారామమోహన రావు గారి 'నట నక్షత్రాలు' కథలో కృష్ణమోహన్ బ్రతికి వున్నప్పుడు శిరీషకు హీరోయిన్‌గా రెండు సినిమాల్లో అవకాశం ఇవ్వడం, అందులో తన నటనని అందరూ మెచ్చుకోవడం జరిగింది. అదే తండ్రి చనిపోయాక శిరీషకు సినిమా అవకాశాలు రాలేదు. నాలుగు నెలల తర్వాత ఓ నిర్మాత తన సినిమాలో హీరోయిన్‌గా అవకాశమిస్తూ 'ఈ రాత్రికి నాతో గడపాలి' అన్న మాటలకి శిరీష షాక్‌కు గుర్రై తండ్రి చనిపోగానే వీళ్ళ దృష్టిలో ఎంత తేడా! అని అచ్చెరువొంది ఆ సినిమా నేను చెయ్యనని చెప్పి అక్కడి నుండి వచ్చేస్తుంది. ఇలా అందంతో పాటు అద్భుతమైన నటన ఉన్న శిరీషలాంటి 'నట నక్షత్రాలు' మరుగునపడిపోతున్న వారెందరో... అని రచయిత తన ఆవేదనని ఈ కథ ద్వారా వ్యక్తపరిచాడు.

శ్రీ సింహాప్రసాద్‌గారి 'ప్రేమా నీ చిరునామా ఏమిటి' కథలో రచయిత ప్రేమని ఇలా నిర్వచించాడు. 'కాలానుగుణంగా మారేది ప్రేమ కాదు. కాలాతీతంగా నిలిచేదే ప్రేమని, ప్రేమే అమృతం. అది బ్రతికిస్తుంది, బ్రతుకునిస్తుంది మరియు బ్రతుకుల్ని పండిస్తుంది. ప్రేయసీ ప్రియులిద్దరి మధ్య, భార్యాభర్తల మధ్య ఒకరినొకరు వారి అభిప్రాయాల్ని గౌరవించుకుంటూ, జీవితాన్ని కొనసాగించడమేనని చెప్పారు. కథ ముగింపులో ఇంతకీ నేనెవర్నీ అని ప్రశ్నించుకుని, నేను కాలాన్ని, సర్వసాక్షిని, నీ అంతరాత్మనీ' అని చెబుతాడు రచయిత.

శ్రీ డి.వి. హనుమంతరావు గారి 'జవరాలి జడ దెబ్బ ' కథలో రచయిత తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా చెప్పలేకపోయారనిపిస్తున్నది. శ్రీ కె.వి.లక్ష్మణరావు గారి 'రంగుల కల' కథలో సినిమా అన్నది ఓ రంగుల కల అని చెప్పకనే చెబుతూ కథ ముగింపులో రచయిత చెప్పిన మాటలు జీవితసత్యాలు. కథని అద్యంతం చదివింపజేసింది.

**సి. హెచ్. నాగార్జున శర్మ, తిరుపతి**

---

కథామంజరి కథలు సెప్టెంబర్ 2023 సంచికలోని .. అనిల్ ప్రసాద్ లింగంగారు వ్రాసిన అనామ తరువు కథ చాలా బాగుంది. అసలు విషయాన్ని మసిపూసి మారేడుకాయ చేసే తత్వాన్ని ప్రొడ్యూసర్ పాత్రలో చాలా బాగా చూపించారు. అయితే సినిమారంగంలో కేవలం ప్రొడ్యూసర్లలోనే కాదు చాలామందిలో ఈ ప్రతిభ ఉంటుంది. అందువల్లనే చాలా వరకు ఎవరు ఎందుకు ఎదిగారో, ఎవరు ఎందుకు పోయారో, ఏ సినిమా ఎందుకు హిట్టో, ఎందుకు ఫట్టో తెలియని పరిస్థితి ఉంటుందని అనిపిస్తుంది. సినిమాను, సినిమావాళ్ళను పక్కనపెట్టి కథలోకి వెళ్తే, మంచి రచన. అవసరాలగారు చదివిన విధానం చాలా బాగుంది.

సి. యమునగారు రాసిన 'రంగస్థలం' కథ రిటైర్ అయిన కళాకారుని వేదన కళ్ళుచెమర్చేంతగా వర్ణించబడింది. రిటైర్ అయిన కళాకారుడు వయస్సు మళ్లిన సింహం లాంటివాడు. గత వైభవాలను మర్చిపోలేడు, కొత్తకీర్తులని వేటాడలేడు. మరీ అన్యాయమైన పరిస్థితి ఏమిటంటే, భార్యాపిల్లలే వినలేక విసుక్కునే దుస్థితి. ఘనమైన గతాన్ని మరువలేక, కొత్త ఘనకార్యాల్ని సాధించలేక, కనీసం మనసారా వినేవారైనా లేక ఒంటరితనమే తోడైన కళాకారుని వేదన వర్ణనాతీతం. అయితే బాధల్ని వర్ణించే కథకులకన్నా పరిష్కారాలను సూచించగలిగే కథకులు సమాజానికి మేలు చేయగలరని నేను నమ్ముతాను. అవసరాల రాఘవరావు గారు కథను మనసుకు హత్తుకునేలా చదివారు.

విగ్రహ సంకల్పం – పేదవారి జీవితంలో వచ్చే వడిదుడుకుల్ని వివరిస్తూ అందులోనే ఓ చిన్న సస్పెన్స్‌తో కథను బాగా రాశారు దేవులపల్లి వారు. చివరిలో కథను సుఖాంతం చేస్తూ, కుర్రాడిలో ఇదే స్ఫూర్తిని చదువులో కొనసాగించమనీ, సంపాదన మోజులో పడి చదువు పాడుచేసుకోవద్దని చెప్పడం చాలా బావుంది. భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు బాగా చదివారు.

పి రాజేంద్రప్రసాద్‌గారు రాసిన శతమానం భవతి చక్కటి ప్రేమానురాగాలు నిండిన కథ. మానవ సంబంధాలు ఒకప్పుడు ఇంత బాగుండేవా అనిపించే కథ. వీరపత్నినే కాదు, వీరమాతను కూడా అని ఆమె సంతృప్తిగా, సగర్వంగా చెప్పడం గొప్పగా ఉంది. ఒంటరిగా ఉన్న అనేకులకి, తన ఒంటరితనానికి గల తేడాను బాగా వివరించారు. కథ బాగుంది. వెంపటి కామేశ్వరరావుగారు చాలా బాగా చదివారు. గొర్తి సాయి బ్రహ్మానందం గారి 'ఆ ఇంట్లో ఒకరోజు' చాలా మంచి కథ. లోకంలో అనేకమంది తల్లిదండ్రుల వ్యధను తెలియపరిచే కథ. ఈ కథలో ఎటు చూసినా ప్రేమే కనిపించింది. హరిలో, స్టీవెన్సన్‌లో, క్రిస్టీలో, బిల్‌లో .. అందరిలో కనిపించే ప్రేమ స్వభావం మనల్ని ముగ్ధుల్ని చేసి మనసారా ఎలా ప్రేమించాలో మనకు నేర్పుతుంది అనిపించింది. ఓ కేజీ పాలకోవా బిళ్ళలు కొనుక్కుంటే, వాటిలో ప్రతి కోవాబిళ్ళలోనూ మధురమైన తీపి ఉన్నట్టు ఈ కథలో ప్రతి వాక్యంలో మధురమైన ప్రేమ కనిపిస్తుంది. క్రిస్మస్ గిఫ్ట్‌లతో ఉన్న ఆ గదిని తెరవవద్దని తల్లి కోరడం, తన భార్యకు ఉన్న వ్యాధి గురించి కొడుక్కి చెప్పొద్దని తండ్రి కోరడం, ఇవన్నీ చూసి తన తల్లిదండ్రులని గుర్తు చేసుకుని బాధపడడం, చివరిలో మాకు ఉన్న అతిపెద్ద సమస్య వృద్ధాప్యం అని స్టీవెన్సన్ మెల్లగా అనుకోవడం మన హృదయాన్ని కదిలించే సన్నివేశాలు.

అవసరాల రాఘవరావుగారు చాలా బాగా చదివారు. ముఖ్యంగా స్టీవెన్సన్ మాటలకు బేస్ గొంతుకు ఇవ్వడం చాలా బాగుంది. మొత్తంగా కథ అద్భుతంగా ఉంది.

ఇలాంటి ఆణిముత్యాలలాంటి కథలను అందిస్తున్న కథామంజరి బృందం అంతటికి నా కృతజ్ఞతలు, కళాభివందనాలు, శుభాశీస్సులు.

**కే వి ఎన్ డి ప్రసాద్, విశాఖపట్నం**

***(సంచికలో కథల మీద అభిప్రాయాలని అందించేవారు... ఏ నెలకి ఆ నెల 15వ తేదీ లోగా పంపితే, ఎప్పటికప్పుడు వాటిని ప్రచురించడానికి వీలవుతుంది... సంపాదకుడు)***

# అశ్వత్థామ హతః



9885620065

వసుంధర

**సినిమా రంగమార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***సినీరంగంలో ప్రతిభకంటే పలుకుబడి, హోదాలకే విలువెక్కువ.***
***అవి ఉన్నవారు 'మహా' కళాకారులు కాగలరు. 'మహా' ఏమైనా కాగలరు.***
***ఆ 'మహా'ల నీడ లభిస్తేనే ప్రతిభకు మనుగడ.***
***ఆ నీడ తప్పుకున్నప్పుడే ప్రతిభకు ఎదుగుదల మొదలౌతుంది.***

ఉన్నట్లుండి గుండెపోటొచ్చి క్షణాలమీద కన్ను మూశాడు అశ్వత్థామ. ఆ వార్త తెలుగు సినీ ప్రపంచంలో ఒక సంచలనం.

అశ్వత్థామ సర్ పేరున్న డైలాగ్ రైటర్. ఆయన సూపర్‌స్టార్ చందూబాబుతో మొదటిసారిగా కలిసి పనిచేసిన చిత్రం 'నేనే నేను'. అందులోనే నేనాయనకి అసిస్టెంటుగా చేరాను.

ఆ చిత్రంలో– "నేను దేవుణ్ణి కాదురా... నేనంటే నేనే. నేను నేనే. నేనే నేను"అన్న డైలాగు తెలుగు ప్రేక్షకుల్ని అపూర్వంగా అలరించింది. చందూబాబు డైలాగ్ చెప్పిన పద్ధతో, అశ్వత్థామ సర్ పదాల కూర్పో– ఆ డైలాగ్ చందూబాబుకి చెరగని సంతకమైందని అన్నారు విమర్శకులు. ఐదేళ్లు గడిచినా మిమిక్రీల్లో, హాస్య కార్యక్రమాల్లో అగ్రస్థానం ఆ డైలాగుదే! చందూబాబు ఏ సభకు వెళ్లినా, ఒక్కసారైనా ఆ డైలాగు చెప్పకుండా అభిమానులు ఆయన్ని వదలరు.

ఆ చిత్రం తర్వాత, చందూబాబు పారితోషికం మూడు రెట్లు పెరిగింది. డైలాగ్ రైటరుగా అశ్వత్థామ సర్ బిజీ బిజీ అయిపోయాడు. నలుగురు పెద్ద హీరోలు పట్టుబట్టి తమ చిత్రాలకు ఆయనచేత డైలాగ్స్ రాయిస్తున్నారు. చిత్రం హిట్టయితే– క్రెడిట్ అశ్వత్థామ సర్‌కి కూడా వెళ్లేది. ఒకవేళ చిత్రం ఫెయిలైనా డైలాగ్స్ మాత్రం హిట్ అనే చెప్పుకునేవారు.

సర్ డైలాగ్స్ ప్రత్యేకతల్లో ఒకటి– కొత్తదనం. రెండు ఒకో హీరోకి ఒకో పద్ధతిలో ఉండడం. అంటే బయట ఎవరైనా ఆ డైలాగ్స్‌ని చదివినా కూడా– ఇది ఫలానా హీరోది అని చెప్పేయొచ్చు.

సర్‌కి డిమాండ్ ఎలాగుండేదంటే– పెద్ద హీరోలు కూడా ఆయన డేట్స్‌కోసం ఆగేవారు.

అలాంటి అశ్వత్థామ సర్ హఠాన్మరణం సినీరంగంలో సంచలనం కలిగించడంలో ఆశ్చర్యమేముంది!

నిర్మాత రామశేషు సర్ పరిస్థితి మరీ ఘోరం. ఆయన చందూబాబుతో పెద్ద బడ్జెట్ ఫిలిం ప్లాన్ చేశాడు. కథ సిద్ధమయింది. కాస్టింగ్ ఇంచుమించు అయిపోయింది. డైలాగ్ బేస్డ్ పిక్చర్ కావడంతో షూటింగింకా మొదలవకుండానే, చందూబాబుకి అశ్వత్థామసర్‌తో నాలుగు సిటింగ్స్‌య్యాయి. ఆ డైలాగ్స్‌కి జోహారన్నాడు చందూబాబు!

అప్పటికి అశ్వత్థామ సర్, చందూబాబు కాంబినేషన్లో ఆరు సినిమాలు వచ్చాయి. అన్నీ బ్లాక్‌బస్టర్స్! అన్నింట్లో డైలాగ్స్

సూపర్ హిట్. ఈ సినిమా వాటిని మించిపోతుందని చందూబాబు అభిప్రాయపడ్డాడు.

అశ్వత్థామ సర్ డైలాగ్స్ కంప్యూటర్లో వ్రాస్తాడు. ఓ ఫైలు దర్శకుడికిస్తాడు. షూటింగ్ సమయంలో ఆయా పాత్రల పోర్షన్స్ ప్రింటు తీసి ఇవ్వడమే తప్ప, అసిస్టెంటు డైరెక్టర్ల చేత రాయించడం ఉండదు. డైలాగ్స్ బయటకు లీకవకుండా టెక్నీషియన్స్‌తో సహా అంతా జాగ్రత్త పడతారు.

ఈసారి డైలాగ్స్ దర్శకుడిదాకా వెళ్లేలోగానే, ఈ ఘటన జరిగింది. చందూబాబుకి అంతగా నచ్చిన ఆ డైలాగ్స్ ఫైలు కోసం అన్వేషణ మొదలైంది.




ముందు అశ్వత్థామ సర్ లాప్‌టాప్‌లో చూశారు. కొత్త చిత్రం పేరిట ఒక ఫోల్డర్ కనబడింది. అందులో ఒకేఒక ఫైలు... సినిమావాళ్లు కథ చెప్పడానికి వ్రాసుకునే వన్ లైన్ స్టోరీలా ఉంది. అంతకు మించి ఇంకే ఫైల్సూ లేవు.

వేరే పెన్‌డ్రైవ్స్‌లో ఉందేమోనని అడిగితే, ఇంట్లోవాళ్లు బుద్ధిగా సినిమాలకు సంబంధించి పన్నెండు పెన్‌డ్రైవులూ, ఒక పోర్టబుల్ హార్డ్‌డిస్కూ ఇచ్చారు. ఇద్దరు అసిస్టెంటు డైరెక్టర్లు ఓపికగా వాటిలో వెదికారు. కావలసింది దొరకలేదు.

రామశేషుసర్‌కి కాళ్లూ చేతులూ ఆడలేదు.

డైలాగ్స్ విన్నవాడు హీరో ఒక్కడే! అతడివద్ద ఫైలు లేదు. ఇక డైలాగ్స్ గురించి తెలిస్తే ఇంట్లోవాళ్లకి తెలియాలి. లేదా ఆయన అసిస్టెంట్లకి తెలియాలి. చందూబాబు కొత్త చిత్రానికి సంబంధించి, ఆయనకి డైలాగ్స్ అసిస్టెంటుని నేను. కానీ నావద్ద ఆ ఫైలు లేదు. ఐతే చందూబాబుకి అశ్వత్థామసర్ డైలాగ్స్ వినిపించినప్పుడు పక్కన నేనున్నాను.

ఆ డైలాగ్స్ సంపాదించి ఇచ్చినవారికి లక్ష రూపాయల బహుమతిని ప్రకటించాడు రామశేషు సర్.

లక్ష రూపాయలనగానే చాలామంది రంగంలోకి దిగి ఆచూకీలు మొదలెట్టారు. అందులో బయటపడ్డ కొత్త విశేషం ఒకటుంది. చనిపోయే రోజు ఉదయం అశ్వత్థామసర్‌ని వీర్రాజు కలుసుకున్నాడు. సర్ వీర్రాజుకి ఓ కవరిచ్చాడు.

వీర్రాజు ఓ పెద్ద డైరెక్టరు దగ్గర అసిస్టెంటు డైరెక్టరుగా పని చేస్తున్నాడు. రెండు షార్ట్‌ఫిల్ములూ, ఒక ఓటిటి సినిమా తీశాడు. విమర్శకులు ఫరవాలేదన్నారు కానీ, ప్రేక్షకులు మెచ్చలేదు. బిగ్ స్క్రీన్ బ్రేక్ కోసం చూస్తున్నాడు.

రామశేషు సర్ వీర్రాజుని కలుసుకున్నాడు.

"చందూబాబుతో సినిమాని తనే డైరెక్ట్ చెయ్యాలని అశ్వత్థామ సర్ అనుకున్నాడు. నన్ను కోడైరెక్టరుగా అడిగాడు. సరేనంటే, డైలాగ్ వెర్షన్ ఇచ్చాడు" అన్నాడు వీర్రాజు.

రామశేషు సర్ తేలికగా నిట్టూర్చి, "హమ్మయ్య! డైలాగ్ వెర్షన్ నీ దగ్గరుందన్న మాట! అనుకోకుండా, అశ్వత్థామ నీకు లక్ష రూపాయలు లాభం తెచ్చాడు!" అన్నాడు లౌక్యంగా.

"సారీ, మీరేమనుకోవద్దు. ఆ డైలాగ్సు అశ్వత్థామ సర్ నాకోసం ఇచ్చాడు. కాబట్టి వాటిని మీకివ్వాలని నియమం లేదు. కానీ వాటిని నేనేం చేసుకుంటాను? ఈ పిక్చరుకి నన్ను కో డైరెక్టరుగా తీసుకోండి. ఇస్తాను!" అని బేరం పెట్టాడు.

"ఆల్రెడీ ఈ పిక్చరుకి ఇంద్రకుమార్ని డైరెక్టరుగా అనుకున్నాం. అతడు అసిస్టెంట్లనే తప్ప అసోసియేట్లని కూడా పెట్టుకోడు. కోడైరెక్టర్ క్వశ్చనే లేదు!" అన్నాడు రామశేషు సర్.

"అశ్వత్థామ సర్ బ్రతికుంటే ఈ సినిమాకి తనే డైరెక్టరయుండేవాడు. అప్పుడు నేనెలాగూ కోడైరెక్టర్ని అయ్యేవాణ్ణి. కాబట్టి ఆలోచించండి. డైలాగ్సు కావాలంటే నా షరతు నాది!" అన్నాడు వీర్రాజు.

రామశేషు సర్ అయోమయంలో పడ్డాడు. అశ్వత్థామసర్‌కి సినిమా డైరెక్ట్ చేసే ఉద్దేశ్యముంటే, తనకా విషయం ముందే చెప్పేవాడు. తను ఇంద్రకుమార్ సర్‌ని డైరెక్టరుగా అనుకుంటున్నట్లు ఆయనకి తెలుసు. కాబట్టి వీర్రాజు చెప్పేది నిజం కాదని అనుకుంటే... అతడికి డైలాగ్ వెర్షన్ ఎందుకిచ్చినట్లు?

అశ్వత్థామ సర్ తన డైలాగ్ వెర్షన్ని అంత సులువుగా ఎవరికీ ఇవ్వడు. కానీ ఎందుకో ఇచ్చాడు. లేదా వీర్రాజు ఏదో మాయ చేసి ఆ వెర్షన్ సంపాదించాడు. సర్ మరణంతో దాని విలువ పెరిగింది. అంత సులువుగా తనకిస్తాడా?

ఫీల్డులో ఉన్నవాడు... కోట్ల విలువ చేసే కాగితాల్ని లక్ష రూపాయలకు కక్కుర్తి పడి తనకిస్తాడా?

రామశేషు సర్‌కి వీర్రాజుతో సినిమా చేసే ఉద్దేశ్యం లేదు. బాగా ఆలోచించి ఆయనో రోజు సాయంత్రం తనింట్లో చిన్న రహస్య సమావేశం ఏర్పాటు చేశాడు.

దర్శకుడు ఇంద్రకుమార్ సర్, ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు, నేను, రామశేషు సర్ ఆ మీటింగులో పాల్గొన్నాం.

సర్ మొత్తం సమస్యని అందరికీ వివరించి చెప్పాడు. శాంతంగా విన్నాం.

"డైలాగ్సు ఎంతైనా బాగుండొచ్చు. దర్శకుడి ప్లేస్‌మెంటూ, హీరో రెండరింగూ... ఇవే వాటిని హిట్ చేసేవి. కేవలం డైలాగ్సుని బట్టి ముందుకెడితే అంతే సంగతులు. మీరు వీర్రాజు బ్లాక్‌మెయిలింగుకి లొంగకపోవడం... ఇటీజే వెరీ క్లెవర్ అండ్ గుడ్ డెసిషన్!" అన్నాడు ఇంద్రకుమార్ సర్.

"నా నిర్ణయం నాకూ నచ్చింది. మరి చందూబాబుకి అంతగా నచ్చిన డైలాగ్సు సంపాదించడమెలా?" అన్నాడు రామశేషు సర్.

"ఐడియా" అన్నాడు ఇంద్రకుమార్‌సర్.

అంతా అతడివంక కుతూహలంగా చూడ్డం గమనించాను.

"అలా చూస్తారేం? మన సారంగ్ ఏకసంథాగ్రాహి అని మీకెవ్వరికీ తెలియదా?"

తెల్లబోయాను. అతడన్నది బుర్రకెక్కేక, 'నాకే తెలియదు. మీకెలా తెలుస్తుంది?' అనుకున్నాను.

"ఐతే?" అన్నాడు రామశేషు సర్.

"చందూబాబు అశ్వత్థామ సర్ డైలాగ్సు వింటున్నప్పుడు, అక్కడే సారంగ్ కూడా ఉన్నాడు. అవన్నీ గుర్తుండే ఉంటాయి. కాసేపు ప్రశాంతంగా కూర్చుని వాటిని గుర్తుకి తెచ్చుకుని, కాగితంమీద... అదే కంప్యూటరుమీద పెడితే సరి...."

నేనేదో అనేలోగా, "హుర్రే" అన్నాడు రామశేషు సర్. అంటే ఆ సలహా ఆయనకు నచ్చింది.

తడబడుతూ, "ఇది వల్ల అవుతుందని నిజంగా నమ్ముతున్నారా?" అన్నాను.

సర్ లేచి నావద్దకొచ్చి భుజం తట్టాడు, "కమాన్ మైడియర్ బాయ్! లైఫులో నీకిదో పెద్ద బ్రేకు!" అన్నాడు.

ఐదేళ్లుగా అశ్వత్థామ వద్ద అసిస్టెంటుగా పనిచేస్తున్నాను. పదాల ఎంపికలో, ప్రయోగంలో ఒడుపులన్నీ ఈపాటికి పట్టి ఉండాలి. అందులోనూ మొత్తం డైలాగ్సన్నీ ఓసారి విని ఉన్నాను. అదీ హీరో చందూబాబు నోట!

"చందూబాబు డైలాగ్సు చాలా ఎఫెక్టివ్‌గా చెబుతాడు. గుర్తుండిపోవడానికి అదీ ఓ కారణమన్నావనుకో. ముున్ముందు ఆయన సినిమాలన్నింటికీ నువ్వే రైటరువి" ప్రోత్సహించాడు రామశేషు.

ఒప్పుకున్నాను. రెండ్రోజుల్లో డైలాగ్స్ రెడీ చేశాను. ముందు మా చిన్న టీముకి వినిపించాను.

"సెబాష్. చనిపోయింది అశ్వత్థామ అనే వ్యక్తి. అశ్వత్థామ అనే రచయిత కాదని నిరూపించావు" అన్నాడు రామశేషు సర్. తర్వాత హీరో చందూబాబుతో నాలుగు సిటింగ్సయ్యాయి. ఆయన నన్ను ఆకాశానికెత్తేశాడు.

షూటింగ్ మొదలైంది. నాలుగు నెలల్లో పిక్చర్ రిలీజైంది. టైటిల్సులో డైలాగ్ రైటరుగా నా పేరు వేసి, బ్రాకెట్లలో 'అశ్వత్థామ సౌజన్యంతో' అని వేశారు.

డైలాగ్సుకి అశ్వత్థామ సర్‌కి అడ్వాన్సుగా పది లక్షలు ఇచ్చారుట. ఇంకా తొంభై లక్షలివ్వాలి. కానీ ఆయన డైలాగ్సు పూర్తి చెయ్యకపోయినా, చనిపోయారన్న సానుభూతితో మరో ఐదు లక్షలిచ్చారు. ఆయనతో సమంగా నాకూ ఓ ఐదు లక్షలిచ్చారు. అశ్వత్థామ సర్ మరణం నిర్మాతకి ఎనభై లక్షల లాభం తెచ్చిపెట్టింది.

అన్యాయమని తెలుసు. కానీ నాకు బ్రేక్ కావాలి. అంతవరకూ షిర్డీ సాయిబాబా చెప్పినట్లు శ్రద్ధా, సబూరీ తప్పదు.

సినిమా రిలీజై వసూళ్లలో రికార్డులు బ్రేక్ చేస్తోంది. సారంగ్ డైలాగ్స్ అశ్వత్థామ సర్‌ని మించిపోయాయని టాక్ వచ్చింది. చందూబాబు నెక్స్ట్ సినిమాలో డైలాగ్సు రాయడానికి నాకు యాభై లక్షల ఆఫర్ వచ్చింది.

అశ్వత్థామ సర్ నాకు సినిమాకి లక్ష రూపాయలిచ్చేవాడు. ఇప్పుడు నా ఆదాయం ఒక్కసారిగా యాభై రెట్లు పెరిగింది.

జరిగిన కథంతా ఇంట్లో తెలుసు. "ఎక్కాలు రాక లెక్కలు వద్దనేవాడివి. నీకీ ఏకసంథాగ్రాహిత్వం ఎప్పుడొచ్చిందిరా?" అని అమ్మా, నాన్నా, అన్నయ్యా కూడా ఆశ్చర్యపడ్డారు.

"అంతా డబ్బు మహిమ" అన్నానే తప్ప అసలు విషయం నా నోటితో వాళ్లకి చెప్పలేదు. వాళ్లకి తెలిసింది చెప్పినా కూడా కాదనే అంటాను. అది సినీ లోకపు కోడ్. బహిరంగ రహస్యమైనా సరే, పొరపాటున కూడా తెలిసినట్లు ఎవరూ ఒప్పుకోరు. ఆకాశానికెత్తినా, పాతాళానికి క్రుంగినా బహిరంగ రహస్యాల విషయాల్లో మాత్రం అంతా గప్‌చుప్!

అందుకే రామశేషు సర్ అంత డ్రామా ఆడాడు. అందులో నన్నూ పాత్రధారిని చేశాడు. తను లాభపడి నా భవిష్యత్తుకి దారి చూపాడు.

సినీరంగంలో ప్రతిభకంటే పలుకుబడి, హోదాలకే విలువెక్కువ. అవి ఉన్నవారు 'మహా' కళాకారులు కాగలరు. 'మహా' ఏమైనా కాగలరు. ఆ 'మహా'ల నీడ లభిస్తేనే ప్రతిభకు మనుగడ. ఆ నీడ తప్పుకున్నప్పుడే ప్రతిభకు ఎదుగుదల మొదలౌతుంది.

నేనిప్పుడు ఎదుగుతున్నాను. అశ్వత్థామ సర్ పెద్ద ప్రాజెక్టుల్లో మరొకటి నాకొచ్చింది.

డైరెక్టర్ ప్రవీణ్ అనే కొత్త కుర్రాడు. హీరో చందూబాబు కాదు. జైబాబు అనబడే జయసింహ.

"జైబాబుకి కథ చెప్పాను. నచ్చింది. డైలాగ్స్ మీరే రాయాలంటున్నారు. కొన్ని సీన్లకి డైలాగ్స్ రాసి తీసుకురండి. జైసారు ట్రై చేసి ఓకే చేస్తే, ప్రొసీడైపోదాం" అన్నాడతడు.

చందూబాబు డైలాగ్స్ సిటింగన్నాడు. కాబట్టి జైబాబూ అంటాడు. ఇది సినీరంగంలో రివాజు.

చందూబాబు డైలాగ్సుకి నేను స్పెషలిస్టుని. కానీ జైబాబుకి నప్పాలంటే...

మొబైల్ తీసి ఓ నంబరుకి ఫోన్ చేసి, "హలో శివా! హీరో జైబాబు ప్రాజెక్టొకటుంది. లక్షన్నర ఇస్తాను. ఆర్యూ ఫ్రీ?" అన్నాను.

అశ్వత్థామ సర్ ఐతే లక్షే ఇచ్చేవాడు. నేను లక్షన్నర అనగానే ఏం బదులొస్తుందో నాకు తెలుసు.

"థాంక్యూ సర్" అన్నాడు శివ.

# వైకుంఠపాళి

యస్వీ కృష్ణ



9399939302

**సినిమా రంగమార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***రవికిరణ్ నీ పేరుమీద పెట్టిన ఆస్తుల్ని, నిన్ను నామినీగా పెట్టిన స్థిరాస్థినీ వీలైనంత త్వరగా క్యాష్‌గా మార్చుకో. ఆ తర్వాత నీ మకాం ముంబైలో! బాలీవుడ్‌లో నీ కెరీర్‌ని నేనే డిజైన్ చేస్తాను. నా కంప్లీట్ ప్రొటెక్షన్, సెక్యూరిటీ నీకుంటాయ్. నీ ఆస్తిలో ఒక్క రూపాయి కూడా నాకక్కర్లేదు. బట్... నువ్వు 'నా మనిషి'గా ఉండాలి.***

''రవికిరణ్‌గారూ! డాక్టర్లూ, లాయర్ల దగ్గర నిజం దాచొద్దు. జరిగిందేమిటో వివరంగా చెప్పండి!''

''ఏముంది చెప్పడానికి? నేను చెప్పాల్సిందేదో పోలీసులకి చెప్పేశానుగా!''

''కావొచ్చు. మీరు పోలీసులకిచ్చిన 'కన్ఫెషన్ స్టేట్‌మెంట్'నే వాళ్ళు తమ ఛార్జ్‌షీట్‌తో పాటు కోర్టుకి సబ్మిట్ చేస్తారు. అయితే... క్రిమినల్ కేసుల్లో పోలీసుల ఛార్జ్‌షీట్‌ని కోర్టులో పటాపంచలు చేసి ఎక్యూజ్డ్ పర్సన్‌ని కేసులోంచి బయటకు తేవడమే మా డిఫెన్స్ లాయర్ల పని.''

''కానీ... నేరం చేశానని నేనే ఒప్పుకుంటున్నాను కదా!''

''అదే వచ్చిన చిక్కు! చేయని నేరాన్ని ఎందుకు మీపైన వేసుకుంటున్నారు రవికిరణ్‌గారూ?''

''చూడండి లాయర్‌గారూ! నేరం జరిగినప్పుడు ఇంట్లో నేనూ, నా భార్య మాత్రమే ఉన్నాం. కాబట్టి మా ఇద్దరిలో ఎవరో ఒకరు ఈ నేరం చేసివుండాలి. నేనే చేశానని ఒప్పుకుంటున్నానుగా!''

''పోలీసులు చెప్తున్నది కూడా అదే... సంఘటనా స్థలంలో మీరూ, మీ శ్రీమతి హారిక మాత్రమే ఉన్నారని! అయితే మీరు మాత్రం ఈ నేరం చేయలేదని మీకూ తెలుసు, నాకూ తెలుసు.''

''అంత కచ్చితంగా ఎలా చెప్పగలరు? నా లైసెన్స్‌డ్ రివాల్వర్ నుంచే నాలుగు రౌండ్ల కాల్పులు జరిగాయి. రివాల్వర్ నా చేతిలోనే వుంది. బుల్లెట్స్ ఎదుటివ్యక్తి దేహంలోకి దూసుకెళ్లాయి. అతడు నా ముందే రక్తపుమడుగులో పడివున్నాడు. అతడి ప్రక్కనే చేతిలో రివాల్వర్‌తో నేను నిల్చొనివున్నాను... పోలీసులొచ్చేసరికి ఇదీ సీన్! స్పాట్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా నన్ను కస్టడీలోకి తీసుకున్నారు...''

''అఫ్‌కోర్స్! సాక్ష్యాలన్నీ మీరే నేరం చేసినట్లు చెప్తున్నాయ్. ఐనా నేరం మీరు చేయలేదని చెప్పగలను. ఎలాగంటే... సంఘటనకి ముందురోజు రాత్రి చెన్నయ్‌లో ఓ సినిమా అవార్డ్స్ ఫంక్షన్‌లో పాల్గొన్న మీరు, మర్నాడు ఉదయం ఫ్లైట్‌లో హైదరాబాద్‌కి బయల్దేరారు. అయితే వాతావరణంలో మంచు ఎక్కువైన కారణంగా ఆ ఫ్లైట్ రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరి,

హైదరాబాద్‌కి ఉదయం 8:10 కి చేరుకుంది. ఎయిర్‌పోర్ట్ నుంచి కారులో ఎంత స్పీడ్‌గా వచ్చినా మీరు ఇంటికి చేరేందుకు కనీసం నలభై ఐదు నిమిషాలకు పైనే పడ్తుంది. అంటే... మీరు ఇంటికి చేరేసరికి కనీసం ఉదయం 8:55 అవుతుంది. కానీ, డాక్టర్ రిపోర్ట్ ప్రకారం కాల్పులు జరిగింది ఉదయం 7:35 నుంచి 8:00 మధ్య కాలంలో!''

రవికిరణ్ మాట్లాడలేదు. తనలో తానే ఏదో ఆలోచిస్తుండడంతో లాయర్ లేచి నించున్నాడు.

''చూడండీ... మీరు అందర్లా కాదు. తెలుగు సినీఫీల్డ్‌లో మీరొక నోటెడ్ డైరెక్టర్. ఎవర్నో కాపాడాలనుకొని చేయని నేరాన్ని మీపైన వేసుకొని విలువైన మీ జీవితాన్నీ, కెరీర్‌నీ పాడుచేసుకోకండి. కోర్టులో మీ తరపు స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయడానికి ఇంకాస్త టైముంది. బాగా ఆలోచించి ఓ మంచి నిర్ణయానికి రండి. ఈలోగా నేను మీ బెయిల్‌కి ఏర్పాట్లు చేస్తాను!'' అని, అక్కణ్ణుంచి కదిలాడు.

రవికిరణ్ మాట్లాడలేదు. తన ఇంట్లో... తన రివాల్వర్‌తోనే ఓ వ్యక్తిపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపి హత్యానేరానికి పాల్పడిన అభియోగంపై అరెస్టయి, ఆ జైలులో 'రిమాండ్ ఖైదీ'గా ఉన్నాడతను.



అతడి మనసూ, భావాలూ, ఆలోచనలూ... అన్నీ 'ఆమె' చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి!

★★★

హారిక... అందానికీ, అమాయకత్వంకీ మారుపేరు. నిజానికి ఆమె అసలు పేరు అర్చన. అయితే రవికిరణే ఆమె పేరుని 'హారిక'గా మార్చి, హీరోయిన్‌గా ప్రేక్షకులకి పరిచయం చేశాడు.

దర్శకుడిగా రవికిరణ్ తన మూడో సినిమా తీస్తున్నప్పుడు... అందులోని ఓ డ్యూయట్‌సాంగ్ షూట్ చేసేటప్పుడు... హీరోయిన్ వెనకుండే గ్రూప్‌డాన్సర్లలో ఒకరిగా తొలిసారి చూశాడామెని. అంతే... అందంతో పాటు ఆమె ముఖంలోని అమాయకత్వం, స్వచ్ఛత... వెంటనే ఆకట్టుకున్నాయతడిని.

అప్పటికే రెండు హిట్ సినిమాలకి దర్శకుడిగా పనిచేసి, మూడో సినిమాని డైరెక్ట్ చేస్తున్నాడతను. దాని తరువాతి సినిమాకి తనే నిర్మాతగా మారి దర్శకత్వం చేయాలనుకొని– ఓ డిఫరెంట్ ప్రేమకథని సిద్ధంచేసుకున్నాడు కూడా. అందులో హీరోయిన్‌గా అందంగా, స్వచ్ఛంగా, అమాయకంగా, క్యూట్‌గా కన్పిస్తూ కుర్రకారు హృదయాల్ని కొల్లగొట్టే కొత్తముఖం కోసం, న్యూ టాలెంట్‌కై అన్వేషిస్తున్నాడతను.

సరిగ్గా అలాంటి రూపురేఖల్తో, 'తను సృష్టించిన పాత్ర కోసమే పుట్టిందా...' అన్నట్లు కనిపించింది అర్చన. ఆ మరుసటి వారంలో ఆమెని ప్రొడక్షన్ ఆఫీసుకి పిలిపించాడు.

తన మేనత్తకొడుకు 'సింహాచలం'తో వచ్చిందామె. చిన్నప్పుడే ఆక్సిడెంట్‌లో తల్లిదండ్రుల్నీ, తమ్ముణ్ణీ కోల్పోయిన ఆమెకి అతడే 'కేర్‌టేకర్'... అట !

ఫోటోసెషన్స్, స్క్రీన్‌టెస్ట్, డైలాగ్ డెలివరీ, పెర్‌ఫార్మెన్స్‌లలో 'బెస్ట్'గా నిలిచింది అర్చన. అప్పటివరకు గుంపులో గ్రూప్‌డాన్సర్‌గా ఉండే 'అర్చన' కాస్తా... రవికిరణ్ స్వంతంగా నిర్మించి, దర్శకత్వం వహించిన 'నా ప్రేమ నీకే!'లో 'హారిక' పేరుతో హీరోయిన్ అయిపోయింది.

ఇక, ఆ సినిమా షూటింగ్ రోజుల్లోనే హారికతో ప్రేమలో పడిన రవికిరణ్, షూటింగ్ పూర్తయ్యి, సినిమా రిలీజ్‌కి సిద్ధమవుతున్న రోజుల్లో తన ప్రేమ ఆమెకి తెల్పి, 'పెళ్ళి' గురించి ప్రపోజ్ చేశాడు.

తన 'గార్డియన్' కమ్ 'కేర్‌టేకర్' సింహాచలంతో చర్చించి, తన అంగీకారం తెల్పింది హారిక. ఆపై అత్యంత సన్నిహితుల మధ్య హారికతో అతడి పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది.

అంతేకాదు... రవికిరణ్ డైరెక్షన్‌లో హారిక హీరోయిన్‌గా నటించిన 'నా ప్రేమ నీకే!' రిలీజై సూపర్ డూపర్ 'హిట్' అయ్యి, కలెక్షన్ల వర్షం కురిపించింది. ఆతర్వాత డైరెక్టర్‌గా రవికిరణ్‌కీ, హీరోయిన్‌గా హారికకీ ఎన్నో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. జాగ్రత్తగా ఆచితూచి సెలెక్టెడ్ సినిమాలనే ఎంచుకున్నారిద్దరూ. అందువల్లే 'నా ప్రేమ నీకే!' తర్వాత విడుదలైన హారిక సినిమాలు రెండూ హిట్టయ్యాయి. సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా హారిక 'హ్యాట్రిక్' సాధించింది.

కానీ, దురదృష్టవశాత్తూ ఆ సినిమా తర్వాత రవికిరణ్ డైరెక్షన్‌లో రిలీజైన రెండు సినిమాలు ఘోరంగా ఫ్లాపయ్యాయి.

సినీఫీల్డ్‌లో ఏదైనా సినిమా హిట్ అయ్యిందంటే, అందులో నటించిన హీరోహీరోయిన్లు ఒక్కసారిగా "స్టార్ హీరో హీరోయిన్‌ల లెవెల్‌కి దూసుకెళ్ళిపోతారు. అదే ఒక సినిమా "ఫ్లాప్" అయితే మాత్రం, దాని ప్రభావం హీరో హీరోయిన్లకి పెద్దగా పడదు. వాళ్ళకి వేరే సినిమాల్లో అవకాశాలు తప్పకుండా వస్తాయి. కానీ ఆ "ఫ్లాప్ సినిమా" డైరెక్టర్‌కి మాత్రం దాని ప్రభావం చాలా ఘోరంగా తగుల్తుంది. అతడికి డైరెక్టర్‌గా మరో అవకాశం దొరకడం మహా దుర్లభం.

కేవలం ఒకట్రెండు సక్సెస్‌లతోనే ఆకాశమంత ఎత్తుకి ఎదగటం, ఒకట్రెండు ఫెయిల్యూర్స్‌తోనే అధఃపాతాళంలోకి పడిపోవడం సినీరంగంలో సర్వసాధారణం కాబట్టి, హారిక కెరియర్ సక్సెస్‌మార్గంలో దూసుకెళ్తూంటే, అదే వేగంతో రవికిరణ్ కెరియర్ ఫెయిల్యూర్ బాట పట్టింది.

అయితే కెరియర్ పరంగా తారుమారైన తన పరిస్థితికి బాగా డిస్టర్బ్ అయిన రవికిరణ్‌ని ఇంకాస్త డిస్టర్బ్ చేసిన అంశం... 'సింహాచలం!'

★★★

''ఇన్నాళ్లూ నా బాగోగులు చూసి, నన్ను పోషించిన సింహాచలంకి ప్రత్యుపకారం ఏమీ చేయకుండానే ఇప్పుడు నా దారి నేను చూసుకుంటే ఏం న్యాయంగా ఉంటుంది చెప్పండీ!'' పెళ్ళయిన కొత్తలో హారిక అన్న మాటలకి, ఓ సినీస్టూడియోలో 'ఫ్లోర్ ఇన్‌ఛార్జ్'గా తన పరపతి నుపయోగించి సింహాచలానికి ఉద్యోగమిప్పించాడు రవికిరణ్.

అయినా, తరచూ అతడు తమ ఇంటికొస్తూ, పోతూ హారిక నుంచి పదివేలో, పాతికవేలో పట్టుకుపోతూండడం రవికిరణ్ గమనించినప్పుడు...''నేనీరోజు ఈ స్థితిలో ఉన్నానంటే కారణం అతడే కదండీ! అతడి పట్ల ఈమాత్రం కృతజ్ఞత చూపించడం నా ధర్మం కదా!'' అనేది.

అలా అమాయకంగా పలికే హారికని చూస్తూంటే... కల్మషం లేని ఆమె స్వచ్ఛమైన మనస్సూ, కరుణ, కృతజ్ఞతలతో నిండిన ఆమె మానవత్వం, అందమైన ఆమె ముఖంలో స్పష్టంగా కన్పించేవి. అంతే... ఆమె పైన తన మనసులోని ప్రేమ ఉప్పొంగేది రవికిరణ్‌కి. ఇంకేమీ అనలేకపోయేవాడు.

అయితే గత కొన్నాళ్లుగా సింహాచలం వ్యవహారం మరీ చికాకు పెడుతోంది రవికిరణ్‌ని. సమయం, సందర్భం లేకుండా అతడు తమ ఇంటికి రావడం, ఆ సమయాల్లో అతడి చూపులు, మాటలు, వైఖరి, తనపట్ల గౌరవం లేనట్లుండే అతడి ప్రవర్తన... రవికిరణ్ మనసు నొప్పించింది.

ఈ విషయం హారికతో మాట్లాడాలని ప్రయత్నించాడు రవికిరణ్. కాని వరుస హిట్లతో పూర్తి బిజీగా మారిన హారికతో కనీసం ఒంటరిగా మాట్లాడే టైమ్ కూడా రవికిరణ్‌కి దొరకలేదు.

రోజులు గడిచేకొద్దీ తనకు ఖాళీసమయం ఎక్కువవడం, హారిక సినిమా షూటింగులతో క్షణం తీరిక లేకుండా బిజీ అయిపోతూండడం కూడా రవికిరణ్‌లోని 'మేల్ ఈగో'ని హర్ట్ చేసింది.

ఓరోజు తీర్మానించేశాడు... ''ఇక కొత్త సినిమాలేవీ సైన్ చేయకు. ఒప్పుకున్న సినిమాలు కూడా వెంటవెంటనే పూర్తిచేసెయ్. త్వరలో పిల్లల్ని కని లైఫ్‌లో సెటిలవుదాం!'' అని.

విస్మయంగా చూసింది హారిక. అయితే వెంటనే బదులివ్వలేదు. అప్పటికి మౌనంగా ఉండిపోయింది.

ఈ విషయం ఆమెతో మరోసారి సావధానంగా మాట్లాడాలనుకున్నాడు రవికిరణ్. కానీ, ఈలోపే ఈ సంఘటన జరిగిపోయింది. చెన్నయ్‌లో నాల్రోజుల పాటు జరిగిన 'సౌత్ ఇండియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని తిరిగొచ్చిన రవికిరణ్, ఇంట్లోకి అడుగుపెట్టగానే కన్పించిన దృశ్యం...

రక్తపుమడుగులో పడివున్న సింహాచలం, ప్రక్కనే చేతిలో రివాల్వర్‌తో బిత్తరచూపుల్తో హారిక!

★★★

లోనికొచ్చిన రవికిరణ్‌ని గట్టిగా వాటేసుకుని భోరుమని ఏడ్చేసింది హారిక!

''వీడు... ఈ సింహాచలంగాడు తన మనసులో నాపట్ల ఇలాంటి దురుద్దేశంతో ఉన్నాడని ఇన్నాళ్లూ తెలుసుకోలేక పోయానండీ! వీడు... వీడు నాపై అత్యాచారం చేయబోయాడు...'' అంటూమరింత గట్టిగా ఏడ్చింది.

అతడికేమీ అర్థంకాలేదు. ''అసలు వీడు ఇంట్లోకెలా వచ్చాడు?'' అన్నాడు అయోమయంగా.

''ఈరోజు ఉదయం ఫ్లైట్‌కి వస్తున్నానని మీరు రాత్రే ఫోన్ చేసి చెప్పాక నేను ఔట్‌డోర్ షూటింగ్ నుంచి నిన్నరాత్రి పదకొండు దాటాక ఇంటికొచ్చేశాను. నాల్రోజుల క్రితం మీరు చెన్నయ్‌కీ, మూడ్రోజుల క్రితం నేను ఔట్‌డోర్ షూటింగ్‌కి వెళ్లాం కాబట్టి పనివాళ్ళని కూడా ఓ నాల్రోజులు రావొద్దన్నాను. మీరు వస్తారు కదా... అని మెయిన్‌గేట్ లోపలివైపు తాళం కూడా రాత్రే

తీసివుంచాను. ఉదయం కాలింగ్‌బెల్ మోగితే... నిద్రమత్తులో లేచి 'మీరే కాబోలు' అనుకొని తలుపు తీశాను. వీడు గభాల్న లోనికి దూసుకొచ్చి 'చాలాకాలంగా నీపై కోరికతో వేగిపోతున్నాను, నా కోరిక తీర్చు!' అంటూ ఏంటేంటో వాగుతూ నాపై అత్యాచారం చేయబోయాడు. నాకు భయమేసి విదిలించుకున్నాను, పెనుగులాడాను. ఇక లాభం లేదనుకొని, మీ రివాల్వర్ చూపించి బెదిరించాలనుకున్నాను. ఐనా, వీడు నా పైపైకి వచ్చేస్తుంటే నాకు తెలీకుండానే కాల్చేశానండీ!'' అంది హారిక.

ఏం చేయాలో పాలుపోలేదు రవికిరణ్‌కి.

''నాకు... నాకు భయంగా ఉందండీ!'' కన్నీళ్లతో బేలగా, దీనంగా అంటున్న హారిక ముఖంలోకి చూస్తూంటే, హృదయం ద్రవించిపోయిందతడికి. 'నా హారికకేమీ జరక్కూడదు. తను ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగా ఉండాలి!' అంటూ అతడి మనసు ఘోషిస్తూంటే తీవ్రంగా ఆలోచించసాగాడు.

చివరికి ఓ నిర్ణయానికొచ్చి, ఆమె చేతిలోని రివాల్వర్‌ని తన చేతిలోకి తీసుకొని అన్నాడు''ఈ విషయం గురించి ఇంకేమీ ఆలోచించకు. లోపలికెళ్లి రెస్ట్ తీసుకో!'' అంటూ టీపాయ్ మీదున్న ఫోన్ దగ్గరికి నడిచాడు. ''అదేంటండీ...'' అంటూ హారిక ఏదో అనబోతూండగా...

''నేను చెప్పినట్లు చెయ్! వీడు నీపై అత్యాచారం చేయబోవడం, రివాల్వర్‌తో నువ్వు వీడ్ని కాల్చటం అన్నీ మర్చిపో! వీడసలు ఇంట్లోకిరావడం కూడా నీకు తెలీదు. నిన్నరాత్రి షూటింగ్ నుంచి లేటుగా ఇంటికొచ్చిన నువ్వు ఇంకా నిద్రలేవలేదు. ఓ.కే.?!'' అని ఓ క్షణమాగి, ''అసలు ఈ హత్య నువ్వు చేయలేదు, దీని గురించి నీకేమీ తెలీదు... అర్థమైందా?'' అన్నాడు.

అయ్యో, కానట్లుగా హారిక తలూపుతుండగా, ఫోన్ చేతిలోకి తీసుకుని నంబర్ డయల్ చేసి, చెవి దగ్గర పెట్టుకుంటూ... అవతలివైపు లిఫ్ట్ చేయగానే అన్నాడు ''హలో... పోలీస్‌స్టేషన్!''

★★★

''సార్...'' అనే పిలుపుకి గతంలోంచి వర్తమానంలోకి వస్తూ తలతిప్పి చూశాడు రవికిరణ్.

''మీకు బెయిల్ ఆర్డరొచ్చింది. సూపర్నెంట్ సార్ మిమ్మల్ని రమ్మన్నారు.'' అన్నాడు సెంట్రీ.

ఆలోచనలు కట్టిపెట్టి లేచి నిల్చున్నాడు రవికిరణ్.

జైలు కారిడార్‌లో సూపరింటెండెంట్ గదివైపు నడుస్తుండగా అడిగాడు సెంట్రీ ''సార్... మీరు తీసిన సిన్మాలన్నీ నేను చూశాన్సార్! మీ కొత్త సిన్మా ఎప్పుడొస్తుంది?''

తలతిప్పి అతడివైపు నిస్తేజంగా చూస్తూ చెప్పాడు రవికిరణ్. ''నేనిక్కడ్నుంచి వెళ్లాక, ఓ వారంతర్వాత షూటింగ్ స్టార్ట్ చేస్తాను. పేపర్లలో, టీవీ ఛానల్స్‌లో న్యూస్ వస్తుందిలే... చూస్తుండు!''

అతడు అన్నట్లుగానే వారంతర్వాత న్యూస్‌పేపర్లూ, టీవీ ఛానల్సూ రవికిరణ్ గురించిన ఓ వార్తను ప్రముఖంగా ప్రచురించాయ్. కానీ, అతడు చెప్పినట్లు సినిమా షూటింగ్ గురించి కాదు... 'ప్రముఖ సినీ దర్శకుడు రవికిరణ్ ఆత్మహత్య!'అని.

★★★

మరో రెండు వారాల తర్వాత... ఓ రాత్రి, రవికిరణ్ ఇంట్లోని మాస్టర్ బెడ్‌రూమ్‌లో...

''సో<... అన్నీ అనుకున్నట్లు పూర్తయినట్లేగా?ఇంకేం ఇబ్బంది రాదు కదా షిండే సాబ్?'' అంది హారిక, విస్కీ కలిపిన గ్లాసులో ఐస్‌క్యూబ్స్ వేసి ఎదురుగా కూర్చున్న వ్యక్తికి అందిస్తూ.

అతడు ఆ గ్లాసందుకుని సిప్ చేసి– ''నో... నో... నేనుండగా నీకు ఇబ్బందా?'' వచ్చీరాని తెలుగులో అని, ''ఎవ్రిథింగ్ ఈజ్ కంప్లీటెడ్ ఏజ్ వియ్ ప్లేన్డ్!'' అన్నాడు నవ్వుతూ.

హారిక నవ్వలేదు. ''ఎందుకో... రవికిరణ్‌ని తల్చుకుంటే కొద్దిగా బాధగా ఉంది!'' అంది.

''వావ్... సెంటిమెంటా?'' సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ వెటకారంగా అన్నాడు షిండే.

''ఛ... ఛ... అలాంటిదేం లేదు. ఒకప్పుడు హీరోయిన్ వెనక గ్రూప్‌డాన్సర్లలో ఒకదానిగా ఉండే నన్ను, ఉన్నఫళాన హీరోయిన్‌ని చేసి పబ్లిక్‌లో నాకింతటి ఇమేజ్, సక్సెస్ రావడానికీ, దాంతో బాలీవుడ్‌లో భారీసిన్మాల ప్రొడ్యూసరైన మీ చూపు నాపై పడటానికీ కారణం అతడే కదా... అనీ!''

''అఫ్‌కోర్స్... నీ అందం అలాంటిది! బట్ రవికిరణ్‌తో నీకు నిజంగానే ఎమోషనల్ అటాచ్మెంట్ ఉంటేగనుక, సిన్మాలు మానేసి, అతడ్ని పెళ్లాడి, పిల్లల్ని కని, ఇంటిపట్టునుండే ఇల్లాలివైపోవాల్సింది!''

''లేదు... లేదు! నేనలా అనుకోలేదు. నేనో గొప్పస్టార్‌ని కావాలి, దేశమంతా నాకు పేరు రావాలి, డబ్బు బాగా సంపాదించాలి. ఇదే నా లక్ష్యం. ఇది సాధించేందుకు నాకున్న పెట్టుబడి... నా అందం. అందుకే జూనియర్ ఆర్టిస్టుల సప్లయర్ సింహాచలంని పట్టుకుని గ్రూప్‌డాన్సులు చేస్తూ రవికిరణ్ కంట్లో పడ్డాను. అతడి ఆసరాతో హీరోయిన్ అయ్యాక నా లక్ష్యం పూర్తవుతుందనుకున్నాను. కానీ, నానాటికీ తన బ్లాక్‌మెయిలింగ్ 'రేంజ్' పెంచేస్తున్న సింహాచలం, 'పిల్లల్ని కని, ఇంటిపట్టునే ఉండు' అన్న రవికిరణ్‌ల వైఖరితో దిక్కుతోచలేదు నాకు. అలాంటి స్థితిలోనే మిమ్మల్ని ఆశ్రయించాను.''

''యస్... సరైన టైమ్‌కే మన 'కలయిక' జరిగింది. ఇక నీకేం ప్రాబ్లం లేదు. సింహాచలంతోపాటు అతడితో నీ కాపురం తాలూకు సాక్ష్యాలను నాశనం చేశాను. సింహాచలాన్ని తానే హత్య చేసినట్లు రవికిరణ్ తనంతట తాను పోలీసులకు సరండర్ అయ్యేలా ప్లాన్ చేశాను. బెయిల్‌పై బయటికొచ్చిన రవికిరణ్‌పై నీతో విషప్రయోగం చేయించి, 'కెరీర్‌లో ఫెయిల్యూర్‌నీ, హత్యానేరంతో వచ్చిన అప్రతిష్టనీ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నా'డని ప్రజల్నీ, పోలీసుల్నీ, మీడియానీ నమ్మించాను. అఫ్‌కోర్స్... నేను చెప్పినట్లు రియల్‌లైఫ్‌లో కూడా నటించి నువ్వొక 'మహానటి'వని ప్రూవ్ చేసుకున్నావనుకో!''

హారిక చిరునవ్వుతో అతడి ప్రశంసని స్వీకరించి, అందమైన తన కళ్ళను అల్లల్లాడిస్తూ లేచి బెడ్ దగ్గరికొచ్చి బెడ్‌షీట్లు సర్దుతూ పడక సిద్ధం చేస్తుండగా... అతడు ఆమెని సమీపిస్తూ అన్నాడు. ''హారికా! నీకు చాలా భవిష్యత్తుంది. నువ్వు కోరినట్లు నీ ఇమేజ్ డామేజ్ కాకుండా ప్రాబ్లమ్స్ అన్నీ సాల్వ్ చేశాను. ఇక నువ్వు ఒప్పుకున్న సౌత్ ఇండియన్ సిన్మాలన్నీ వెంటనే పూర్తిచేసెయ్. రవికిరణ్ నీ పేరుమీద పెట్టిన ఆస్తుల్ని, నిన్ను నామినీగా పెట్టిన స్థిరాస్థినీ వీలైనంత త్వరగా క్యాష్‌గా మార్చుకో. ఆ తర్వాత నీ మకాం ముంబైలో! బాలీవుడ్‌లో నీ కెరీర్‌ని నేనే డిజైన్ చేస్తాను. నా కంప్లీట్ ప్రొటెక్షన్, సెక్యూరిటీ నీకుంటాయ్. నీ ఆస్తిలో ఒక్క రూపాయి కూడా నాకక్కర్లేదు. బట్... నువ్వు 'నా మనిషి'గా ఉండాలి. నీకు ఎంతకాలం నటించాలనిపిస్తే అంతకాలం నటించు, సంపాదించుకో... నిర్మాతగా నాకూ సంపాదించి పెట్టు. నీ అందం, లావణ్యం, డిమాండ్ తగ్గినప్పుడో, నటించడం నీకు బోర్ కొట్టినప్పుడో మానేసి, నా 'సెకండ్ వైఫ్'గా లైఫ్‌లో సెటిలైపో!'' అని, ''అఫ్‌కోర్స్... నువ్వూ, నేనూ ప్రక్కప్రక్కన నిలబడ్తే చూసేవాళ్ళకి తండ్రీకూతుళ్ళలా కనబడ్తామనుకో! బట్ దాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు... ఏమంటావ్?'' అన్నాడు షిండే.

''ఏమంటాను... నన్ను మీ రెండో భార్యగా స్వీకరిస్తే అంతకంటే నాకింకేం కావాలి షిండేసాబ్?'' అంటూ అతడి కౌగిలిలో ఒదిగిపోతూ, ''ఇప్పుడు నాకు, నా మనసుకి హాయిగా, ప్రశాంతంగా ఉంది!'' తనలో తానే గొణుక్కుంటున్నట్లుగా పైకి అనేసింది. అది విని నవ్వేశాడు షిండే.

''అదేంటీ... ఎందుకు నవ్వారు?'' తలెత్తి అతడి ముఖంలోకి చూస్తూ అడిగింది హారిక.

''ఏంలేదు... 'పాపాలు చేసేకొద్దీ ఇంపుగానే ఉంటాయ్' అన్న పెద్దల మాట గుర్తొచ్చి!'' అన్నాడు.



📞8056024790

# రంగుల కల

వాడపల్లి పూర్ణ కామేశ్వరి

**సినిమా రంగమార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***అప్పుడే అక్కడికి చేరిన సుబోధ్‌కి ఒక్కసారిగా బుర్రలోనిబూజువదిలినట్లైంది.***
***గమ్యం గోచరమైంది. రంగంకాదు ముఖ్యం.***
***రాణింపు తెలిసినవారు సక్రమమార్గాన్నే ఎన్నుకుంటారని***
***బుజ్జగింపుగా అత్తయ్య చెప్పినది నెమ్మదిగా బోధపడింది సుబోధ్‌కు.***

"నాన్నగారూ, ఈ రోజు అన్నప్రాసనకార్యక్రమానికి మీరు వెళ్ళి వచ్చేయండీ. చిన్న కార్యక్రమమే కదాని నాటకానికొప్పుకున్నాను. రేపటి ఉపనయనం కార్యక్రమానికి నేను సిద్ధంగా ఉంటాను! " వినయంగా చెప్పాడు సుబ్రహ్మణ్య శాస్త్రి.

"ఏవిటో, ఈ మధ్య వీడు ఈ నాటకాల పిచ్చిలో పడిపోతున్నాడు. నడతలోను, మంత్రాల్లోలా తడబడడు కదా?"మనసులోనే సమాధానం లేని ప్రశ్నలను వేసుకుంటూ అన్నప్రాసన కార్యక్రమానికి బయలుదేరాడు సోమశాస్త్రి.

సత్య హరిశ్చంద్రుడు నాటక ప్రదర్శన! సత్యంకోసం ఆ మహారాజు పడిన కష్టాలు, ఆ దంపతుల ఆకలి బాధలు, చంద్రమతీదేవి పుత్రశోకం, ఒక్కో ఘట్టాన్నీ తలుచుకుని సుబ్రహ్మణ్యశాస్త్రికి మనసు తరుక్కుపోయింది. అందుకు కారణంలేకపోలేదు. తమ ఆర్థిక పరిస్థితీ ఇంచుమించు అలాంటిదే. వైదికక్రియలపట్ల తరుగుతున్న జనాదరణ ఒక కారణమైతే, యాంత్రికంగా మారుతున్న జీవనశైలివల్ల పాటించలేకపోవడం మరో కారణం!

తాతగారికి పౌరోహిత్యంలో వస్తున్న ఆదాయం ఇల్లు గడవడానికి అత్తెసరయ్యేది. ఐనా సరే పిల్లలందరికీ పట్టుదలతో వేదం నేర్పారు తాతగారు. వారి శిష్యరికంలో కొడుకులందరూ స్మార్తం నేర్చుకుని ప్రావీణ్యం సంపాదించారు. ఎంత కష్టపడినా ఐదువేళ్ళూ నోట్లోకి వెళ్ళడం కష్టతరమయ్యేది. ఏ రోజుకారోజు ఎంగిలిపడడం అసాధ్యమవుతుండేది. ఇంటికి పెద్దకూతురైన అత్తయ్యే అప్పట్లో అందరికీ అండయ్యింది. వేదవిద్యలు నేర్చిన అన్నదమ్ముల సంపాదనకంటే వెండితెరపై వెలుగుతున్న ఆమె సంపాదించిందే కుటుంబాన్నికాసింది. ఆరుగురు సంతానం గల సంసారాన్ని ఈదుకొచ్చింది ఆమె సంపాదనేనని ఒప్పుకోక తప్పదు.

తాతగారు నేర్పగా పురాణపఠనం, గ్రంథపఠనం అలవడిన పెద్దత్తయ్య హరికథాకాలక్షేపంలో నిష్ణాతురాలైంది. చేతిలో చిరతలు, కాలికి గజ్జెలు, పట్టుచీర, మెడలో ఒక పూలహారం ధరించి, తిలకం చక్కగా దిద్దుకుని. . . అత్తయ్య విరివిగా చెపుతుంటే ఆ చుట్టుపక్కల ఊళ్ళన్నీ ఆమె కథను విని తరించేవారు. తథానుసారం సంపాదన పెరిగింది. శుభకార్యాలతో నాన్నగారు, అపరకర్మలతో చిన్నాన్న సంపాదనకంటే పెద్దత్తయ్య హరికథలే ఇంటిని ఆదుకున్నాయి. ఊరూరా హరికథలు చెబుతున్న అత్తయ్యకు ఒక పుణ్యాత్ముడి ద్వారా వెండితెరపై నటించే అవకాశం లభించింది. మద్రాసుకు రమ్మని పిలుపు!

తాతగారు ఉగ్రరూపం దాల్చారు. సుముఖత చూపని తాతయ్యను ఒప్పించి వెళ్ళడం పెద్దత్తయ్యకు పెద్ద సవాలయ్యింది. తప్పలేదు. ఐతే ఆ నిర్ణయం తరువాత వెనుతిరిగి చూసుకునే పరిస్థితి రాలేదు.

పదిహేడేళ్ళ సుబ్రహ్మణ్యం మనసులో ఆ సంఘటన బలంగా నాటుకుపోయింది. భగవదనుగ్రహం చేకూరి కాలక్రమేణా వైదికవృత్తిలోనూ ఆదాయం పెరిగింది. తమ పిల్లలూ అందులోనే కొనసాగాలని ఆశపడ్డారు. సుబ్రహ్మణ్యానికి అంతగా రుచించలేదు. అతడికి అత్తయ్యే ఆదర్శమయ్యింది.

★★★



"అదేంటత్తయ్యా, ఆనాడు అతికష్టమ్మీద తాతగారిని కూడా ఒప్పించి నమ్మిన మార్గంలో వెళ్ళి గెలిచి నిరూపించిన నువ్వేనా ఈ మాటంటున్నదీ?" బాధగా అడిగాడు సుబ్రహ్మణ్యం.

"ఆ అనుభవంతోనే చెపుతున్నానురా నాన్నా! ఇదొక మాయాప్రపంచం. నీ మనస్తత్వానికి ఇక్కడ సరిపడదని నా ఉద్దేశ్యం. నువ్వు ఎంతో గొప్పదైన వేదవిద్యను నేర్చుకున్నావు. కుటుంబ పరిస్థితులు ఇప్పుడు మెరుగయ్యాయి. నా అభిప్రాయం కోరితే, మన పెద్దలు నీకు వేసిన బాటే బాగుంటుందంటాను. తప్పకుండా మద్రాసు వచ్చి నా దగ్గరే ఉండు. కానీ, సినిమాల్లో వేషాల కోసం కాదు. ఇక్కడ మా ఇంటి బ్రహ్మగారున్నారు. వారి శిష్యరికంలో నీ విద్యలు మరింత రాణిస్తాయి. సార్థకవంతమైన జీవితం సాగించాలనే నా ఆశ. నాది సలహానే సుమీ, తుది నిర్ణయం నీదే. నీ స్వేచ్ఛ నీకెప్పుడూ ఉంటుంది! " అనునయంగా చెప్పింది శ్రీకళగా మారిన కళావతి అత్తయ్య.

"సరే అత్తయ్యా. రమ్మన్నావు, నాకదే చాలు! మన పల్లెటూళ్ళలో మనకు ధనార్జన లేకపోవడం ఒక్కటేకాదు, ఈ కార్యక్రమాలపై ఇక్కడెవ్వరికీ శ్రద్ధాభక్తులున్నట్టు నాకనిపించదు. యాంత్రికంగా చేస్తున్నట్టు, చేయించే మనపై అలక్ష్యము! అక్కడికొచ్చి నాకేది మంచిదనిపిస్తే అదే చేస్తాను! " మారాం చేస్తున్న పసివాడిలా తనవైపు వాదం చెప్పాడు సుబ్బు.

★★★

కోడంబాక్కం రంగరాజపురంలో రెండవవీధిలోని మధ్యతరగతి ఇల్లు. లేత నీలంరంగు ప్రీమియర్ పద్మినీ కారు పోర్టికోలో ఉంది. గేటు స్తంభానికి చలువరాతిపై 'శ్రీకళ సుధీర్ నిలయం' నల్లని అక్షరాలతో మెరుస్తోంది.

“వణక్కం” చేతులు జోడిస్తూ అన్నాడో వ్యక్తి చేతిలోని పెట్టెనందుకుంటూ.

“నాన్ ఆదిమూలమ్ అంగయ్యా” అంటూ ఓ గదిలోకి తీసుకెళ్ళాడు.

అత్తయ్యింట్లో పాతికేళ్ళగా పనిచేస్తున్న మనిషనడంకంటే, ఆదిమూలమ్ కుటుంబంలో సభ్యుడు అనడమే సమంజసం. రాజోలు వచ్చినప్పుడల్లా అత్తయ్యమాటల్లో అస్తమానూ విన్న పేరే అది. సినిమా పరిశ్రమలో హీరోగా స్థిరపడాలని చిదంబరం నుండి వచ్చి, అక్కడ గెలవలేక... అత్తయ్య మావయ్యగార్లకు చేదోడైయ్యాడు. వారికి ఆప్తుడిగా పనుల్లన్నింటినీ చూసుకుంటూ అక్కడే స్థిరపడిపోయాడు.

శ్రీకళగా పేరు తెచ్చుకున్న అత్తయ్య అవకాశాలన్నీ అందిపుచ్చుకుని వెండితెరపై చిన్నపాత్రలు పోషిస్తూ, చిన్నతెర ధారావాహికలలో కూడా ప్రబలమైంది. గడ్డుకాలంలోనూ, మంచిరోజుల్లోనూ వారి పంచనే ఉంటూ డ్రైవరు మొదలుకొని మేనేజరువరకూ అన్నీ తానై వుండేవాడు ఆదిమూలమ్.

అంకులంటూ కొద్దిరోజుల్లోనే అతనికి ఎంతో చేరువైయ్యాడు సుబ్బు. కళత్తయ్య షూటింగుల్లో బిజీగా ఉన్నప్పుడు, మరో ప్రొడక్షను సైటుకి షూటింగులకి తీసుకువెళ్ళి చూపించేవాడు ఆదిమూలమ్. సినిమా ప్రపంచంలోని చమక్కులు చూస్తున్న సుబ్బుకి ఉత్సాహం రెట్టింపైంది.

క్రమేణా, సుబ్రహ్మణ్యశాస్త్రి సుబోధ్ కుమార్‌గా మారాడు. హీరోకి ఉండవలసిన సహజ అందం ఉన్న సుబ్బు హెయిర్ స్టైలు, దుస్తులూ అనతికాలంలోనే మారిపోయాయి.

మేనల్లుడి నిర్ణయాన్ని గౌరవించాలని శ్రీకళ ఎలాంటి ఆంక్షలూ పెట్టలేదు. ఆశ పడ్డట్టే సుబోధ్ తలుపు తట్టింది అదృష్టం. ఆదిమూలమ్ చలువతో పరిచయాలు పెరిగి, చిన్నతెరకై నిర్మిస్తున్న ధారావాహికంలో ముఖ్యపాత్ర పోషించడానికి అవకాశం లభించింది.

“ఒరేయ్, గురుమహాదశ వస్తూనే పట్టుకోలేనంత ఉన్నతంగా ఎదిగిపోతావు, నా వాక్కు తిరుగులేదు. మహర్జాతకుడివిరా నువ్వు! “ రెండేళ్ళ క్రితం మేనమామన్న మాటలు గుర్తొచ్చాయి.

మావయ్య అన్న గురుమహాదశ మహిమ కాబోలని సంబరపడ్డాడు సుబోధ్.

“అత్తయ్యా... అత్తయ్యా... నోరు తెరువు. ఇవాళ మొత్తం స్వీటు తినాల్సిందే. నీ మేనల్లుడు హీరో అవ్వబోతున్నాడు! “ అతి త్వరలో హీరో అవ్వడానికి తొలిమెట్టు చిక్కిందని ఉప్పొంగిపోతూ అన్నాడు.

మేనల్లుడిని మనసారా ఆశీర్వదించింది శ్రీకళ.

తొలి షూటింగుకి ఇరవైనాలుగు గంటల వ్యవధి ఉంది. ఎప్పుడెప్పుడాని ఉవ్విళ్ళూరుతోంది మనసు. భావోద్రేకంతో రాత్రి తెల్లవార్లూ నిద్రపట్టలేదు. తెల్లవారుతూనే ఎంతో ఉత్సాహంగా తయారై వెళ్ళాడు.

ధారావాహిక ప్రారంభం క్లాప్ పూజకు ఏర్పాట్లు సిద్ధమైయ్యాయి. తీరుగా అమర్చిన పూజాసామగ్రి. విఘ్నాలు కలగకుండా కాపాడమంటూ, “శుక్లాంబరధరం విష్ణుం...” అంటూ గణపతిపూజ ప్రారంభించాడు పురోహితుడు. నొసట విభూతిరేఖలు మెరువగా, పంచె కచ్చకట్టుతో, చిన్నశిఖతో బాల కుమారస్వామిలా ఉన్నాడు. వాక్శుద్ధి కొరవైనా, శ్రద్ధగా కార్యక్రమాన్ని సుసంపన్నం చేశాడు.

బ్రహ్మస్థానంలో ఉన్నవారిని 'వాదియారు' అని సంబోధిస్తూ నిర్మాత, దర్శకుడూ, సిబ్బందీ అతడిని అమితంగా గౌరవిస్తున్నారు. క్లాపుతో షూటింగు ప్రారంభమైంది. ఎవరి గోల వారిదన్నట్టుంది. తన కాల్షీటుకి టైముండగా జరుగుతున్నదంతా శ్రద్ధగా చూస్తున్నాడు సుబోధ్. రోజంతా కాల్-షీట్ ఉంది. మేకప్ వేసుకుని డైలాగులు అధ్యయనం చేస్తున్నాడు.

"దాన్ని చూడు, ఎక్స్‌పోజింగుతో హీరోయిన్ ఛాన్స్ కొట్టేదామనే!" మేనేజరు అంటున్నది సుబోధ్ చెవిన పడింది. అంతకు మునుపే మేడమ్ అంటూ కూల్‌డ్రింకు అందిస్తూ, అతిమర్యాద చెయ్యడమూ చూసాడు.

స్టంట్ మాస్టర్ సగౌరవంగా సంబోధిస్తున్నాడందరినీ. గదిలోకి వెళ్ళిన హీరోయిన్ సిగరెట్టు పూర్తిచేసి వచ్చింది. యాంత్రికంగా పనిచేస్తూ అసహజమైన చిరునవ్వుని ముఖాన పులుముకున్నట్టనిపించింది.

ఒకే పనిలో కేంద్రీకృతమైన వారందరూ ఎవరి గొడవలో వారున్నారు. ఎదురుగా వున్నంతసేపూ చిరునవ్వు, వెనుదిరిగిన వెనువెంటనే నిరాదరణాభావం ప్రతీ కళాకారుడిలోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. హీరోయిన్ పాత్ర పోషిస్తున్న లయతో అసభ్య ప్రవర్తనను ప్రత్యక్షంగా వీక్షించవలసిన దుస్థితికి బాధ కలిగింది. కాగుతున్న నూనెలో పడ్డ నీటిబొట్టులా చిటపటలాడాడు. తనలో తాను బాధ పడ్డాడు. తెరపై చమక్కుల వెనుక ఇంత వ్యధుందా? అనిపించడానికి ఎంతోసేపు పట్టలేదు.

★★★

"హలో! నమస్కారం గురువుగారూ" వినయంగా అంది శ్రీకళ.

"నమస్కారమమ్మా. రేపు మన శ్రీపాదవారింట్లో వేదాశీర్వచన కార్యక్రమముందమ్మా! పనస, సామవేద అధ్యయనం చేసిన శిష్యుడు స్వకార్యార్థం ఊరెళ్ళాడు. రేపటి కార్యక్రమానికి విషయం తెలిసిన మరో వ్యక్తికావాలి. మొన్న మీ ఇంట్లో మీ మేనల్లుణ్ణి చూసాను. ఒక్క రెండుగంటలపాటు రాగలడేమో కనుక్కుందామని ఫోను చేసానమ్మా!" అన్నారు అశ్వినీ శాస్త్రిగారు.

"ఎంత మాటా! మీ అంతటి పండితులు ఆజ్ఞాపించాలి కానీ, అభ్యర్థించడమేమిటీ! తప్పక వస్తాడు!" వారిపై ఉన్న అపార గౌరవం వల్ల సుబోధ్‌ని అడగకుండానే హామీ ఇచ్చింది శ్రీకళ.

"నువ్వు చెప్పాక కాదని అంటానని ఎందుకనుకున్నావు అత్తయ్యా! తప్పక వెళతాను. "

పారిశ్రామికవేత్త శ్రీపాద శ్రీనివాసరావుగారింటికి అశ్వినీశాస్త్రిగారి బృందంతో వేదాశీర్వచన కార్యక్రమానికి వెళ్ళాడు సుబోధ్. ఒక్కొక్కరుగా, బృందంగా వేదాంశాలను పఠిస్తుంటే వాతావరణమే పావనోపేతంగా గోచరించింది. వేదఘోషకు హర్షించినట్టుగా వరుణుడు ఆనందభాష్పాలు కురిపించాడు. కార్యక్రమానంతరం, సతీసమేతంగా చందన తాంబూలములతో సత్కారించారు శ్రీపాదవారు. పాదాభివందము చేసి ఆశీస్సులు పొందారు దంపతులు. అంతటి గౌరవానికి పాత్రుడైన సుబోధ్‌కు తాను అభ్యసించిన విద్యపై మొదటిసారి గౌరవం కలిగింది. మనసు పులకించింది. ఐతే, ధనకాంక్ష ముందు ఆ ఆనందం చిన్నదే అయ్యింది. హీరో అవ్వాలన్న కోరిక సడలకపోగా, అవ్వగలనన్న ధైర్యము రెట్టింపయ్యింది.

★★★

"ఆడ్నింకా ప్రేక్షకులొప్పుకుంటారో లేదో తెల్దు. ఎట్టాంటేషం ఎప్పుడిచ్చినా సేత్తాడు కొత్తోడు కామట్టి... హీరో అని అన్నాంగానీ, అదే కరారు కాదు లేవో! అందాకా ఆడ్ని ఎటూ పోనీకండా సూసుకోండహో!" అసిస్టెంటు డైరెక్టరు మాటలు సుబోధ్ చెవిన పడ్డాయి.

"నిన్నటిదాకా హీరోనన్నారు. ఇప్పుడిదేంటి?" గొంతులో వెలక్కాయ పడింది.

వేదఘోష, అతడి మాటలు చెవుల్లో గింగిర్లు తిరిగాయి. మనసు కలుక్కుమంది. నా చోటిది కాదేమోననిపించింది. ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నచోటే, నేర్చినవిద్య రాణించగలదు.

★★★

శ్రీపాద శ్రీనివాసరావుగారికి గుండెపోటు వచ్చి ఆసుపత్రిలో చేర్చారని పిడుగులాంటి వార్తొచ్చింది.

ఇరవై గంటలూ "త్రయంబకం యజామహే..." మృత్యుంజయ జపం చేస్తున్నారు శిష్యగణంతో అశ్వనీశాస్త్రిగారు.

"సంపాదించిన లక్షలుకాదు బాబూ, మీరు చేసిన జపాలే ఆయన్నికాపాడాయి!" కళ్ళుతుడుచుకుంటూ అన్నారు వారిభార్య.

మంచం మీదనుండే రెండుచేతులూ జోడించి వారికి నమస్కరిస్తున్నారు శ్రీపాదవారు.

అప్పుడే అక్కడికి చేరిన సుబోధ్‌కి ఒక్కసారి బుర్రలోనిబూజువదిలినట్టైంది. గమ్యం గోచరమైంది.

రంగం కాదు ముఖ్యం. రాణింపు తెలిసినవారు సక్రమమార్గాన్నే ఎన్నుకుంటారని బుజ్జగింపుగా అత్తయ్య చెప్పినది నెమ్మదిగా బోధపడింది సుబోధ్‌కు. అత్తయ్య ఈ రంగంలో రాణించింది. కుటుంబానికి అన్నం పెట్టినవి వెండితెర, చిన్నతెర రంగాలే. కానీ తన గమ్యం వేరు. తన రంగులకల మిథ్య అని అర్థమైంది. చిత్రరంగం కోరిక తొలగిపోయింది. ధారావాహికంలో నటించడానికి తనకు వీలుపడదని నిర్మాతలకు సవినయంగా విన్నవించుకుని నిష్క్రమించాడు.

★★★

"గురువుగారూ, నేటినుండి మీతోనే నాపయనం. మీ శిష్యుడిగా స్వీకరించి ఆశీర్వదించండి!" అశ్వినీశాస్త్రిగారి పాదాల పై పడ్డాడు.

"మా తాతగారు, తండ్రిగారు విద్యలు నేర్పి నిర్దేశించిన త్రోవలోనే నడవాలని నిర్ణయించుకున్నాను. దిక్కుతోచక అడుగులు తడబడ్డాయి. కళ్ళకింపైనవన్నీ అందుకోవాలనుకోవడం పొరపాటని తెలిసింది. పౌరోహిత్యంలోని పారవశ్యాన్ని మీ సమక్షంలో పొందాను. పరమార్థం తెలుసుకున్నాను. అమ్మవంటి అత్తయ్య చక్కటి మార్గాన్నిచూపింది. సుబోధ్ అన్న పెట్టుడు పేరును త్యజిస్తున్నాను. సుబ్రహ్మణ్యశాస్త్రిగా సత్కార్యాలు చేయిస్తూ తరిస్తాను!" ఆనందంతో చెమర్చిన కళ్ళను తుడుచుకుంటూ అన్నాడు.

★★★

"విదుషీమణి బెంగళూరు నాగరత్నమ్మగారి జీవితచరిత్రపై చలనచిత్రం నిర్మించదలిచాము. ముఖ్యపాత్రకు మీరు తప్ప వేరెవ్వరూ అర్హులు కాలేరని మీ కాల్‌షీట్ కోసం కాల్ చేస్తున్నాను. మీ అంగీకారానికై ఎదురుచూస్తుంటాను!" ప్రముఖ నిర్మాత రాఘవరావు అన్నారు.

"బెంగళూరు నాగరత్నమ్మ ఓ అసాధారణ స్త్రీమూర్తి. సంగీత సాహిత్య సామాజిక రంగాల్లో ఆమె చూపిన ప్రతిభ, తెగువ విలక్షణమైనది. ఒక దేవదాసిగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నా తన జీవితాన్ని, త్యాగరాజ సంప్రదాయానికి అంకితం చేసిన విదుషీమణి. ఆమె జీవితచరిత్రను చిత్రించే పాత్ర పోషించడమంటే రంగులకలగా ఆరంభమైన నా జీవితం సఫలీకృతమవ్వడమే" అశ్రుధారలతో శ్రీకళ కళ్ళు వర్షించాయి.

# ఓ చిన్న సినిమా


## శ్రీ హవిష



8008706655


**సినిమా రంగమార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***ఏ రంగంలో అయినా ఒడిదుడుకులు అపజయాలు తప్పవు. కాని ఈ కళారంగానికి సంబంధించి అంతకు మించిన బాధ్యతతో కూడిన భయం వున్న వాడిదే విజయం. తెలిసి చేసినా తెలియక చేసినా చెల్లించుకోవాల్సిన మూల్యం భారీగా ఉంటుంది. నేను కేవలం ఒక్క సినిమా తీయడం కోసమే వచ్చాను.***
***ఈ ఒక్క సినిమాతోనే ఆపేస్తున్నాను.***

గంగాధరం బీ టెక్ చదివిన తర్వాత ఎంటెక్ చదవడం కోసం చెన్నైలోని ఒక ప్రముఖ కాలేజీలో చేరాడు. ఎంటెక్ చదువుతున్న రోజుల్లోనే చక్కని ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం రావటంతో గంగాధరానికి తల్లితండ్రులు ఒక మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేశారు. ఆ అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గంగాధరం భార్య కవిత చెన్నైలోని బ్రాంచ్ కి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాక, కొత్త కాపురాన్ని మొదలుపెట్టారు. చూస్తుండగానే గంగాధరం తన ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగిపోయాడు. ఇంతలో ఇద్దరు పిల్లలు, వారి ఆలనా పాలనా, చదువులతో సాగిపోతోంది జీవితం. మేనేజర్ పోస్ట్‌లో ఉన్న గంగాధరం తన కంపెనీలోని ఒక బ్రాంచికి హెడ్‌గా నియమించబడ్డాడు. చక్కగా సంపాదిస్తూ ఆస్తుల్ని కూడపెట్టి జీవితంలో స్థిరపడ్డాడు.

ఒకనాడు ఒక సినిమావారు షూటింగ్ నిమిత్తమై తన ఆఫీసుని అద్దెకు తీసుకోవడానికి వీళ్ళ బ్రాంచ్ కి వచ్చారు. ఆ బ్రాంచ్ హెడ్ అయిన గంగాధరం ఆ సినిమా వాళ్ళకి షరతులతో కూడుకున్న ఆమోదాన్ని తెలిపాడు. ఆ షరతులు ఏంటంటే మామూలుగా సినిమా షూటింగ్ అంటే చాలా హడావుడితో ఉంటుందని, వాళ్ళ ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఎంత వరకు అయితే అవసరమో అంతే మందితో, ఎక్కువ హడావుడి లేకుండా షూటింగ్ చేసుకోవడానికి అనుమతిని ఇచ్చాడు.

అంతేకాదు, ఆఫీస్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా ఉన్నవి ఉన్నట్టుగానే వాళ్ళు వాడుకుంటూ షూటింగ్ చేసుకునేలా ఒప్పందం చేసుకున్నాడు. వీటన్నిటికీ ఒప్పుకున్న ఆ సినిమా డైరెక్టర్ శ్రీధర్ ఒక వారం రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకున్నారు. అప్పుడే గంగాధరానికి, డైరెక్టర్ శ్రీధర్‌కి స్నేహం కుదిరింది. షూటింగ్ జరిగినన్ని రోజులు గంగాధరం శ్రీధర్ వెంటే ఉండి అన్ని గమనిస్తూ ఉండేవాడు. సినిమా వాళ్ళన్నా, సినిమా విషయాలన్నా ఆసక్తి ఉండనిది ఎవరికి!

శ్రీధర్ గంగాధర్‌తో సినిమా తీయడంలో తన సాధకబాధకాలు పంచుకునేవాడు. ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యేటప్పటికి పూర్తిగా గంగాధరంలో సినిమా మీద, సినిమా దర్శకత్వం మీద చాలా మోజు పుట్టుకొచ్చింది. గతంలో బీటెక్ చదువుతున్న రోజుల్లో తన స్నేహితులంతా షార్ట్‌ఫిలిం అంటూ తిరిగేవారు. అప్పుడు కలగని సినిమా మీద మోజు సినిమా మేకింగ్ మీద ప్రేమ, ఈ సినిమా షూటింగ్ వల్ల గంగాధరం మనసులో చాలా బలంగా నాటుకుపోయింది. ఒక సినిమా తీయాలని అనుకున్నాడు.

స్వతహాగా ఆలోచనాపరుడు, దూరదృష్టి కలవాడు అయిన గంగాధరానికి తెలుసు... అది అంత తేలికైన విషయం కాదని! ఈ సినిమా మాయలో ఎందరో జీవితాలు పాడు చేసుకున్న కథలూ విన్నాడు. కాని చిన్నప్పటి నుండి చదువే ధ్యేయంగా పెరిగిన మధ్యతరగతి కుర్రాడు, పెద్దగా సరదాలకి కాని, ఆటవిడుపు కాని, ఎరగని పరుగుతో సాగింది తన జీవితం. ఏదైనా కొత్తగా చేయాలని మనసుపడ్డాడు.

గంగాధరం చాలా తెలివైనవాడు. సినిమా తీయటం అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. తనకంటూ ఏ అనుభవమూ లేదు కానీ, ఆ సినిమా మీద మోజు తనని నిలుచోనివ్వట్లేదు, కూర్చోనివ్వట్లేదు. తన ఇష్టాన్ని చాలా ప్రణాళికాబద్ధంగా రూపొందించుకున్నాడు గంగాధరం. తాను సినిమా తీయాలనుకున్న రోజునే ఒక నిర్ణయానికి వచ్చాడు. ఎంత సమయం తీసుకొని అయినా సరే, తనకు తానే ప్రొడ్యూస్ చేసుకుని, తను రాసుకున్న కథను తానే దర్శకత్వం వహించి సినిమా తీయాలని అనుకున్నాడు. అది అంత ఆషామాషీ వ్యవహారం కాదు. డబ్బు సమకూర్చుకోవడానికి ఒక మూడు నాలుగు సంవత్సరాలు పడుతుందని అంచనా వేసుకున్నాడు. ఉద్యోగం మానకుండానే కావలసిన మెళుకువలు నేర్చుకునేందుకు అప్పుడప్పుడు వారాంతపు క్లాసులకి వెళ్ళేవాడు. అక్కడ కాస్త పరిచయాలు పెంచుకున్నాడు. ఒక ప్రముఖ న్యూస్‌ఛానల్ వాళ్ళు 'షార్ట్‌ఫిలిం కాంపిటీషన్' నిర్వహిస్తున్నారని తెలిసి పాల్గొనదలిచాడు.



తాను రాసుకున్న ఒక చక్కని కథకి తగ్గ కథనం రాసి, పాత్రలను ఎంచుకొని, ఎక్కువ హడావుడి లేకుండా, ఎక్కువ తారాగణం లేకుండా, ఒకటే లొకేషన్‌లో సాగే కథా నేపథ్యాన్ని ఎంచుకొని తను కావాల్సినట్టుగా షూటింగ్ పూర్తి చేశాడు. డైరెక్టర్ శ్రీధర్ సహాయంతో ఆ సినిమాకి సంగీతం, రీ-రికార్డింగ్ లాంటి పనులన్నీ తక్కువ ఖర్చుతో పూర్తి చేసాడు.

ఆ కాంపిటీషన్స్‌లో గంగాధరం తీసిన 'షార్టఫిలింకి ఫస్ట్ ప్రైజ్ లభించింది. అంతేకాకుండా వాళ్లు ఆ సినిమాని నేషనల్ అవార్డ్స్‌కి నామినేట్ చేశారు. 'నూతన ఔత్సాహిక దర్శకుల' జాబితాలో గంగాధరానికి బహుమానం రావడం విశేషం. ఈ చిన్న విజయం గంగాధరానికి ఎంతో నమ్మకాన్ని ఇచ్చింది.

ఇక ఎక్కువ సమయం వృధా చేయకుండా, తాను సినిమా తీయడం కోసం రాసుకున్న కథ మీద పని చేయడం మొదలుపెట్టాడు. 'ఆఫీస్ పని చూసుకుంటూ ఇది కుదరని పని' అని ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాడు. భార్య కవితతో చెప్పాడు. తను ఇలా సినిమా తీస్తానన్న విషయం భార్యతో చెప్పగానే ఇంట్లో చాలా వ్యతిరేకత ఎదుర్కున్నాడు.

"ఏదో సరదాకి చేస్తున్నావ్ అనుకున్నాను, కానీ... ఇలా ఉద్యోగం వదిలేసి పిల్లల్ని రోడ్డు మీద పడేసి సినిమాలంటూ తిరుగుతాను అంటే ఊరుకునేది లేదు" అని భార్య తెగేసి చెప్పింది.

గంగాధరం తల్లిదండ్రులది కూడా అదే మాట. "ఇన్నాళ్ళూ లేదు, ఏంటి వెర్రి వేషాలు? సినిమాలంటూ బాగుపడ్డ వాళ్ళు ఎవరైనా ఒకళ్ళని చూపించు?" అంటూ వాళ్ళు నిరుత్సాహపరిచారు.

తను ఎంతో కాలంగా సినిమాకి కావలసిన ఆర్థికపరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నానని, ఒక్క సంవత్సరం మాత్రమే ఉద్యోగం నుంచి విరమించుకొని ఆ సినిమా పూర్తి చేసి మళ్లీ ఉద్యోగంలో చేరిపోతానని అటు భార్యని ఇటు తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం చేశాడు. ఇంట్లోవాళ్ళ భయంలోను నిజం లేకపోలేదు. సినిమా ప్రపంచం ఒక రంగుల ప్రపంచం. అక్కడ నిలదొక్కుకుని విజయంతో బయటపడే వాళ్ళు చాలా తక్కువమంది. ఇవన్నీ ఎదుర్కోవాల్సి వస్తుందని ముందే ఊహించిన గంగాధరం, ఒక సంవత్సరం పాటు కుటుంబానికి కావలసిన అన్ని వసతులను ఏర్పాటు చేసి, తనకి ఒక సంవత్సరం పాటు సెలవు ఇవ్వమని భార్యని వేడుకున్నాడు.

మొదట్లో భార్యకి గంగాధరం వ్యవహారం అంత రుచించక పోయినా, అతని షార్ట్‌ఫిలింకి జాతీయ స్థాయిలో అవార్డ్ రావడంతో కాస్త అర్థం చేసుకుంది. 'అసలే మధ్యతరగతి కుటుంబం. మంచి చెడులు చూస్తూ పెరిగిన వాడు, చక్కగా జీవితంలో స్థిరపడ్డాడు. చాలా ఆలోచనాపరుడు కానీ, ఇలాంటి సినిమా అన్న ఆలోచన తన జీవితాన్ని కుదిపేస్తుందని ఏనాడూ కలగనలేదు' అనుకుంది భార్య. ఇంట్లోవాళ్ళ భయానికి ఆర్థికంగా ధైర్యాన్ని చేకూర్చి 'తను ఒక సంవత్సరం పాటు ఉద్యోగం నుండి సెలవు తీసుకుని తన సినిమాని మొదలుపెడతాను' అని చెప్పిన దగ్గర నుండి కవితకి గంగాధరం మీద నమ్మకం కుదిరింది. అటు తరువాత కవిత కూడా తన సహకారాన్ని అందించింది. ఈ సంవత్సర కాలం ఇంటి బాధ్యతలను తాను చూసుకుంటూ గంగాధరానికి సాయంగా నిలిచింది.

ఎంతో వ్యయప్రయాసలకి ఓర్చి, ఒక సంవత్సర కాలంలో ఒక సినిమాని తీర్చిదిద్దాడు. ఈ ప్రయాణంలో తాను చూడని కష్టం లేదు. ఆర్థిక విషయాలు మాత్రమే కాక ఈ రంగుల ప్రపంచములోని రంగుల మాటు వికృతాలెన్నో చూసాడు. కాని అన్నిటిని పాఠాలుగా స్వీకరించాడు. షూటింగ్ మొదలు పెట్టిన దగ్గర నుండి సినిమా మార్కెట్ చేసుకోవడం వరకూ అడుగడుగునా ఎదురైన సమస్యలు తాను ముందు ఊహించినవే అయినా కాస్త ఇబ్బంది పడ్డాడు. అనుభవం ఉన్న ఒకరిద్దరు స్నేహితుల సలహాలు తీసుకుంటూ జాగ్రత్తగా సినిమా రిలీజ్ చేయగలిగాడు.

గంగాధరం శ్రమ వృధా పోలేదు. సినిమా ఘనవిజయం సాధించటంతో గంగాధరానికి మంచి పేరు వచ్చింది. ఆ సినిమా సక్సెస్ మీట్ లో గంగాధరం మాట్లాడుతూ "సినిమా తీసిన వాడు ఎవడైనా, ఎలాంటి కథ అయినా చెప్పదలుచుకున్న విషయం సూటిగా చెబితే చూసే ప్రజలు ఎప్పుడూ ఉంటారు, ఆదరిస్తారు అని మీరు మళ్ళీ నిరూపించారు. నేను మొదట్లో సినిమా తీస్తాను అన్నప్పుడు నన్ను ప్రోత్సహించిన వాళ్ళు ఒకళ్ళూ లేరు. సినిమా రంగంపై ఎన్నో అపోహలు, అనుమానాలు. కేవలం మొండి పట్టుదల, నమ్మకం, విపరీతమైన భయంతో సినిమాని మొదలుపెట్టిన నేను ఇంత విజయం సాధించి మీ ముందు ఇలా కూర్చొని మాట్లాడుతున్నానంటే కారణం భయం మాత్రమే. ఆ భయమే నాలో బాధ్యతను పెంచి, చాలా జాగ్రత్తలు తీసుకునేలా చేసింది! ఏ రంగంలో అయినా ఒడిదుడుకులు అపజయాలు తప్పవు. కానీ, ఈ కళారంగానికి సంబంధించి అంతకు మించిన బాధ్యతతో కూడిన భయం వున్న వాడిదే విజయం. తెలిసి చేసినా, తెలియక చేసినా చెల్లించుకోవలసిన మూల్యం భారీగా ఉంటుంది. నేను కేవలం ఒక్క సినిమా తీయడం కోసమే వచ్చాను. ఈ ఒక్క సినిమాతోనే ఆపేస్తున్నాను. ఇక మీదట సినిమాలు తీయబోవటం లేదు. నేను ఒక మామూలు ఉద్యోగస్తుడిని. ఏదో సరదా కోసం ఒక సినిమా తీశాను. అది హిట్ అయింది. అదంతా మీ అభిమానం. ఇక మీదట నేను వెళ్లి నా ఉద్యోగం నేను చేసుకుంటాను. సినిమా తీస్తాను అనుకున్నప్పుడు నా ఇంట్లో ఇదే చెప్పాను. సినిమారంగానికి కావలసినది ఇలా మాట మీద నిలబడడం మాత్రమే.

విజయాలకి లొంగకుండా ఉండగలగాలి. నా నుంచి ఇంకో సినిమా ఆశించవద్దు. కానీ, ఇలాంటి సినిమాలు ఎవరు తీసినా, నేను ఆదరిస్తాను, మీరూ అలాగే ఆదరించాలని కోరుకుంటాను. ధన్యవాదాలు!" అని ముగించాడు.

గంగాధరం మాట మీద నిలబడ్డ తీరుకి అతని తల్లిదండ్రులు, భార్య చాలా గర్వపడ్డారు. విజయానికి కావలసింది స్పష్టత. మనకి ఏమి కావాలి, ఏమి చేయాలి, ఎలా చేయాలి అని తెలుసున్న వాడిని విజయం ఏ రంగంలో అయినా వరిస్తుంది.

అందుకే గంగాధరం "ఒక్క చిన్న సినిమా" సూపర్ హిట్ అయ్యింది.

# మానవతామూర్తి

సుస్మితా రమణమూర్తి



9703440214

***"మీ రాఘవ... మా డాడీ వస్తువులున్న మూట ఒకటి నాకిచ్చాడు.***
***అందులో అన్నీ పనికిరాని వస్తువులే! నాకు గుర్తున్నంతవరకు డాడీ దగ్గర ఎర్ర రంగు పాత డైరీ ఒకటి ఉండేది.***
***అందులో తన రోజువారీ ఆదాయం, ఎవరెవరికి ఎంత ఇచ్చింది, వారి సంతకాలు అవీ ఉంటాయి.***
***బేంకు పాస్‌బుక్ మాత్రం భద్రంగా ఉంది. ఆ డైరీయే మిస్సయింది!"***

నాలుగు రోడ్ల కూడలిలో హోల్ సేల్ కూరగాయల వ్యాపారం జోరుగా సాగే ప్రదేశం అది. అక్కడ రోడ్డు పక్కన ఓ కుంటి ముష్టివాడు కూర్చుని 'ధర్మం చేయండి' అన్న అట్ట బోర్డుతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాడు.

చేయెత్తి యాచించడు. అట్ట బోర్డు చూసి, జాలిపడి వేసే పైసలు తీసుకుంటాడు. ఆరోజు అక్కడ ముష్టివాడు కూర్చుని లేడు. పడుకుని ఉన్నాడు!

చిల్లర పైసలు వాడిపై పడుతున్నా అతనిలో చలనం లేదు. అనుమానంతో ఒకతను కదిలించే ప్రయత్నం చేసినా లేవలేదు. ముక్కు దగ్గర వేలుంచి చూసాడు. శ్వాస ఆడటం లేదు. విషయం తెలిసిన చుట్టుపక్కల వారు గుమికూడారు. మునిసిపాలిటీ వారికి ఫోను చేసారొకరు.

ఒకప్పుడు, వాడు వ్యాపారులు అందరికీ నమ్మకస్తుడు. బరువైన కూరగాయల గంపలను ఒక చోటునుంచి, మరోచోటుకి సునాయాసంగా భుజాలపై మోసి చేరవేసేవాడు. ఒక్కగానొక్క కొడుకుని చదివిస్తూ భార్యను ప్రేమగా చూసుకునేవాడు. మార్కెట్టులోనే లారీకింద పడడంతో కాలు విరిగింది. వ్యాపారస్తులు వైద్యం చేయించినా లాభం లేకపోయింది.

అవిటివాడైపోవడంతో భార్య వేరొకరితో వెళ్ళిపోయింది. కుర్రాడి చదువు వాడు ఆపలేదు. అప్పటి నుంచి రోడ్డు పక్కన అట్ట బోర్డు ముందుంచుకుని కూర్చోసాగాడు. కొడుకు బాగా చదువుకుని మంచి ఉద్యోగస్తుడైన తర్వాత కూడా వాడి దినచర్యలో మార్పు లేదు. అక్కడ అలానే కూర్చుంటున్నాడు.

పాపం ఈరోజు వాడలా పోయాడు. భిక్షపాత్రలో ఎవరికి తోచింది వారు వేస్తున్నారు. తీసుకు పోవడానికి మునిసిపాలిటీ వేను వచ్చింది.

"అంత్యక్రియలు నేను జరిపిస్తాను!" అంటూ పక్కనున్న ఆఫీసు బంట్రోతు రాఘవ ముందుకి వచ్చాడు. తన ఔదార్యానికి అందరూ మెచ్చుకున్నారు.

ముష్టివాడి భిక్షపాత్ర వ్యాపారస్తుల వితరణతో అక్షయ పాత్ర అయింది.

రాఘవ వాడి అంత్యక్రియలు పూర్తి చేసాడు.

మర్నాడు దినపత్రికలలో "అనాథ శవానికి మానవత్వంతో అంత్యక్రియలు జరిపిన ఓ బంట్రోతు!" అంటూ ఫోటోతో వార్త

రావడం చూసి రాఘవ ఆనందంతో పొంగిపోయాడు.

★★★

"సార్! ఆ ముష్టోడి మూట విప్పి చూసాను. అందులో వాడి ఫేమిలీ ఫోటోతో బాటు, అడ్రస్సు ఫోన్ నెంబరు కూడా ఉంది. మూటలోని ఉత్తరాల ద్వారా వాడి అబ్బాయి హైదరాబాదులో ఉంటున్నట్లు తెలిసింది!"

"ఈ వివరాలు నాకెందుకు?"

"సార్! వాడి అబ్బాయి రేపు వస్తున్నాడు. వాడి మూటలోని వస్తువులు అతనికి అందజేయాలి"



"అలాగే చెయ్!"

"రేపు మధ్యాహ్నం అతనిని కలియడానికి లంచ్ తర్వాత పర్మిషన్ కావాలి సార్! "

"పర్మిషన్ కోసం ఇంతలా నా బుర్ర తినాలా! సరే వెళ్ళు"

మేనేజర్ అనుమతితో సంతోషంగా రాఘవ వెళ్ళిపోయాడు.

★★★

"హల్లో శ్రీధర్! హౌ ఆర్ యూ? ఏంవిటిలా వచ్చావ్?" ఆఫీసు గదిలోకి వచ్చిన డిగ్రీ మిత్రుణ్ణి ఆప్యాయంగా పలకరించాడు మేనేజర్ సుదర్శనం.

"మా డాడీ సంగతి నీకు తెలుసు కదా?"

"తెలియకేం? వారింకా గుర్తున్నారు నాకు. నిన్ను బాగా చదివించి, ప్రయోజకుణ్ణి చేసి కూడా ఆయన ఆ వృత్తి వదలలేదు. నీవా మహానగరంలో పెద్ద కంపెనీలో ఆఫీసరువి, వారేమో అలా! ఇప్పుడు నీతోనే ఉంటున్నారా? ఆ వృత్తి మానేసారా?"

"చివరిదాకా అలానే ఉన్నారు. ఈమధ్యే పోయారు. విషయం తెలిసినా వెంటనే రాలేకపోయాను. అప్పుడు ఆరోగ్యం బాగులేక హాస్పిటల్‌లో ఉన్నాను!"

"సారీరా!"

"సార్! స్పెషల్ కాఫీ!" అంటూ ఆఫీసు బంట్రోతు రావడంతో వారి మాటలకు అంతరాయం కలిగింది.

"నమస్కారం సార్! మీరిక్కడ..." అంటూ ఆశ్చర్యంగా శ్రీధర్ వేపు చూసాడు బంట్రోతు.

"మా బంట్రోతు రాఘవ నీకు తెలుసా?" శ్రీధర్ని అడిగాడు మేనేజర్.

"మీ రాఘవ బంట్రోతు అయినా, మా డాడీ అంత్యక్రియలు జరిపిన గొప్ప మానవతామూర్తి! ఈమధ్యే కలిసాను. మరల ఇలా!"

“అంటే ఆ రోజు ఆఫీసు ముందు పోయింది వీరి డాడీయా?”

“అవున్సార్! మీ మిత్రుని డాడీయే!”

“యూ ఆర్ గ్రేట్ రాఘవా! చాలా మంచి పని చేసావు” మేనేజర్ పొగడ్తకు ఉబ్బితబ్బిబైన రాఘవ కాఫీ

కప్పులు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

చాలాకాలం తర్వాత కలిసిన మిత్రులు మరల కబుర్లలో మునిగిపోయారు. మరోసారి వారికి కాఫీలు ఇచ్చిన రాఘవ గది బయటకు వచ్చి స్టూలుపై కూర్చుని వారి మాటలు వినసాగాడు.

“మీ రాఘవ... మా డాడీ వస్తువులున్న మూట ఒకటి నాకిచ్చాడు. అందులో అన్నీ పనికిరాని వస్తువులే! నాకు గుర్తున్నంతవరకు డాడీ దగ్గర ఎర్ర రంగు పాత డైరీ ఒకటి ఉండేది. అందులో తన రోజువారీ ఆదాయం, ఎవరెవరికి ఎంత ఇచ్చింది, వారి సంతకాలు అవీ ఉంటాయి. బేంకు పాస్‌బుక్ మాత్రం భద్రంగా ఉంది. ఆ డైరీయే మిస్సయింది!”

“వారే లేనప్పుడు ఆ డైరీ ఉండి ప్రయోజనం ఏఁవిటి?”

“ఆ డైరీ లేకున్నా ఫర్లేదు. ముఖ్యమైన ఆర్థిక లావాదేవీల పేజీల జిరాక్స్ కాపీలు డాడీ పంపించినవి, నా దగ్గర ఉన్నాయి. ఆ కాపీలు తేవడం మరచిపోయాను. మరోసారి కలసినప్పుడు నీకు చూపిస్తాను. ఆ కాపీలతో ఆ డబ్బు రాబట్టుకోవచ్చు!”

“నాకు చూపించాల్సిన అవసరమేమిటి?”

“ఆ కాగితాలలో మీ ఆఫీసులోని వారి పేర్లేమైనా ఉంటే, వసూలు చేయడంలో నీ సహాయం అవసరమవుతుంది!”

“నా సహాయం తప్పకుండా ఉంటుంది!”

మిత్రుని హామీతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీధర్.

వారి మాటలు పూర్తిగా విన్న రాఘవ ఆ డైరీ గురించి ఆలోచనలో పడ్డాడు.

★★★

“నమస్తే సార్!”

“ఏఁవిటి రాఘవా ఇలా వచ్చావ్?” శ్రీధర్ ఆశ్చర్యంగా అడిగాడు.

“మీరు, మా మేనేజర్ సార్ మాట్లాడుకున్నది అంతా విన్నాను సార్!”

“అయితే...”

“ఆ ఎర్ర రంగు డైరీ ఇదేనా సార్... ఇవ్వడం మరచిపోయాను. తీసుకోండి సార్!”

“వెరీ గుడ్! ఇప్పుడు డాడీ ఎవరెవరికి ఎంత ఇచ్చారో తెలిసిపోతుంది!”

“మీ దగ్గరున్న జిరాక్సు కాపీలు చూస్తే తెలుస్తుంది కదా సార్!”

“తెలుస్తుందనుకో! ఒరిజినల్ డైరీకి ఉన్న విలువ కాపీలకు ఉండదు కదా!”

“అవును సార్... నాదొక రిక్వెస్ట్! దయచేసి ఈ విషయం మా ఆఫీసులో ఎవరికీ చెప్పకండి సార్! ముఖ్యంగా మా ఆఫీసులో ఎవరికీ తెలియకూడదు!”

"తెలిస్తే ఏమవుతుంది?"

"ఇంతవరకు నాకున్న మంచి పేరు పోతుంది!"

"ఇంతకీ ఏ విషయం గురించి చెప్పకూడదు?"

"అదే సార్! మీ డాడీ దగ్గర నేను దఫదఫాలుగా యాభై వేల దాకా... రెండు రూపాయల వడ్డీకి తీసుకుని, మా ఆఫీసులోని వారికి అయిదు రూపాయల వడ్డీకి తిప్పుతున్నానన్న విషయం!"

"ఈ విషయం డాడీ ఒకసారి ఫోనులో చెప్పారు నాకు"

"నెలనెలా డాడీకి ఠంచనుగా వడ్డీ ఇచ్చేస్తున్నాను. ఈ నెల వడ్డీ ఈ కవరులో ఉంచాను. తీసుకోండి. మీ అకౌంటు నెంబరు ఇవ్వండి సార్! ఇకమీదట నెల నెలా వడ్డీ జమ చేస్తాను!"

"ఈ తలనొప్పి నాకెందుకు? ఆ యాభై వేలు ఇచ్చేస్తే సరిపోతుంది కదా?"

"బంట్రోతుగాడికి ఒక్కసారే అంత డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది సార్? కాస్త దయ చూపించండి. ఆర్నెల్లలో అందరి దగ్గర వసూలు చేసి మీ అకౌంటులో వేస్తాను!"

"ఇంతిదిగా అడుగుతున్నావు కాబట్టి సరే! అలాగే కానివ్వు. ఆరు నెలలలో పూర్తిగా ఇచ్చేయాలి! మరో విషయం. డాడీ మరికొందరికి కూడా ఇచ్చారు కదా... వారి దగ్గర నుంచి కూడా వసూలు చేయాల్సిన బాధ్యత నీవే తీసుకోవాలి!"

"అలాగే సార్! వారందరూ నాకు బాగా తెలుసు. తప్పకుండా వసూలు చేస్తాను. మీరు మాత్రం నా విషయం

మా ఆఫీసులో దయచేసి ఎవరికీ చెప్పకండి సార్!"

"నీ మాటపై నీవు నిలబడి ఆరు నెలలలో ఈ డబ్బు వ్యవహారం సెటిల్ చేయకపోతే, మీ మేనేజరుకి చెప్పక తప్పదు!"

అతని మాటలకి, రాఘవ ఆలోచనల్లో పడిపోయాడు. 'అప్పుడు అందరిలా తనూ నోరు మూసుకుని ఉంటే, వాడి సంగతి మునిసిపాలిటీ వారే చూసుకునేవారు. గొప్పకు పోయి ఇరుక్కుపోయాను.'

"ఏఁవిటి ఆలోచిస్తున్నావు రాఘవా! ఇష్టం లేకపోతే చెప్పు. మీ మేనేజర్ సహాయం తీసుకుంటాను"

"అదేం లేదు సార్! ఆర్నెల్లలోపే అన్నీ సెటిల్ చేసేస్తాను సార్!"

"వెరీ గుడ్!" అంటూ అకౌంటు వివరాలు రాసిన కాగితం రాఘవకు ఇచ్చాడు శ్రీధర్.

'జిరాక్స్ కాపీలు ఉన్నాయని చెప్పిన అబద్ధం, డాడీ డైరీ బయటపడేలా చేసిందని తెలుసుకోలేని దద్దమ్మ వీడు!' రాఘవ వెళ్తున్న వేపు చూస్తూ అనుకున్నాడు శ్రీధర్.

'వాడు పోయాడు. అసలు యాభై వేలు మనదే! నెల నెలా వచ్చే పూర్తి వడ్డీ కూడా మనదే!' అనుకుని సంబరపడిన రాఘవ ఆశ ఫలించక లోలోన కుమిలి పోయాడు ది గ్రేట్ మానవతామూర్తి... రాఘవ!

# మనసు గాయం


పి. ఎల్. ఎన్. మంగారత్నం



9701426788


***ఎప్పుడూ అతని ఆలోచనలు తెలుసుకోలేక పోయాం. అతను వ్యాపారం మీద బయట తిరిగిందే ఎక్కువ. నేను అత్తవారింటికి విజయవాడ వెళ్లిందీ ఒక్కసారే. ఇప్పుడు ఆ మహా పట్టణంలో, ఆటోనగర్లో ఆ ఇల్లు ఎక్కడుందో తెలీదు. టాక్సీలో తీసుకు వెళితే వెళ్లానే గాని ఎడ్రస్సు తెలీదు!"***

అది చాలా సంవత్సరాల క్రిందటి విషయం.

ఆరోజు...

మొదటిసారి మెటర్నిటీ లీవు పూర్తి చేసుకుని, ఆఫీసులో జాయిను అవడం కోసం వెళ్ళాను. గవర్నమెంటు మంజూరు చేసిన మూడు నెలలతో పాటు, మరో నెల ఎరన్డ్ లీవ్ కూడా పెట్టుకుని, నాలుగు నెలల తరువాత తిరిగి వచ్చాను.

జాయినింగు రిపోర్టుతో మా తహసిల్దార్‌గారిని కలిసేందుకు వెళ్ళే సరికే... ఆ ఓపెన్ ఛాంబర్లో ఎవరో కొత్తామె కూర్చుని ఉంది. 'ఆ పని ఇలా చెయ్యాలి. ఈ పని అలా చెయ్యాలి' అన్నట్లు మాట్లాడుతున్నారు తహసిల్దారు గారు.

గుమ్మంలో నన్ను చూడగానే "ఏమ్మా! జాయిను అవడానికి వచ్చావా?" అంటూ పలకరించారు.

"అవును. సార్!" అంటూ నా చేతిలోని కాగితాన్ని అందించాను.

అది పరిశీలిస్తూనే "బాబు ఎలా ఉన్నాడు?" అడిగారు.

ఆరోజుల్లో ఫోనులు అంతగా లేవు, ఉత్తరాలే! విషయం వివరిస్తూ పుట్టింటివారు ఉంటున్న శ్రీకాకుళం నుంచి ఓ సారి సూపరింటెండెంటుగారికి ఉత్తరం వ్రాసాను. అదే గుర్తు పెట్టుకున్నారు.

నేను ఆ ఉద్యోగానికి వచ్చే నాటికి మేము నాన్నగారి ఉద్యోగరీత్యా శ్రీకాకుళంలో ఉన్నాం. పదవ తరగతి సర్టిఫికేట్ల ఆధారంగా నేను నల్లగొండ జిల్లాకు లోకల్ కాండిడేట్ని. ఆ కారణంగా ఏడు జిల్లాల అవతల ఉన్న నాకు నల్లగొండ జిల్లాలోనే, నేషనల్ హైవే మీద ఉన్న 'సూర్యాపేట తాలూకా ఆఫీసులో' పోస్టింగు ఇచ్చారు. అలా గత మూడేళ్ళుగా నేను అక్కడే పని చేస్తున్నాను.

ఆ ఛాంబర్లో నుంచి బయటకు వస్తూ మరో సారి ఆమెను చూసాను. కాస్త నదురుగా ఆకర్షణీయంగా ఉంది. చూడగానే ఆకట్టుకునే రూపంతో.

నా ఆలోచనలు చదివినట్లుగా అక్కడే ఉన్న దఫేదారు దేవయ్య "కొత్తగా వచ్చారండి. డీ. ఎస్. సీ సెలక్షను. జూనియర్ అసిస్టెంటు నాగమణి గారని" చెప్పాడు.

"ఓహో" విస్మయం చెందాను.

ఆఫీసులో అప్పటికి నేను ఒక్కదానినే లేడీ క్లార్కును కావడంతో, నాకు తోడు దొరికిందనుకున్నాను. మరో పది నిమిషాలు

తర్వాత, ఆమె బయటకి రావడం కోసం అన్నట్లు... కూర్చున్న కుర్చీలో నుంచి నేల మీదకు దిగి, చేతుల మీద దేకుతూ బయటకు వచ్చింది. కాళ్ళు రెండూ పుల్లల్లా ఆమె శరీరానికి సంబంధం లేనట్లు వ్రేల్లాడుతుంటే... మనసంతా దేవినట్లు అయిపోయింది. ఇంత అందమైన అమ్మాయికీ అంగవైకల్యమా!

తహసిల్దారు గారు స్టాఫ్‌మీటింగు పెడితే తప్ప మేమెవ్వరం ఆ ఛాంబర్లో కూర్చోము. అది ఓ గౌరవం! అలాంటిది ఆమె కూర్చోగలిగింది.

నన్ను నేను పరిచయం చేసుకుని, "ఒక ట్రై సైకిల్ కొనుక్కోపోయారా?" అని అడిగాను. అంతవరకూ నా మనసు మనస్సులో లేదు.



"ఉందండీ! సార్ ఛాంబరు ముందు బండి పెట్టడం ఎందుకని, కాస్త ప్రక్కగా పెట్టాను!" చెప్పింది ఆమె.

అలా ఆమెతో అనుబంధం బాగానే ఏర్పడింది. వైశ్యుల అమ్మాయి కావడంతో బంగారం బాగానే వేసుకునేది.

★★★

ఆమెకి 'ఇన్వార్డ్... అవుట్ వార్డ్ సెక్షను' ఇచ్చారు.

కొత్తగా వచ్చిన వారికి ఎవరికైనా అదే సీటు ఇస్తారు. అయితే, అదృష్టవశాత్తు నా సర్వీసులో... నాకు ఎప్పుడూ ఆ సీటు రాలేదు.

ఆఫీసులో ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని, నాగమణికి ఓ అసిస్టెంటుని కూడా ఇచ్చారు.

గ్రామనౌకర్లలో కాస్త చదువుకున్న లలితమ్మని ఆమెకు కేటాయించారు. ఆమె బయటకి వెళ్ళే కవర్ల మీద అడ్రస్సులు వ్రాయడం, సాయంత్రం అయ్యేసరికి వాటిని ఆఫీసు గేటు బయటే ఉన్న పోస్టు బాక్సులో వెయ్యడం, రిజిస్టరు పోస్టులు ఉంటే, పోస్టాఫీసుకి వెళ్ళడం లాంటి పనులు చేసేది.

అలా నాగమణి ఆడుతూ... పాడుతూనే పని చేసింది.

★★★

సంవత్సరంన్నర తిరిగేసరికి...

నేను మరోసారి మెటర్నిటీ లీవు పెట్టి పుట్టింటికి వెళ్ళాల్సి వచ్చింది. ఆ సారి గవర్నమెంటు నాలుగు నెలల సెలవును మంజూరు చేసింది.

మళ్ళీ రెండవసారీ బాబే!

వచ్చేసరికి నాగమణి సీటు ఖాళీగా కనిపించడంతో "ఈరోజు ఈవిడ సెలవా?" ఆమె సీటుకి ఎదురుగా ఉన్న బెంచీ మీద కూర్చుని పని చేస్తున్న లలితమ్మను చూస్తూ అడిగాను. ఎవరికైనా ట్రాన్స్ఫర్లు ఉంటాయి గానీ, అలాంటి వాళ్ళని కదపడానికి ఆలోచిస్తుంది గవర్నమెంటు.

"అవునండీ! ఈరోజే కాదు గత పది రోజుల నుంచీ సెలవులో ఉంది మా నాగమణమ్మ"

"ఏం?" ఏం ఇబ్బంది వచ్చిందోనని... ఆత్రుతగా అడిగాను.

అందుకు నవ్వుతూ "నాగమణి వారం రోజుల క్రిందట పెళ్ళి చేసుకుందమ్మా! మేమందరమూ వెళ్ళి పెళ్ళి భోజనాలు కూడా చేసి వచ్చాం!" చెప్పింది.

"హా! నాగమణి పెళ్ళి చేసుకుందా?" గట్టిగానే అనేసాను. ఆనందంతో మనసు నిండిపోయింది. నడవలేని ఆమెను చేసుకున్న ఆ మనసున్న మనిషికి జోహార్లు అర్పించాను.

"రేపు ఒకసారి ఇంటికి వెళతాను!" అన్నాను.

"మిమ్మల్ని పిలవలేదుగా" అంది ఆశ్చర్యంగా. పిలవని పేరంటానికి కూడా వెళతారా? ఎవరైనా అన్నట్లు.

"మీ పిలుపులు అందనంత దూరంలో నేనుంటే... ఏం పిలుస్తుంది? విషయం తెలిసిన తరువాత ఓ సారి వెళ్ళి చూసి వస్తే తప్పేమిటీ?" అడిగాను.

జవాబు లేదు!

★★★

ఆ మరునాడు ఇంటి పనులు త్వరగా పూర్తి చేసుకుని, రోజూ కన్నా ఓ పావుగంట ముందుగా బయలుదేరాను. నాగమణి ఇల్లు ఆఫీసుకి కాస్త దగ్గరలోనే ఉంది. అపార్టుమెంటులు అనేవి తెలియని రోజుల్లోనే ఓ వ్యాపారవేత్త, అతని పేరు మీదే మూడు అంతస్తుల బిల్డింగు కట్టించాడు. అద్దె ఎక్కువైనా అన్ని సౌకర్యాలతో ఉండడంతో ఆ ఇల్లు ఎన్నుకుంది నాగమణి.

ఎప్పుడూ వెళ్ళకపోయినా, సులువుగానే దొరికింది ఇల్లు.

ముందు అన్నీ షాపింగు కాంప్లెక్సులు ఉండడంతో, వాటికి అనుబంధంగా వెనుక వైపున ఉన్న రెండు గదుల్లో, తల్లితో కలసి ఉంటుంది.

నేను వెళ్ళేసరికి ఆమె భర్త కూడా ఉన్నాడు.

పేరు సుధాకర్ అనీ, శ్రీకాకుళం స్వంత ఊరనీ, ప్రస్తుతం గ్రానైటు వ్యాపారం నిమిత్తం విజయవాడలో సెటిల్ అయ్యారనీ చెప్పుకొచ్చాడు. శ్రీకాకుళం అనగానే ఉత్సాహం వచ్చి "ఎక్కడేమిటి?" అడిగా.

"ఇలిసిపురం" చెప్పాడు.

“ఆ ప్లేస్ మాకు బాగానే తెలుసు. ఆ వీధి మొదట్లో ఉండే శ్రీకన్యా జనరల్‌స్టోర్లో కిరాణా కొంటూ ఉంటాం!” చెప్పాను ఉత్సాహంగా.

“ఆ షాపు మా మేనమామ గారిదే, అయితే మేము అక్కడినుంచి చానాళ్ళ క్రిందటే వచ్చేయడంతో, అంతగా కలుస్తున్నది లేదు!” అంటూ చెప్పుకొచ్చాడు.

నేను ఉన్నంత సేపూ నాగమణి భర్త ప్రక్కనే కూర్చుంది. అతను కుర్చీలో కూర్చుంటే, ఆమె ఆ ప్రక్కనే నేల మీద కూర్చుంది. భార్యాభర్తలు ప్రక్కపక్కనే ఉంటారు కదా! ఆ కలుపుగోలుతనం అదీ చూస్తే ‘ఫరవాలేదు, నాగమణి జీవితానికి వచ్చిన ఇబ్బందేం లేదు’ అనుకుంటూ సంతృప్తి చెందాను.

★★★

పెళ్ళి తరువాత నాగమణిలో చాలా మార్పులే వచ్చాయి.

ఖరీదైన చీరెలూ, నగలూ వచ్చి చేరాయి. భర్త తరచూ టూర్లకు వెళుతూ ఉంటాడు కాబట్టి, తను అమ్మగారింటిలోనే ఉంటుంది.

నాలుగు నెలల తరువాత, ఓ రోజు అనుకోని షాకింగ్ న్యూసు ఒకటి తెలిసి... కాలపు పాలపొంగు మీద నీళ్ళు చల్లినట్లు అయ్యింది.

‘నాగమణి భర్త ఇంట్లో ఉన్న డబ్బూ, నగలతో రెండురోజుల క్రిందటే చెప్పా పెట్టకుండా ఉడాయించాడని’ .

“ఏం జరిగిందీ?” మళ్ళీ ఇంటికి వెళ్ళి అడిగాను.

అప్పటికే విషయాన్ని జీర్ణించుకుందేమో, నిర్వికారంగా కూర్చుంది నాగమణి.

“మొన్న నాలుగురోజుల క్రిందట ఈ ఊరిలోనే బంధువుల ఇంట్లో పెళ్ళి ఒకటి ఉంటే... చుట్టాలు అందరూ మా ఇంట్లోనే దిగారమ్మా! మేమూ వెళ్ళాము, అల్లుడూ వచ్చాడు! ఛీ... ఛీ... వాడ్ని ఇప్పుడు అల్లుడు అనాలని అనిపించడం లేదు!” అని తల కొట్టుకుంటూ... “ఎవరో స్నేహితులంట... దిక్కుమాలిన స్నేహితులు పట్టుకొస్తే వచ్చిన సంబంధం ఇది. పెద్ద మనసుతో వచ్చినట్లే వచ్చి, కాళ్ళు లేని పిల్ల గొంతు కోసాడు!” బాధ పడుతూ చెప్పింది నాగమణి తల్లి.

నేను ఆమెని ఓదార్పుగా చూడడం మించి ఏమీ చేయలేకపోయాను.

“ఆ పెళ్ళి చూసుకుని మేమందరం తెల్లవారుఝామునే ఇంటికి వచ్చేసాం. వెనక్కి వచ్చేస్తుంటే తెలిసింది... కోదాడలో ఉన్న దగ్గర బంధువులబ్బాయికి యాక్సిడెంటు అయ్యిందనీ, లారీ గుద్ది అక్కడికక్కడే చనిపోయాడనీ! వెంటనే అక్కడికీ వెళ్ళాలనుకున్నాం. అయితే పెళ్ళికి వచ్చిన అందరి దగ్గరా నగలు ఉండి పోయినయ్యి. చావు దగ్గరకి నగలతో వెళ్ళకూడదని... అవసరానికి ఉంచుకుని, పెద్దవి అన్నీ మా పిల్లకి ఇచ్చి బయలు దేరాం! మర్నాడు ఆఫీసు ఉండడంతో నాగమణి, భర్తా ఇంట్లోనే ఉండిపోయారు. ఇదిగో, పని పూర్తి చేసుకుని సాయంత్రం వచ్చేసరికి పిల్ల ఒక్కతే ఉంది ఇంట్లో! అబ్బాయేడే అంటే... ‘నేనూ ఇప్పుడే వచ్చాను. వచ్చేసరికి ఇల్లు తాళం పెట్టి ఉంది. ఇంటికి వచ్చిన నన్ను చూసి, పక్కింటి పాపే తాళాలు పట్టుకు వచ్చి ఇచ్చింది ‘అంకుల్ ఇవ్వమన్నాడు’ అంటూ తరువాత తనే తాళం కూడా తీసింది. ఏదైనా పని మీద బయటకి వెళ్ళారేమో అనుకుంటున్నా” అంది. అంతే, కావచ్చు అనుకుంటూ నగలు అడగడంతో అసలు విషయం బయట పడింది. నాగమణి ఆఫీసుకి వెళుతూ అందరి నగలూ ఒక జేబురుమాలులో కట్టి, బీరువా సేఫ్‌లాకర్లో పెట్టించిందట. మధ్యాహ్నం

లంచ్‌కి వచ్చేటప్పుడూ భర్త ఇంట్లోనే ఉన్నాడట. ఆ తరువాతే, ఆచూకీ దొరకలేదు. అలాగే, ఒక లక్ష వరకూ డబ్బు కూడా కనిపించలేదు!" చెప్పింది ఆవిడ.

వీళ్ళ నగలు పోతే సర్దుకుంటారు. వచ్చిన వాళ్ళ నగలూ పోతే... ఎరువు సొమ్ము పరువు చేటు కాదా! అసలు బాధ కన్నా, ఈ బాధే ఎక్కువ పీడిస్తున్నట్లు ఉంది నాగమణిని.

వెళ్ళడానికి లేస్తూ "ఇక బాధపడవద్దులే నాగమణీ. కాలం కలిసి వస్తే, పరిస్థితులు అవే చక్కబడతాయి" అంటూ ఆమె చెయ్యి మీద చెయ్యి వేసాను భరోసాగా... అంతకు మించి చెయ్యగలిగేది లేక.

అప్పుడు వలవలా ఏడ్చింది. "అంతా నా దురదృష్టంలెండి. ఎప్పుడూ ఇంట్లో ఎవరో ఒకరు ఉండేవారు. ఈసారి మాత్రం సొమ్ము పోయి శని పట్టినట్లు అయింది. ఎప్పుడూ అతని ఆలోచనలు తెలుసుకోలేక పోయాం. అతను వ్యాపారం మీద బయట తిరిగిందే ఎక్కువ. నేను అత్తవారింటికి విజయవాడ వెళ్లిందీ ఒక్కసారే. ఇప్పుడు ఆ మహాపట్టణంలో, ఆటోనగర్లో ఆ ఇల్లు ఎక్కడుందో తెలీదు. టాక్సీలో తీసుకు వెళితే వెళ్లానే గాని ఎడ్రస్సు తెలీదు!" అంటూ కళ్ళు తుడుచుకుంది.

మోసం చేసేవారికి హృదయం ఉండదుట... అది అవిటితనం కదా?

ఆలోచిస్తున్న నాకు... మనసంతా భారంగా అయిపోయింది.



9492858395

# మామిడి జీడి

భమిడిపాటి గౌరీశంకర్

*ఎండ ముదురుతున్నాది. అందరూ గోచీలతోనే వున్నారు. నల్లగా దృఢంగా వున్నారు. ముఖంలో కళలేదు. ఏదో గోలగా మాట్లాడుతున్నారు. యాసలో ఓఢ్రం కలుస్తున్నాది. ఒడియా మాటలున్నట్లు నాకు తోచింది. సవరల భాషకు లిపిలేదు. గిడుగు రామ్మూర్తి పంతులుగారి కృషివలన ఓ ప్రత్యేక లిపిని, వాచకములను తయారుచేశారు. అక్షర దేవాలయాలు వాటికి పండగలు చేయటం కూడా కొన్ని గూడేల్లో కనిపిస్తుంది*

సమాజంలో... సంపన్నులు, అధికారంలో ఉన్నవారు 'సంపదలను సృష్టిస్తున్నాం, సద్వినియోగ పరుస్తున్నా'మంటున్నారు. ప్రజల కోసమే పార్టీలు మారుస్తున్నామని ఢంకా బజాయించి పబ్లిక్‌గా నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారు. అణగారిన వర్గానికి చెందిన వారే నాయకులుగా మారి తమ ప్రాంత వర్గమూలాలను మరచి అధికారం, పదవులు కోసం పోరాటాలు చేస్తామంటున్నారు.

ఆకలి... దారిద్ర్యం... అజ్ఞానం... అవిద్య... అమాయకత్వం... లిపిలేని భాష... భాషలో వివరించలేని భావం... ఇవన్నీ నిండుగా ఉన్నా, నిత్యం ఆకలి. ఆకలితో, ఆకలి వలన చస్తున్న ఆకలిజీవులకు కూడా తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని నాయకులు ఎప్పుడు గ్రహిస్తారు? వారి ఆకలి చావులను ఎప్పుడు నివారిస్తారు?

ఏమో... చెప్పలేం..

"ఏంటి ఆలోచన... మానేజిమెంట్ చెప్పిన అసైన్‌మెంట్‌కు రడీ అయావా... లేదా?" ఫోటోగ్రాఫర్ సింహాచలం ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చాను.

"అందుకోసమే రడీ అవుతున్నా! రేపుదయం బత్తిలి బస్సుకు బయలుదేరుదాం. అసలే ఎండలు... ఉదయం వెళ్ళి సాయంత్రానికి వచ్చేయగలమా?" నా ప్రశ్నకీ జవాబు రాలేమని నాకు తెలుసు. ఏ రాత్రికైనా కొంపకు చేరకపోతే నాకు నిద్ర రాదు.

"కష్టం. కొత్తూరులో మా చెల్లెలుంది. రావటానికి అవకాశం లేకపోతే అక్కడ ఉండిపోదాం. కొత్తూరు వరకు వెళ్ళి అక్కడ మా బావ బండి తీసుకొని వెళదాం. సీతంపేట రిపోర్టర్‌కి ఫోన్ చేశాను. ఎవరినో సర్దుబాటు చేస్తానన్నాడు."

"సరే... రేపుదయం ఆరున్నరకల్లా కాంప్లెక్స్‌లో వుంటా.... వచ్చేయ్" అన్నాను.

అతను వెళ్ళిపోయాడు.

ఉదయం ఎనిమిదిన్నర సమయం.

కొత్తూరు బస్టాండ్ కూడలి. సవర, గదబ, ఓఢ్రు, తెలుగు భాషల సమ్మేళన సంగమస్థలి! వివిధ ప్రాంతాలనుగుణంగా వేష, భాష, యాసలతో మనుషులు కదలాడే రంగస్థలి.

ఎండ దండిగానే వుంది. ఎండా... వాన ఎప్పుడు ఎలా వుంటాయో చెప్పలేని ప్రాంతమది. ఇక్కడ నుంచి ఎడంచేతి వైపు బయలుదేరితే బత్తిలి. మరోవైపు సీతంపేట... తిన్నగా వెళితే నిలవగా, మహర్తపురం వంటివి వస్తాయి. ఏరుంది మధ్యలో.... నివగాం దగ్గర తిరిగితే, హీరమండలం నుండి మాతల జంక్షన్ మీదుగా పాతపట్నంలోకి, అక్కడ నుంచి పర్లాఖిమిడి వెళ్ళే త్రోవలున్నాయి. ఇవన్నీ గంజాం జిల్లాలోనే ఒకప్పుడు వుండేవి. పదహారు వందల ముప్పై ఆరు తరువాత విశాఖ జిల్లాలో చేరాయి. శ్రీకాకుళం జిల్లాగా ఏర్పాటు చేసిన వేళ ఆ జిల్లాలో భాగమయ్యాయి. సీతంపేట, బత్తిలి, అలా ముందుకు వెళితే ఓడ్ర ప్రాంతంలో అటు మందసా నుంచి... ఇటు విజయనగరం... గుమడ... రాయఘడ్ నుండి భవానీపట్నం వరకు ఒడ్డి భాషతోపాటు గదబ, సవర, గిరిజనం వున్నారు. అదంతా ఏజన్సీ ప్రాంతమే. కొండలు, లోయలు మారుమూలగా కొండల్లో విసిరేసినట్టుండే గూడలు, గూడలలో నాలుగైదు గూడేలు.. గూడేల్లో నలభై, ఏభై గుడిసెలు. వెలుగునిచ్చే దీపాలు లేవు. మినరల్ వాటర్ కాదుకదా... కనీసం సాదా నీరు కూడా వారికి తెలియదు. అడపా దడపా కురిసే వానల వలన వాగులు నిండుతాయి. వాగులలోని నీటిని ఇంటికి తీసుకువెళ్ళి, కరక్కాయ వేసుకొని, శుభ్రపరిచి తాగుతారు. స్నానమంటే వారికి ఓ పండుగ. వర్షాకాలంలో హాయిగా తడుస్తారు. ఎండాకాలంలో ఎండుతారు. శ్రమ వలన కలిగే చెమట, వారికి స్నానపు నీరు! మహేంద్రగిరులకు తూర్పున బంగాళాఖాతం, ఉత్తరాన బార్సింగి, రచీకటి, జలంత్రజమీలు, దక్షిణాన తరాజమీ హద్దులుగా పడమర భాగంలో ఉన్న గిరిజన ప్రాంతమే ఏజన్సీగా వ్యవహరిస్తారు.



మాటల మధ్యనే సింహాచలం, నేను అతని బావగారి ఇంటికి చేరుకొని, కాఫీ టిఫిన్లు ముగించి, అతని వద్దనే ఓ హీరో హోండాను తీసుకొని బయలుదేరాము.

సమయం తొమ్మిది కావస్తున్నాది. ఇక్కడి నుంచి సీతంపేట ఓ గంట ప్రయాణం. అక్కడ వెళ్ళి రిపోర్టర్ను కలసి, నాకు కావలసిన గూడను చేరుకోవాలి. ఇదంతా జరిగేసరికి కనీసం గంట సమయం పట్టవచ్చు!

"పద" అన్నాను. బండి ముందుకు కదిలింది.

"అయినా మన ఎడిటర్‌గారికి మనమే ఎందుకు కనిపించామయ్యా బాబూ! ఇటువంటి ఎసైన్మెంట్... ఏ యూత్‌కో ఇవ్వాలి కాని, మనలాగా ఫార్టీలు దాటిన వారికెందుకు!"

"బాబూ, మనం చేస్తున్నది ఓ ప్రైవేట్ పేపర్లో అనే విషయం మరువకు! అయినా నెల అయేసరికి చక్కగా జీతాన్ని చెక్కు రూపంలో పంపుతున్నారు. లార్జెస్టు సర్క్యులేషన్ వుంది. మంచి గౌరవం కూడా మనకుంది. బ్లాక్‌మెయిలింగ్, అమ్మకాలు వంటి ఇతర బాధ్యతలు మనకు లేవు. మన న్యూస్ టార్గెట్స్‌ను మనం సక్రమంగా చేసుకొంటే చాలు కదా!" అన్నాను.

"నిజమే" బండి నడుపుతున్న సింహాచలం సమాధానం.

ఇంతలో ఫోన్ మ్రోగింది. సీతంపేట రిపోర్టర్, 'జంక్షన్లో వున్నానని, అక్కడే కలుద్దామని...' బ్రతికించాడు. కొంత దూరం తగ్గింది అనుకున్నాను.

సీతంపేట చేరేసరికి పదిన్నర అయిది. రిపోర్టర్ విశ్వనాథంను కలుసుకున్నాం. అతను 'కుసిమి నుంచి కాస్త కొండ క్రిందకు వెళితే అక్కడో లోతట్టు ప్రాంతంలో చెంచులగూడ వుందని, అక్కడ సవర గూడేలున్న'యన్నాడు. అయినా ఇక్కడంతా సవరలే. వారితో హాయిగా పని పూర్తిచేయవచ్చు కదా అని ఓ టస్సా వేసాడు. అతని మాటల్లో నిజమున్నా, ఆ లోతట్టు గూడెం చూడాలని నాకు ఆసక్తి కలిగింది.

"మీరు కూడా రాకూడదూ?" అన్నాను విశ్వనాథంను ఉద్దేశించి. కాసేపు ఆలోచించి, "పదండి" అన్నాడు. అతనికి సవరభాష తెలుసని నాకు తెలుసు. అతనికి అయే ఖర్చు కూడా నేను భరించడానికి సిద్ధపడ్డాను. మొదటిగా బండికి పెట్రోలు కొట్టించి, టిఫిన్ తిని బయలుదేరాం. కుసిమి, మల్లి ప్రాంతాలు కొండ ప్రాంతాలైనా, ప్రభుత్వ పథకాలు బాగా అమలు జరుగుతున్న రహదారి ప్రక్కనున్న ఏజన్సీ ప్రాంతాలు. అక్కడ నుంచి దాదాపు ఓ పది పన్నెండు కిలోమీటర్లు క్రిందకు వెళితే... త్రోవ తిన్నగా లేదు. చుట్టూ మూడు వైపులా కొండలు మధ్యగా అడవిభాగం. సన్నని త్రోవ... అక్కడక్కడ రాళ్ళు, రప్పలూను.

అరగంట ప్రయాణం తరువాత ఎండ వలన గొంతులు తడారి పోతున్నాయి. తెచ్చుకొన్న వాటర్‌బాటిల్స్ అయిపోయాయి. ఓ చెట్టు క్రింద కూర్చున్నాం. గాలి వేడిగా వుంది. దాదాపుగా నాగరికతకు దూరంగా వెళ్లిపోయాం. కనుచూపుమేరలో నరసంచారం లేదు. దూరంగా అప్పుడప్పుడు ఏనుగుల ఘీంకారాలు వినిపిస్తున్నాయి. కీచురాళ్ళ రొద తప్ప ఏమీ లేదు. విశ్వనాథం గబగబా ముందుకువెళ్ళి ఓ చెట్టు ఆకులను కోసి తీసుకొని తిని, మాకు కొన్ని ఇచ్చి నోటిలో వేసుకోమన్నాడు. క్షణంలో విచక్షణ కోల్పోయిన మేము వాటిని నోటిలో వేసుకొని నమిలాం. చిత్రం దాహం తీరింది. మరి కొన్నింటిని కోసి జేబులో వుంచుకున్నాము.

"ఈ తూర్పుకనుమలలో నూటడెబ్బై ఆరు రకాల ఔషధమొక్కలున్నాయి. వాటితో ప్రాణాంతకమైన ఎయిడ్స్, మధుమేహంలాంటి వాటికి మందులు తయారు చేయవచ్చు. అసలు భారతదేశం ఆదివాసీ ప్రాంతాలలో ఏడువేల ఐదువందల రకాల ఔషధమొక్కల సంపద వుంది. ఇక్కడ బ్రతుకీడుస్తున్న సవరలు చాలా వరకు బడమర, తిప్పదీగ, అడవి ఉల్లి, అరె పువ్వు, ఇప్ప, గిల్లతిప్పు, అడ్డసార, బలురక్కిస అడవిబెండ, దుష్పపు తీగ, పిల్లి పీచిన... వంటి మొక్కలతోనే కుక్క, తేలు, పాము కాటులు, గజ్జి, కిటిభా వంటి వాటిని నయం చేసుకుంటున్నారు. గుర్తించాల్సిందేమిటంటే ఇంత గొప్ప మొక్కలన్ని మనం చెత్త మొక్కలుగా భావించటం!

మెల్లగా గూడెం చేరుకున్నాము.

పన్నెండు గంటల సమయం. గూడెం ప్రశాంతంగా వుంది. ఒకింటి ముందు, ఓ నులక మంచం తిరగేసి, ఓ మనిషిని దానిమీద పరుండబెట్టారు. చూస్తే అతను చావుబ్రతుకులు మధ్యనున్నవాడిలా వున్నాడు. ఎండ ముదురుతున్నాది. అందరూ గోచీలతోనే వున్నారు. నల్లగా దృఢంగా వున్నారు. ముఖంలో కళలేదు. ఏదో గోలగా మాట్లాడుతున్నారు. యాసలో ఓడ్రం కలుస్తున్నాది. ఒడియా మాటలున్నట్లు నాకు తోచింది. సవరల భాషకు లిపిలేదు. గిడుగు శ్రీరామ్మూర్తి పంతులుగారి కృషివలన ఓ ప్రత్యేక లిపిని, వాచకములను తయారుచేశారు. అక్షర దేవాలయాలు వాటికి పండగలు చేయటం కూడా కొన్ని గూడేల్లో కనిపిస్తుంది..

నలుగురు అనారోగ్యంతో ఉన్న మనిషిని ఎత్తారు. 'అతడు కాకులేన్, పం[డ్రెండు ఎనిమిది వయసుంటుంది. (పశువులకాపు) పాపం ఆకలి... గమాజ్ (మొనగాడు) లే...జి.. (ఊత పదం) యాసతో కూడిన భాష, విశ్వనాథం మాకు వివరంగా చెప్పాడు. సవరలు పన్నెండు వరకు అంకెలు చెప్పి అక్కడ నుండి ఒకటి, రెండు కలుపుతూ చెబుతారు.

"ఎక్కడకు తీసుకువెడతారు" నా ప్రశ్న.

"కసిమి పి. హెచ్.సి.కి, లేదంటే సీతంపేట." విశ్వనాథం సమాధానం.

సింహాచలం తన పనిలో తానున్నాడు. ఫోటోలు చకచకా తీసుకుంటున్నాడు. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫరతను. తనకు కావలసిన భంగిమలను అతి చాకచక్యంగా తీసుకోగలడు.

'అంతదూరమా... నడిచేసరికి అతను చనిపోతే', 'మళ్ళీ తీసుకువస్తారు.' బోయి అనగా పురోహిత్ ఆధ్వర్యంలో కర్మకాండ నిర్వహిస్తారు. మిగిలినవారు భోజనానికి కూర్చున్నారు. అదంతా రోజూ జరిగే తతంగంలా వారికి అనిపిస్తుందని నాకు అనిపించింది.

నేలను పాతిన రోటి మీద కూడు కుండ పెట్టుకొని దాని చుట్టూ అందరూ కూర్చున్నారు.

విశ్వనాథం ద్వారా మమ్మల్ని కూర్చోమన్నారు. ఆ సరికే విశ్వనాథం మేమెవరిమో గొమాంగ్‌కు తెలిపాడు. తెగ నాయకుని గొమాంగ్ అంటారు. మమ్మల్ని గురించి గొప్పగా వారికి చెప్పాడు. సింహాచలం అతని ఫోటో తీసి అతనికి చూపించాడు. అతనెంతగానో ఆనందపడ్డాడు.

అందరూ సిల్వర్ చిప్పల్లో ఓ పసుపు పచ్చని ముద్దను వడ్డించుకున్నారు. మిరపకాయలు వేసుకొన్నారు. ఒక బుంగబూరలో నీళ్ళున్నాయి. అది మామిడి టెంకలను ఎండవేసి, పిండి చేసిన దానితో తయారైన అంబలి. ఎండా కాలంలో వారికేమీ మిగలదు. పోడు వ్యవసాయం వలన మళ్ళా శీతా, వర్షాకాలంలోనే కాస్త గింజలు దొరుకుతాయి. అంతవరకు మామిడి టెంకల పిండితో చేసిన చక్కులు, బలి సమయంలో చంపబడిన జంతు మాంసమును ఎండబెట్టి, దాని మాంసంతో చేసిన కూర తింటారు. కూరంటే నూని, మసాలు వేసికాదు. నీటిలో ఉడికించి ఉప్పు అంటించి అంతే!

నాకు వాంతి వచ్చినట్టయింది. సింహాచలం కూడా అంతే. విశ్వనాథం మాత్రం కొంచెం తిన్నాడు.

ఇంతలో ఎవరో కొద్దిగా పులిహారలాంటిది తెచ్చారు. కొరవ బియ్యం ఉడకేసి, ఇప్పనూనె, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి చేస్తారు. విశ్వనాథం చెప్పాడు. నేను సింహాచలం చేయి పట్టాము. అంటుకుపోయింది. ఎప్పటికి రాదే... ఇప్పనూని జిడ్డు.

'మేం తంబ (పగలు) తౌగల్ (రాత్రి) ఇదే తింటాం.' ఎవరో సవర ఆసామీ జవాబు. ఏమిటో భాష ఆ యాస అర్థం కావటంలేదు.

అందరూ ఎవరి గుడిసెలకు వారే వెళ్ళిపోయారు. నిశ్శబ్దం, ఆకలి, దాహం, వాతావరణం మరింత వేడెక్కింది.

విశ్వనాథంలో ఒక సవర సభ్యుడున్నాడు. కనుక అతనికి అంతా మామూలుగానే ఉన్నట్టుగా వుంది. డ్యూటీ తప్పదు. సవరలు గురించి మరిన్ని వివరాలు కావాలి. విశ్వనాథంను అడిగా, కొంతవరకు గిడుగు రామ్మూర్తి పంతులుగారి కథల వలన తెలుసుకొన్నాను.

'సవరలు సాధ్యమైనంతవరకు ప్రశాంతమైన జీవనాన్ని కోరుకుంటారు. దాచుకోవటం, ఇతరులను దోచుకోవటం వారికి తెలియదు. కోదులు, కొండవాళ్ళు వంటి జాతులలా వీరు నరబలులు ఇవ్వరు. ధాన్యము, చోళ్ళు, గుడ్డలు మాత్రము ఎత్తుకొనిపోయేవారు ఒకప్పుడు. సవర గ్రామాల్లో వారికి తిండికి ఉన్నదానినే అతిథులకు పెడతారు. ఇప్పటిలాగానే మగవాళ్ళు తాగి ఏదైనా పొరపాటు చేస్తే, ఆడవాళ్ళు వారిని మందలిస్తారు. మళ్ళీ అటువంటిది జరగకుండా చూసుకుంటారు.

లోడో రోయి అనే ప్రత్యామ్నాయాలకు సరైన పదం సవరభాషలో లేదు. సూజన్ అని మాత్రమే వుంటుంది. 'లేదు' అనే పదానికి 'ఎజ్జె' అని, 'అవును' అనే దానికి 'ఒడె' అని, స్వరమును బట్టి ప్రశ్నార్థకం తెలుసుకొనే వెసులుబాటు భాషలో వున్నాయి. యాసలో ఒక రకమైన ఓద్రం వినిపిస్తుంది. చెట్టు, పుట్ట, కొండ, గెద్ద అన్ని వీరి ఆరాధ్య దైవాలే. బంధువులు, స్నేహితులపట్ల అనురాగం చూపిస్తారు. అబద్ధమాడరు, ఖూనీ చేసినా అంగీకరిస్తారు. ఒక ప్రత్యేకమైన జీవన విధానం. ఓ అమాయకమైన జీవనశైలి వీరిది. ఈ ప్రాంత నాయకులకు వీరు తెలియదు. తెలిసినా ఇటువంటి ప్రాంతాలకు వారు రారు.

ఈ ఓట్లు, ఓటర్లు వారికి లెక్కలోనివి కావు. ఇక్కడ జనం ఆకలితో, దారిద్ర్యంతో చస్తున్నా వారికి లెక్కలేదు. అనవసరం కూడా!

ఒక్క క్షణం ఆగాడు.

గంట క్రితం మంచం మీద తీసుకువెళ్లిన పేషంట్‌ను తెచ్చారు. అతను పోయాడు. వైద్యం అందలేదు. పసరు మందులు పనిచేయలేదు. ఆకలికి మందులేదు, ఆకలి చావుకు ఆప్షన్ లేదు. అందరూ గోలగా మంచం మీదున్న మనిషిని దించారు. బోయా అనబడే పురోహితుడు కర్మకాండకు ఏర్పాటు చేస్తున్నాడు.

పాడె సిద్ధమైంది. ఎత్తారు. దూరంగా అడవిలో పాతిపెట్టి వచ్చారు. ఏంటో ప్రకృతిలో జన్మించిన మనిషి దానిలోనే లయమైపోయాడు.

వీరంతా ప్రకృతి ఒడిలో బ్రతికారు. బ్రతుకుతున్నారు. పోడు చేసి, పాడు పొట్టకు సాపాటు సంపాదించుకుంటారు. రేపు అనేది వారికి తెలియదు. తెలిసినా చేయగలిగింది, దాచ గలిగిందేముంది కనుక! గోచీపాతరాయళ్ళు ఏకవస్త్ర స్త్రీలు... ప్రపంచం అంతరిక్షం వైపు అడుగులు వేస్తున్నాది. వ్రేలి కొసన సాంకేతిక విప్లవ ఫలాల ఫలితాలను శాసిస్తున్న వర్తమానంలో... సంవత్సరంలో ఆరునెలలు మాత్రమే తిని, మిగిలిన ఆరునెలలు మామిడి టెంకలను ఎండబెట్టి పౌడర్ చేసి, అదే రోజూ ఆహారంగా తిని, తినలేకపోతే చచ్చి, బ్రతికే మార్గం లేక, బ్రతకటానికి అవకాశం లేక, అందుబాటులో వైద్యం లేక, చనిపోవలసిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. ఎంతటి విషాదం! జీవిక కోసం తినాలి. తిన్నదే జీవి హరిస్తే....? మరింక బ్రతికేదెలా?

ప్రకృతితో నిరంతర పోరు కొనసాగించగలిగితే జీవితం. ఓడిపోతే మరణం. ఆ మధ్య జీవితం దుర్భరం. నాగరిక భాషలో ఆ పదముంది. ఇక్కడ వీరి భాషలో లేదు.

నాకక్కడ ఉండాలనిపించలేదు. 'బయలుదేరుదామా?' అన్నాను విశ్వనాథంతో.

"సాయంత్రం వరకు ఆగుదాం. ఓ వింత మీరు చూడాలి. బయట ప్రపంచానికి చెప్పండి!"

"ఏమిటది..." సింహాచలం ఆసక్తితో కూడిన ప్రశ్న.

"చనిపోయినవాడు పేరంటాలి మీదకు వచ్చి తన మాటలు వినిపిస్తాడు!"

"నిజమా.. నిజమే..." నమ్మకంలేని నాగరిక ప్రశ్న.

ఆ సాయంత్రం ఆరు కావస్తున్నాది.. ఎండాకాలం వలన ఇంకా చీకటి పడలేదు. గూడెం నిశ్శబ్దంగా వుంది. గాలి వేడిగా వుంది. ఒకరిద్దరాడవాళ్ళు బిందెలతో ఎటో వెళుతున్నారు నీటికోసం. ఎక్కడికి, ఏమో... ఏ బండరాళ్ళ మధ్యనో కొద్దిగా వున్న నీటికోసం ఎంత బాధాకరం! అయినా వాళ్ళ ముఖాలలో విషాదం లేదు. చిత్రం! ఏవేవో చిత్రమైన పక్షులు, జంతువుల అరుపులు. నీరులేదు, టీ లేదు, తినడానికేమీ లేదు. ఆకలి... చిరాకుగా వుంది. అయినా బలవంతాన వాటిని అణచుకున్నాను. అంతకన్నా చేసేదేమీ లేదు కూడా. సంవత్సరాలు తరబడి వీరెలా బ్రతుకుతున్నారు? టి.వి. సెల్ఫోన్, సినిమాలు, స్నేహితులు, హోటల్స్, పార్కులు, ఏ.సి. బార్‌లు, పని ఇవేవి లేకుండా... ఎలా?

వీరు ప్రకృతిలో లయమవుతారు. అదే వీరికి ఆట, పాట, విద్య, ఆరోగ్యం... ఓ తాత్విక చింతన, భావ గాంభీర్యపు జీవికన కలుగుజేస్తుందనుకుంటా! నాగరికతకు దూరంగా ప్రకృతి స్వచ్ఛతకు, ప్రకృతిలో నున్న మానవత్వపు పరిమళాలకు దగ్గరగా బ్రతికే వీరి బ్రతుకులో ధన్యత వుంది. నాగరికుల దాస్యం వీరికి వుండదు. అంటనివ్వరు!

చనిపోయిన వాడి ఇంటి ముంగిట... దానిని ఇల్లు అనటానికి లేదు.. అదో నిట్రాడు గుడిసె. బయట అందరూ కూర్చున్నారు. పేరంటాలు వచ్చింది. కళ్లు మూసుకుంది. కొంతసేపటికి ఊగుతూ, మగగొంతుతో, చనిపోయినవాడి గొంతుతో తన పెళ్ళాంతో...

"సల్బాజ్ ఇంటి వాళ్ళకు, మూడు రూపాయలు అప్పట్లో నీవు గాని, చూడకుండా ఇచ్చినాను, గదా వాళ్ళు తిరిగి ఇచ్చినారా?" అంది.

"లేదు. ఎవరు ఇచ్చారు? నీవు చెప్పకుండా వాళ్ళకు ఇచ్చినావు. వాళ్ల బుర్ర పడిపోను" ఆమె గొంతులో కోపం.

"సల్బాజ్‌ను పిలూ... అడుగుతాను..."

ఒకతను పరుగెత్తుకొని పోయి సల్బాజ్‌ను పిలిచారు..

"నీవు ఏమి చేసినావు? నేను బతికి వున్నప్పుడు నిన్ను అడిగితే ఈవాళా రేపు అని జాలము చేసి వేసినావు" సల్బాజ్‌ను కసిరింది (కసిరాడు) పేరంటాలు.

"అలాగే... అలాగే... ఇచ్చివేస్తాను... నీవు కోపము పడకు!" భయంతో చెప్పాడతను.

చచ్చినదాని జీవుడు, సోది చెప్పేదానికి ఆవేశము వచ్చినప్పుడు తాను బతికి ఉన్నప్పుడు మాట్లాడినట్లే చెప్తాడు అని సవరల నమ్మకం.

"పద, వెళ్ళిపోదాం" అన్నాను.

"సరే." విశ్వనాథం గోమాంగ్‌కు చెప్పాడు. అతను మాతోపాటు, మేము వాహనాలు నిలిపే చోటు వరకు వచ్చాడు.

మేము అతనితో కరచాలనం చేసుకొని, అందరం ఓ సెల్ఫీ తీసుకొని బయలుదేరాము.

దూరంగా...కొండల్లో... ఎర్రని.. పెద్ద... సూర్యబింబం... చంద్రుడు. పెద్దగా పున్నమి అనుకుంటా...వెలుగులు చిమ్మటానికి ఆయత్తమౌతున్నాడు.

అడవిగాచిన వెన్నెల... వీరి జీవితాల్లో వెన్నెల ఎప్పుడు?

సమాధానం ఎవరు చెబుతారు?

(డా. అల్లంశెట్టి చంద్రశేఖర్‌గారికి కృతజ్ఞతలు)

*(సవరల భాష, యాస, మాండలికం అంతా కూడా ఒడ్రలో మిళితమై వుంటాయి. వారి యాసను భాషలో చూపటం కుదరదు. వాక్యాల మధ్య ప్రత్యామ్నాయాలు తక్కువ. అర్థం చేసుకోవటము కష్టమే. నేను గమనించిన మేరకు అక్కడక్కడ కథలో వాటిని అమర్చాను. తప్పులకు క్షంతవ్యుణ్ని–రచయిత)*

# కథకుడి అంతరంగం

మెడికో శ్యామ్

+18032375741



కేంద్ర సాహిత్య అకాడమీ వారు ప్రవాసీ మంచ్ పేరిట 16.07.2020 తేదీన నిర్వహించిన కథాపఠన కార్యక్రమంలో రచయిత సమర్పించిన అముద్రిత కథ

*'దేశ బాషలందు తెలుగు లెస్స' నుంచే దేశ బాషలందు తెలుగు లెస్సు' దాకా సాగిన ప్రయాణంలో మన బాషల మరణం నీ పెట్సీవ్. కాని దానికి నీ ఉద్యోగ పర్యంలోనూ ఆ తర్వాత నువ్వు చేసిందేమీలేదు. నీ మరో ఉభాలాటం నీ 'ఘుమక్కుడ్ జిజ్ఞాసా'! అదే నీ తెరుగుడు. నీ వల్ల కలిగిన ప్రయోజనం నాకైతే అర్థం కాదు.*

పుస్తకాలకి ముందు మాటలా వెనుక మాటలు వుంటాయి. కొన్ని కథలకీ వెనుక మాటలు వుంటాయి. ఈ కథకి వెనుక మాట కావలసిన ముందు మాటలివి.

మనమంతా 'గతమెంతో ఘనకీర్తి' గల వారమే. కాని మన వర్తమానం మాత్రం అస్తవ్యస్తంగా వుంది. ఈ అసమంజస వాతావరణంలో మన సమాజాలు, మన జీవితాలు డొల్లగానే వున్నాయి. మన ఈ మెలొడీలకి రేమిడీల నివ్వవలసిన వాళ్ళు, వాళ్ళు కూడా మెల్లగా చెప్పినా, చల్లగా చెప్పినా డొల్లగానే ఉన్నారు.

ఈ సందర్భములోనిదే ఈ 'కథకుడి అంతరంగ కథనం' లేక అతని అంతర్మధనం!

కథకుడి అంతరంగం!

అలవాటుగా నువ్వూ బాల్కనిలో నిలబడ్డావు.

నీకెప్పుడూ వచ్చే ఆలోచనే వస్తోంది. దూరంగా చల్లగా అకుపచ్చగా చూడముచ్చటగా ఉంది.

ఇదే దేశం? ఇదే ప్రదేశం?

అన్ని దేశాల్లోనూ, అన్ని ప్రదేశాల్లోనూ ఎత్తునుంచి చూస్తే నా కిదే అనిపిస్తుంది. అన్ని ఒకలాగే అనిపిస్తాయి.

నువ్వు ఇండియాలో వున్నావా?

అమెరికాలో వున్నావా?

నీ గొంతేవరిది? తెలుగు వాడిదా? భారతీయుడుదా?

గొప్పగా చెప్పుకొంటావు. రాష్ట్ర పరంగా నేను రెండు తెలుగు రాష్ట్రాల తెలుగువాడిని. జాతీయంగా భారతీయుణ్ణి. అంతర్జాతీయముగా విశ్వ మానవుణ్ణి అని!



ఔనా? నిజమేనా?

ఎక్కడున్నా నువ్వు తెలుగు వాడివి మాత్రమేగా, తెలుగు కథకుడివేగా కదా? కదా?

నీ రాతలు, కోతలు, కూతలు నాకు తెలియనివా?

ఈజీ చైర్లో అనీజీగా కూర్చున్నావేమిటి?

మధ్యలో ఆ పచార్లేమిటి?

మళ్ళీ ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి నిన్ను కథ చదవమన్నారా? సమకాలీన తెలుగు స్వరాల్లో నీ గొంతు వినిపించమన్నారా?

అయితే ఏ కథ చదువుతావ్?

పాత కథా? సరికొత్త పాతకథా?

కొత్త కధే!

అదేమిటి కొత్తగా చీరకట్టిన అడ్డపిల్లలా ఆ తడబాటేమిటి? ఆ కలవరమేమిటి?

చెయ్యి తిరిగిన రచయితవే? – కాదా?!

చేయి విరిగిన రచయితనా? కానే కాదా? మరి?

పోనీ నీకు సహాయం చేస్తానులే. ఆలపిస్తాను, అవలోకన చేస్తాను. అప్పుడప్పుడూ ఎప్పుడెప్పుడో నువ్వన్నవన్నీ నీకు వినిపిస్తాను. విను!

"చేయరాదు ఆలాపన మన పేలపన" అన్నావు నీ మరో ప్రేమ గీతంలో గుర్తుందా?

కవులని 'కవుస్స్' అంటావు. నువ్వు కవులు సదా బాలకులో కాదో గాని, కథకులు మాత్రం ఎప్పుడూ యువకులే! ఓపినయ్యర్ అన్నట్టు నీ ఒళ్ళంతా నిండి నిండి నిండుగా రోమాన్సే!

కదిలి అద్దం ముందు నిలబడ్డావు. క్రాఫింగు దువ్వి దువ్వి, చెరిపి, మళ్ళీ దువ్వి.... వున్న ఆ నాలుగు వెంట్రుకులు.... ఈ లాక్‌డౌన్ వల్ల నీ లాక్స్ కాస్త దట్టంగా వున్నాయి గాని లేకపోతేనా.

అందంలోనే కాదు, అన్నిట్లోనూ నీకు నచ్చేది నువ్వే. నీకు తెలిసిందే. ఆ గ్రీక్ మిథాలడిలో ఎవరో అమ్మాయి నీట్లో తన నీడని

చూసి ఆ నీడ ప్రేమలో పడిందట!

ఆ సోషల్ మీడియలన్నిట్లోనూ నువ్వు పెట్టిన నీ ఫొటోలే... పైగా ప్రొఫైల్లో మూతి మీద చేత్తో అ సహజ కవిత్రి అన్నట్లు అందముగా వున్న నీ పాత ఫొటోలే అన్న.

అన్నట్లు ఇది నిజమేనా?

అక్కడెక్కడో ఆ మ్యూజియంలో వాడెవడో పెట్టిన ఫోటో ఎగ్జిబిషన్‌లో రకరకాల ఫేజుల్లో, రోజుల్లో, ఫోజుల్లో నువ్వు నువ్వే పెట్టించావని గాసిప్.

నీ మాటల్లోనే "ఒ కప్ కాఫీ – ఓ సిప్ గాసిప్"

ఇది మరో సిప్‌ని, కప్‌ని మీరి మించి ప్రవహిస్తున్న నీ నర్సిసిజం నీ నాష్టాల్జియా .

లోకాలన్నీ మూసుకుపోయిన ఈ కోవిడ్ కోలాహలంలో కూడా నీ పాత గోలే. మళ్ళీమళ్ళీ వినిపిస్తున్నావు అన్ని వేళలా.

నిన్ను చుస్తే ఆశ్చర్యం వేస్తోంది. నువ్వు నువ్వేనా? అని నువోక్కడివి కాదే. పొరలు పొరలుగా, తెరలు తెరలుగా, తరతరాలుగా నీలో లోలోపల పరచుకున్న విశ్వరూపమేమయింది? అభ్యుదయానికి, నవ కథానికే దారితీసిన, దారి చూపిన ఆ శక్తులన్నిఎటు పోయాయి?

ఎంతసేపూ సొంత గోడే?!

నిజమే ఎటూ వెళ్ళలేవు. ఇంట్లోనే పడున్నావ్. అయితే మాత్రం? గులాబ్‌జాములు చేయడాలో, కేకులు కోయడాలూ నిమిష నిమిషానికీ సెల్ఫిలూ.

ఎవరన్నా చూస్తారా? చదువుతారా నీ రాతలు?

నిరుపానమైన, నిరుపయోగమైన రచనలన్నావ్. అది నీ గురుంచి నువ్వన్నదేనా?

సంఘటనల కల్పనకీ, వాతావరణ చిత్రణకీ, సంబాషణ శకలాలకీ తీరుబడిగా కధల్లడానికి, ఇది సరైన సమయం కాదంటావా?

నువ్వే అన్నావు ఎవరితో ఎవరు మాట్లాడినా, మాట్లాడకపోయినా అది కధే ఔతుందని

మరి నాలో నేనో, నీతో నేనో అన్నవన్ని కధేనేగా. ఒక ఉద్వేగపూరితమైన అనుభూతిని అందించిన కథాత్మకత కాదనకుండాపోతుందా? మనిషి లోపలి కల్లోలానికీ, అలజడికి అక్షరాలు నే పేర్చుకుంటూ పోతే కథేగా అయేది? నా కథా కథన నైపుణ్యమే నా మోనోలాగ్ లోని అసలు కథ.

చూసావా నీ ప్రభావం నీ మీద కూడా ఎలా పడుతోందో!

నీకు గుర్తుందా?

అయన ఆ పెద్దాయన యనభై వుంటాయేమో! అయన నీ దగ్గరకి వస్తూ వణుకుతూ ఉన్న చేత్తో జేబులోవున్న ఆ కాగితం

తీసాడు.

కాసేపు అలోచించి, నీ చేతిలో పెట్టాడు.

నువ్వేమిటన్నట్టు చూసావు.

అప్పటికే గొప్పవాళ్ళా, మొనగాళ్ళా… గంభీరంగా చూడ్డం నీ కలవాటుయినది.

అయన విప్పి చూడమన్నట్టు చూసాడు.

నువ్వు విప్పి చూసావు.

దాంట్లో ‘ ఐ వాన్ట్ సేపరేషన్ ఫ్రం హర్’ అని వుంది.

ఎందుకన్నావు? నువ్వు

“సఫొకేషన్” అన్నాడాయన

నేవ్వెంత ఎగరాలో అంతే ఎగిరేవు

కలకాలం సౌహార్ద్రంగా వుండడంలో సాహిత్యం గురించి వీలైనంత ఇలాక్వంట్ గా చెప్పావు.

అసలు నువ్వేం చెప్పినా నీ చెవులకవి ఇలాక్వంటే

అప్పట్లో పెళ్లల్లో వున్న సుగుణాలు నీకు చాలా ఇష్టం. అన్నీ వింటారు, ఏదీ కాదనరు నువ్వేం వినక్కర్లేదు.

ఇపుడు పెళ్ళాలు అనకూడదట. అదేదో సహచరి, సహచరుడు ఇలా కొత్త పేర్లు పెట్టేరు. నీకవెం బొత్తిగా నచ్చేవి కావు. హాయిగా ఎద్చేసిన బుర్రూపుతూ నీకావలసినవి చేసేవాళ్ళు నచ్చకేం.

కాని వాళ్ళకి కూడా వంకలు పెడుతూ వుంటావు, అది వేరే సంగతి.

సడెన్‌గా నీకు షాకు తగిలింది ఒక ఉదయం

నీ పెళ్ళం, ఔను పెళ్లమే నీ జీవితములోంచి నడిచి వెళ్ళిపోయింది.

కొంత అలోచించి ‘పోతే పోయిందిలే’ అనుకున్నావు.

నీ పనికిరాని మిత్రుల సలహాల మేరకి కొంచెం బతిమాలి, ఆవిడ లొంగదని తెలిసాకా గట్టిగా బతిమాలేవు. అప్పటివరకూ అన్నీ జీవితంలో నీ ప్రకారమే నడుస్తున్నాయి మరి.

ఈ లోపున ‘మీ టూ’ అన్నారు దేశ దేశాల్లో ఆడవాళ్ళందరూ.

‘నో’ అంటే ‘నో’ అన్నారు

నీకవేం తెలీదు

నువ్వు "కాదంటే ఔననే. ఔనంటే కాదనే అడువాళ్ళ మాటలకూ అర్థాలు వేరులే, అర్థాలు వేరులే, అర్థాలు వేరులే ఔనంటే కాదనే కాదంటే ఔననే....."

అది ఎటర్నల్ ట్రూత్ అనుకున్నావు

ఔను నీకు చాలాసార్లు వీలు కుదిరింది మరి

అందుకే మరీ చిన్నపిల్లకాని ఆవిడెవర్తోనో సరదా కబుర్లు చెబుతూ చెబుతూ కాస్త హుషారవబోయేవు

ఆవిడ 'నో' అంది

'నో' అంటే 'నో' అంది

కాని నీ మనసులో చెవుల్లో ఆ పాత పాటే గింగురు మంటోంది.

అదికాక, నువ్వు కవితాత్మకత కలిగిన కథకుడివే, భావుకుడివే కనక నీకు శిథిల సౌందర్యం పట్ల కూడా ఆకర్షణ వుంది.

అసలు నీకు ఆడప్లేవరు చాలు.

అందుకే, "నేను నాకెప్పుడు పాతికో ముప్పయ్యో అనుకుంటానండీ నా వయస్సుంతే అని బలంగా నమ్ముతానండి. ఇవేవీ తప్పుకావండీ. స్త్రీ పురుషులు మధ్య ఆకర్షణ సహజమండీ మనస్సుల్లో వున్న కోరికల్ని సప్రేస్ చేసుకోకూడదండీ." అన్నావు.

అవిడ విన్లేదు

నీ ఈ ఘోర్సులన్ని నీ ఫ్రెండ్సందరికీ ప్రగాఢంగా తెలుసు. నీ విషయంలో ఏది సరియినదో, ఏది కాదో వాళ్ళు పట్టించుకోరు కనక నీకు చెప్పరు.

నువ్వు మళ్ళీ 'దే వుమన్ దే ఆర్ ఫిట్ ఫర్ నథింగ్' అనుకున్నావు. "దే ఆర్ మెంట్ ఫర్ కికింగ్ ఎండ్" అనుకున్నావు.

" ఆ హావభావాలూ, ఆ ఉత్సాహం, పరవశమూ చూసి ఏదో అనుకున్నాను గానీ మరీ ఇంత 'హిమంగిని' అనుకోలేదు. యూస్‌లెస్ ప్రిడిక్ వుమెన్" అనుకున్నావు.

పైగా స్రీవాద రచయిత్రుల్ని తలుచుకొని తలుచుకొని మరి నవ్వుకున్నావు.

వాళ్ళకేం కావాలన్నది నీ ప్రశ్న.

"స్రీ హృదయం లో నిండుగా వున్నంత ప్రేమకి అర్హుడైన పురుషుడు కాదు మగపురుగు ఈ అనంత విశ్వంలో ఒక్కడూ లేడు.."

ఇది కాదు ఆవిడ రాసింది?

ఆవిడకేం కావాలి... కాదు కాదు దానికేం కావాలి?

అది కాదు నీ ప్రశ్న?

స్రీల మీద నీ అభిప్రాయం ఇంత ఉన్నతంగా వుండడానికి కారణమేమిటో?

స్రీలంటే ప్రియురాళ్ళు, జనరాళ్ళునా, వాళ్ళ పర్పస్ మరేమీ లేదా?

అమ్మలు, అక్కలూ, అత్తలూ, పిన్నులూ వగైరా వగైరాలంతా స్రీలు కారా?

మాట వరసకి, ఒకసారి నువున్నావు. స్రీ పాత్రలేని నాటికమేమిటి? మన సంఘంలో, సమాజంలో సగం, సగంకంటే ఎక్కువున్నస్రీకి పాత్ర లేకపోవడమేమిటి? స్రీకే పాత్ర లేకపోతే నువ్వు కంటావా? నేనుంటానా? అన్నావు.

"బాడికి, బీడికి కూడా వేడి బొమ్మలేస్తారు, కాని ఆ లేడీని లేడిగా బావించారు" అని ఖండించావు.

అసమానతలు అన్ని స్థాయిల్లోనూ అంతరించాలన్నావు.

స్రీలూ, పురుషులూ పరస్పర గౌరవాదరాభిమానలతో మర్యాద చూపి మన్నన పొందలేరా? వాళ్ళు మ్యుచువల్లి ఎక్స్‌క్లూజివ్ కారు గనక, ఆ విషయాన్ని గ్రహించి వ్యవహరించలేరా?

"హీనంగా చూడకు దేన్ని" అంటావు నువ్వు

అంటే ఎవర్ని అని కూడా అర్థం కాదా?

అతలాకుతలం చేసింది కరోనా

దేశం, ప్రపంచం అంతా మూసుకుపోయింది

కానీ, నీ డిజిటల్ ప్రపంచం మాత్రం దూసుకుపోతోంది.

ప్రతి సాయంత్రం. ప్రతి రాత్రీ

పనికిరాని పాత రచనల్ని మళ్ళీ మళ్ళీ ఝులిపిస్తావు

మళ్ళీ చెప్పాలా నీవే అని?

ఓ ఆరడజను కాన్‌స్టంట్ ఫీచర్సు

కాగితం పువ్వుల్లాంటి ముఖాలు ప్లాస్టిక్ చారునవ్వులలో ఆహో ఓహో లతో అదే అదే అదే పదే పదే

'దేశ బాషలందు తెలుగు లెస్స' నుంచే దేశ బాషలందు తెలుగు లెస్సు' దాకా సాగిన ప్రయాణంలో మన బాషల మరణం నీ పెట్పీవ్. కాని దానికి నీ ఉద్యోగ పర్వంలోనూ ఆ తర్వాత నువ్వు చేసిందేమీలేదు.

నీ మరో ఉబలాట, నీ ఘుమక్కడ్ జిజ్ఞాసా'! అదే నీ తిరుగుడు. దీని వల్ల కలిగిన ప్రయోజనం నాకైతే అర్థం కాదు.

సమకాలీన జీవనాన్ని గురించీ, పరిస్థితుల గురించీ నీ వ్యాఖ్యలు నీ పొలిటికల్ కరెక్ట్‌నెస్ వల్ల సజీవంగానూ వుండవు. సౌరభాలతోను పరమళించవు. పైగా సాహిత్యం వల్ల ప్రయోజనముందా అనే నీ సంశయాత్మకత!

ప్రశ్నించడం మర్చిపోయవో, మానేసేవో కాని సాహిత్య గిరిశానీవై పోయావ్.

మళ్ళీ తెల్లవాడికన్నా తెల్లవాడివంటావు తెలుగువాణ్ణి. నిజంగానే నీకు తెలియదా మన 'తెల్లమోహం'?

"ఒక్కడన్నా వెళ్లి ఆ ప్రొటెస్ట్లో నిలిచాడా మనవాడు?" అంటావు. అది మాత్రమే ఏక మాత్ర జీవితావసరమైనట్టు.

వీలెత్తి చూపడంలో కాదు నీ ప్రతిభ. ఏ ఏ వేసాలు ఏటేటు చుపాలనీ కాదు.

"అపనె అందర్ జరా ఝూంక్ మేరె వతన్

అపనె అందర్ జరా ఝూంక్ మేరె వతన్

రంగ్ ఔర్ నసేవ్ కె దాయేరే సే నికల్

రంగ్ ఔర్ నసేవ్ కె దాయేరే సే నికల్

గిర్ చుకా హై బహుత్ దేర్ అబ్ తో సంభల్

గిర్ చుకా హై బహుత్ దేర్ అబ్ తో సంభల్

ధూన్డ్ అపనె లి యే అబ్ నయా రాస్ తా

అపనె అందర్ జరా ఝూంక్ మేరె వతన్

అపనె అందర్ జరా ఝూంక్ మేరె వతన్

ఏ 'వతన్'? ఎవరి 'వతన్'?

నువ్వే దేశం వాడినైతే ఆదేశం నీ దేశం

నీ లోపలికి లోలోపలికి తరచి చూసుకో శ్వేతాశ్వేతాలీవారు మిగతా రంగుల్నుంచి దూరంగా జరుగు విశ్వమానవుడివి నువ్వు.

నీ మనసులోని మాటలే ఇవి మధ్యలో నువ్వు మరచిపోయనవి

"మతములన్నియు సమసిపోవును

జ్ఞాన మొక్కటే నిలిచివేలుగును"

లాక్డౌన్ లో సోషల్ డిస్టేన్సింగ్ ఎవరినీ కల్సుకోలేక, ఎవర్ని హత్తుకోలేక అని పొల్లు మాటలు చెబుతావు. మనకి సోషల్ డిస్టేన్సింగ్ ఎల్లవేళలా వుంది. అదే ఎన్నెన్నో సమస్యలకి దారితీసింది

నువ్వెప్పుడూ ఒంటరివే నీ పక్కింటి వాడెవడో నీకు తెలీదు. ఇప్పుడు కావాల్సింది పిజికల్ డిస్టేన్సింగ్ మాత్రమే.

నలుగురితో కలిసి నలుగురికే నలుగురికోసం దూరంగా వుండు

చాలు

కావలిస్తే కాఫీ తాగు

'కాఫీ ఈజ్ ఏ హాగ్ ఇన్ ఏ మగ్' అన్నడెవడో

కాస్త ఇవి కూడా చూడు

కథల్లో నీతులుండక్కల్లేదన్నావు. బూతులుండోచ్చాన్నావు. కథ ప్రేక్షకుడున్ని విరగ్గోడతనన్నావు సందేశాలు స్పష్టంగా వుండకూడదన్నావు బాగానేవుంది మరిదంతా ఎందుకోసం? ఎవరికోసం?

"రచన చూడు, రచయితను చూడకు" అన్నావు అంతవరకూ బాగానే వుంది కానీ మరీ అన్యాయంగా రచయిత యవర్తో తిరిగాడు? ఎందర్నిపెళ్ళాడారు? అనవసరం వ్యక్తికి చరిత్రే అవసరం అన్నట్లుగ్గా అంటావు. అది సరిమైనదేనా? నీలాంటి వాడు అనవలసిందేనా?

అలసిపోయినట్టున్నావు

అదేదో తెచ్చుకుని వాగుతున్నావు

అలసట తగ్గేందుకు సరదాగా ఇది చెబుతాను నీకు.

అతడేవడో కథకుడు రాసినట్టు, కథలోకి, మన ఈ కథలోకి, ఈ కతవింటున్న చదువుతున్న పాఠకులు ప్రవేశించారు పాత్రలుగా

'పాఠకులంటే ఎవరు?' అంటావా

నీ సహ కథకులే హవ్స్ డ్రాపర్స్ ... వాళ్ళు కమెంటించడం క్రోశ్నించడం ప్రారంబించారు

డాక్టర్ల గురుంచేందుకు రాయవు?

లాయర్ల గురుంచి రాయవు

కుడి ఎడమల గురుంచీ, అధినాయకుల గురుంచి వాళ్ళ వాళ్ళ – – – – రాళ్ళ గురుంచి అభిశంసన లేవేలేవెం? పోనీ ప్రశంసలో

అది కాక విళ్ళీ నేనో పేర్లు రాసుకున్నారు

అవ్వన్నీ కట్ చేసి పారేసాను

అన్నట్లు వీళ్ళలో ఆల్మోస్ట్ అందరూ ఐటి కూలిలో మేస్త్రిలో వీళ్ళ డిజిటల్ ప్రపంచంలో సున్నితం సౌకుమార్యం, సహజత్వం మెత్తన్ని ఉహాలు వెచ్చని స్పందనలు ఇంకా వున్నయంటావా?

నువ్వు చెయ్య తిరిగిన వాడివేనే చెయ్యి విరగని వాడివలె మరి తిరగదేం నీ చెయ్యి?

అసలు సంగతి నీ ఆలోచనలోని అ సంగతి. జనజీవన స్రవంతి పట్ల నీ నిర్లిప్తసరళి

నీకు తెలిసినవే ఇవ్వన్ని

జీవితంలో ఇన్నిరంగులు మార్చేవు అయిన నీ మోహంలో మారుతున్న ఆ రంగులేమిటి?

నా ఈ ఆఖరి ఏకరవు వినుకో లేక వినిపో

“ఆఖరి మాట మొదటి మాట

ఆశలకేం అనంతం

ఆకాశం అంతవాణ్ణి

అప్పారావు నా నేస్తం”

అని అన్నవాడికీ, అప్పారావు గారికి వరసలోవారసుడివి

ఏవీ నీ ఉత్తమాభిరుచులు, ఉన్నలే నాయాలూ, ఉదాత్త భావాల?

ఏమయింది నీ మహా సంకల్పం?

విరిలన్తివడివి ఆవిరిగా మిగిలావు

నేసెంటు ఆక్సిజెన్ లాంటివాడివి ఇప్పుడు నీలో ఏ సెంటూ లేదు.

నువ్వు చస్తున్నది సాహిత్య వ్యాపకం కాదు


నీది సాహిత్య వ్యాపకమూ కాదు

నీది సహిత్య వ్యవహార వ్యాపారం మాత్రమే

నిన్ను నీవు తెలుసుకో నిన్ను నీవు బలుచుకుని తిరగేసి తొడుక్కో

నీ లోపలికి లోలోపలికి తరచి తరచి చూసుకుని మళ్ళీ మొదలుకా. నవజాతంగా, నవనీతంలా

అంతవరకు క్లోసు యువర్ షాప్!



# పూజారి పున్నయ్య

అరిగే రామారావు

**విశిష్ట అతిథి కథ**

***మనశ్శాంతి లేక బాధపడుతున్న పున్నయ్య ఒక సాయంత్రం గట్టుమీదకు వెళ్ళాడు. మూసి ఉన్న గుడి తలుపులు తెరిచాడు. కాంతిహీనమై ఉన్న శివలింగాన్ని చూశాడు. ధూళిదూసరితమైన ఆదిదేవుడ్ని తన కన్నీటితో అభిషేకం చేశాడు. తన హృదయాన్నే నైవేద్యంగా సమర్పించాడు. ఆత్మజ్యోతిని వెలిగించాడు. గుడిగంటను గణగణమని మోగించాడు.***

మా ఊరికి దక్షిణదిశగా ఒక పెద్ద గట్టు ఉంది. ఆ గట్టు మొగిట్లో ఒక పెద్ద శివాలయం. అది పాతది; పాడుపడ్డది.

గర్భగుడిలో చీకటి కాపురం ఉంది!

చీకటి కాపురం ఉండే ప్రతీ ఇంటికీ అతిథులు... గబ్బిలాలూ, సాలెపురుగులూ... ఈ పాతబడ్డ శివుడి కొంపలోకి ప్రవేశించడంలో... లోకేశ్వరనిలయమని ఏమీ మొగమాటం చూపలేదు.

తలమునిగే అప్పులు చేసి, తీర్చే విధానం లేక, మొగం బయటకి చూపలేక, ఇంట్లో దాక్కున్న దరిద్రుడిలా ఉన్నాడు ఆ గుడి ఆసామీ ఆ కటిక చీకటిలో...

ఆయన నెత్తిన మన్నూ... దుమ్మూ!

చీకటీ, శివుడూ, మన్నూ, దుమ్మూ, గబ్బిలాలూ, సాలెపురుగులూ... వీటితోపాటు నిర్భాగ్యుడైన ఒక భక్తుని ఆత్మకూడా ఆ పరమేశ్వరునకు పహరా తిరుగుతుంటుందని ప్రతీతి. అందువల్ల ఈ గుడిలోపలకు తొంగి చూడడానికే ఎవరికీ గుండెలు చాలవు. ఎవరూ దాని వంక తొంగిచూడక పోవడం వల్ల అది పాతదీ, పాడుబడ్డదీ అయ్యింది.

ఆ గట్టు మీదకు కట్టెలకు వచ్చేవారు మోపుల బరువు దింపుకొని, కాసేపు గుడి బయట కూర్చొని, అలసట తీర్చుకుంటారు. వాళ్ళలో వాళ్ళు ఈ పాతగుడి కథ చెప్పుకొని, వాళ్ళ దోవన వాళ్ళు పోతారు.

వాళ్ళు చెప్పుకునే కథ...

పున్నయ్య భార్య సీతమ్మ. రూపురేఖల్లోనూ, గుణసంపత్తిలోనూ ఆమె నిజంగా ఆదిసీతమ్మే! అందువల్లే, పున్నయ్య భార్యను దేవతవలే కొలిచేవాడు. కోరినవీ, కోరనివీ తెచ్చేవాడు. ఇంటిపని చేస్తే, ఒంటికి ఏమి ముప్పు వస్తుందోనని, కంటికి రెప్పలా ప్రతీక్షణం చూసుకునేవాడు. అద్దంలో మోహంలా మాటిమాటికీ చూసుకునేవాడు.

పున్నయ్యకు చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులు లేవు. కానీ, ఉన్నవాటిని పెంచకుండా తిన్నా, ముంచుకుపోయే ఇబ్బంది ఏమీ ఉండదు.

ఎందుకంటే, తినేవాళ్ళు అప్పటికి వాళ్ళిద్దరు మాత్రమే కాబట్టి.

భార్య కాపరానికి వచ్చిన కొన్నేళ్ళ తరవాత ఒకనాడు సీతమ్మకు అన్నం సహించక, కంచం ముందునుంచి లేచేసరికి, గాభరాలో వైద్యుడింటికి పరుగెత్తబోయి, భార్య వారించేసరికి ఆగిపోయాడు.

ఆనాటి సాయంత్రం సీతమ్మకు ఇంట్లోని ఫలహారాలేవీ సహించక, దొడ్లోని దానిమ్మచెట్టు కాయ కోసి, ఉప్పూకారం కలుపుకొని తింటుంటే ఏమీ అర్థంకాక, నిలదీసి అడిగాడు చెప్పమని. ఆడవాళ్ళకు పులుపుమీద మనసు ఎందుకు కలుగుతుందో, మగవాడు పున్నయ్యకు అర్థం కాలేదు.

సీతమ్మ సిగ్గుతో 'మీరు నాన్న కాబోతున్నారు' అనే సరికి, అతను ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయి, ఏం చేయబోయినా తిక్కిరిబిక్కిరిగా కనిపించింది.



ఇప్పుడు సీతమ్మ ఒట్టిమనిషి కాదు. పున్నయ్య ఆమెను ఏపనీ చెయ్యనియ్యడు. గదిలోనుంచి బయటకు రానియ్యడు. గది లోపల కాలు కింద పెట్టనియ్యడు. భార్యకు సకల ఉపచారాలూ చేస్తాడు.

భర్త పిచ్చికీ, అమాయకత్వానికీ సీతమ్మ తనలోతను నవ్వుకునేది. అత్తారుబతంగా చూసే భర్తను పొందినందుకు మురిసిపోయేది.

సీతమ్మకు నిండు నెలలు...

పున్నయ్యకు పండు కలలు...

ఒకనాటి అర్ధరాత్రి మంత్రసాని అవసరం కలిగింది. తొలిచూలు కాన్పు. సీతమ్మ బాధతో గిలగిలలాడిపోయింది. పున్నయ్య కాలుగాలిన పిల్లి అయ్యాడు. తెల్లారింది. సీతమ్మ బాధ ఎక్కువైంది. ఎండ ఎక్కింది. ఊరిలోకల్లా పెద్ద డాక్టరును తీసుకొచ్చాడు పున్నయ్య. డాక్టరు రకరకాల మందులూ ఇంజక్షన్లూ వాడాడు. పున్నయ్య డబ్బును నీళ్లలా ఖర్చు చేశాడు భార్యను బతికించుకోడానికి.

ఇరుగుపొరుగువాళ్లు, తెలిసినవాళ్లు, తెలియనివాళ్లూ వచ్చారు. సీతమ్మకు గుర్రపువాతం పుట్టింది. డాక్టరు పెదవి విరుపుతో, పున్నయ్య నడుం విరిగినట్లైంది. మూల కూలబడ్డాడు.

సంధ్యవేళ, అందరి ఇళ్ళలో దీపాలు వెలిగాయి. పున్నయ్య ఇంటిదీపం ఆరిపోయింది. పున్నయ్య జీవనజ్యోతి ఆరిపోయింది.

కటికచీకటి.

కన్నీటి జడి.

★★★

ఆనాటినుండి పున్నయ్య బతుకే మారిపోయింది. చీకటిగదిలో కూర్చొని, భార్య నగలనూ, చీరెలనూ మాటిమాటికీ చూస్తూ, సీతమ్మతో గడిపిన మధురరాత్రులను తలచుకుంటూ, ఆ మహాయిల్లాలి శ్రీకంఠరూపాన్ని మనసులో తలచుకొని కన్నీరు కార్చేవాడు. బంధువులూ, స్నేహితులూ అనేకమంది వచ్చి, అనేక విధాలా ఓదార్చి, మరలా వివాహం చేసుకోమని తమకు తోచిన సలహాలు ఇచ్చేవారు. దేనికీ బదులు చెప్పేవాడు కాదు పున్నయ్య.

మనశ్శాంతి లేక బాధపడుతున్న పున్నయ్య ఒక సాయంత్రం గట్టుమీదకు వెళ్ళాడు. మూసి ఉన్న గుడి తలుపులు తెరిచాడు. కాంతిహీనమై ఉన్న శివలింగాన్ని చూశాడు. ధూళిదూసరితమైన ఆదిదేవుణ్ని తన కన్నీటితో అభిషేకం చేశాడు. తన హృదయాన్నే నైవేద్యంగా సమర్పించాడు. ఆత్మజ్యోతిని వెలిగించాడు. గుడిగంటను గణగణమని మోగించాడు.

కోల్పోయిన మనశ్శాంతిని పాతబడ్డ శివాలయంలో కనుగొన్నాడు పున్నయ్య. ఆనాటినుండి పున్నయ్య 'పూజారి పున్నయ్య' అయ్యాడు. ఊరివారంతా గుడిని 'పున్నయ్య గుడి' అని అన్నారు.

పాతగుడి పునర్నిర్మించుటకు చాలా ఖర్చుచేశాడు పున్నయ్య. తనదగ్గర ఉన్న డబ్బుతో బీదప్రజలకు చాలా దానధర్మాలు చేశాడు. అతడు చేసే మంచికార్యాలకు ఊరివారెంతగానో పొగిడేవారు అతణ్ని. పున్నయ్య అంటే అందరికీ మంచి గౌరవభావం ఏర్పడింది. ఎవరు ఏది అడిగినా లేదనక ఇచ్చేసేవాడు. తనకవసరంలేని వస్తువులన్నిటినీ అమ్మేశాడు. చాలా క్లుప్తంగా జీవించడం మొదలుబెట్టాడు.

దానధర్మాలకు ఎముకలేని అతని చేయి భార్య నగలను మాత్రం ముట్టలేదు. వాటి విలువ ఎట్లా లేదన్నా ఐదారువేలను మించుతుంది. ఉదయం లేచిన వెంటనే భార్య నగలపెట్టె మూత తెరిచి, వినమ్రభావంతో చేతులు జోడించి, తన్ను వీడిపోయిన పవిత్రమూర్తిని మనసులో స్మరించుకునేవాడు.

సాయంత్రమవగానే, బాగా తోమిన రాగిబిందెతో నీళ్ళు తీసుకొని, పూజాసామాగ్రి ఒక పళ్ళెరములో పెట్టుకొని, గుడికి బయలుదేరేవాడు. పూజ పూర్తిచేసి, భక్తులు ఎవరైనా వస్తే వారికి తీర్థప్రసాదాలు ఇచ్చి, కాసేపు గుడి బయట కూర్చొని, చీకటి నలుదిశలా వదలనంత గాఢంగా కమ్ముకున్న తరవాత, మెల్లగా ఊరిలోకి బయలుదేరేవాడు.

పున్నయ్య జీవనప్రవాహం, నిలకడగా, నిశ్చలంగా సాగుతోంది.

ఒకనాటి సాయంత్రం పున్నయ్య ఆదిదేవార్చనకు బయలుదేరాడు. ఊరి కొసలను దాటుతున్నాడు.

“నమస్కారమండీ పూజారిగారూ…” ఒక స్త్రీ మధురకంఠం వినిపించింది.

తల ఎత్తి చూశాడు. ఇటునుండి ఊరిచివర పెంకుటిల్లు; అటునుండి ఊరి మొదటి పెంకుటిల్లు. పున్నయ్యకు గుర్తున్నంతలో, ఈ నాలుగేళ్లలో ఆ పాత ఇంటి తాళం నిన్నటి వరకూ తీసి ఉండలేదు.

నివాసయోగ్యం కాని ఇంటిగుమ్మంలో, చిరునగవుతో, వినయంగా చేతులు జోడించిన ఒక రూపసి కంఠస్వరమది. ఊహించనిచోట, అపరిచిత స్త్రీ కంఠంలోని చనువుకు, నమస్కరించిన అందమైన చేతులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక, తన్ను కాదన్నట్టు వడివడిగా ఆ ఇంటిని దాటి పోయాడు.

ఇంటి లోపలనుండి ఒక పురుషుని గుబురు తల, కోరమీసాలూ, ఎర్రజీరల కండ్లూ… గుమ్మంలో నిలుచున్న స్త్రీ వెనకనుండి... బయటి రోడ్డుమీదకు తొంగి చూశాయి.

“ఆడేనే సిట్టీ” అన్నాడు కోరమీసాల వ్యక్తి.

“పాపం, అమాయకుడిలా ఉన్నాడు” అంది సిట్టి.

“అమాయకుడు కాబట్టే…” ఆ మాట భావగర్భితంగా ఉంది.

“ఏమో పాపం” గొంతులో జాలి.

“పాపం, గీపం అంటా కూసుంటే ఇంక పనైనట్టే… ఊ పదపద…” అంటూ తొందర చేశాడు.

ఇందాకటి సింగారానికి మెరుగులు దిద్ది బయలుదేరింది సిట్టి.

ఇక్కడ ఈ సిట్టీ, కోరమీసాల వ్యక్తీ ఎవరో మనవి చేస్తాను.

కోరమీసాల వాడి పేరు గంగడు. వాడి కోరమీసాలు చూసి, కత్తి చివరులాంటి చూపులు చూసి, గంగడికి ‘రౌడీ గంగడు’ అని బిరుదు ఇచ్చారు ఎవరో… వాడికి బదులు చెప్పలేనివారు. గంగడికి రౌడీకుండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. ఆ పాతకొంప వాడి తండ్రి ఆస్తి. అడపా దడపా అత్తారింటికి… అంటే జైలుకు వెళ్ళి వస్తూ, మనసు మళ్లినప్పుడల్లా పుట్టినూరుకి దర్శనమిచ్చి పోతుంటాడు. వచ్చేటప్పుడల్లా ఇలాగే ఏ సిట్టినో, పొట్టినో వెంటేసుకొని మరీ వస్తాడు.

మసకచీకటి పేరుకొని కటికచీకటి కావాలని చూస్తోంది. కానీ, గుడివెనక చంద్రోదయం, నక్షత్రకాంతీ ఆ ప్రయత్నాన్ని కొనసాగనీయలేదు. పూజ ముగించి పున్నయ్య కూర్చున్నాడు. తను ఈ గుడికి పూజారి అవడానికి ముందు కూడా ఈ గుడి పాడుబడ్డదే! ఇప్పుడిప్పుడు ఊరివాళ్ళిక్కడికి వస్తున్నారు. అంతకు ముందు ఎవరూ దీని వంకే చూసేవారు కాదు. తన తరవాత

మళ్ళీ ఈ గుడి దిక్కూ, మొక్కూ లేనిదౌతుందేమో! ఏమో ఎవరు చూశారు?

ఇంతలో చంద్రోదయంతోపాటు ఇందాకటి వెలుగు కిరణంలా వచ్చింది. ఆమె దోవలో నమస్కరించిన స్త్రీ అని పున్నయ్య గుర్తించాడు. తీర్థప్రసాదాలు ఇవ్వడం ముగిసింది. పున్నయ్య ఇచ్చిన తులసి దళాలను అతిభక్తిగా కళ్ళకు అద్దుకొని, ముడిలోని మల్లెలతో నేస్తం కలిపించింది.

"ఏం స్వామిగారు, ఇందాక నమస్కరించినా ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. భక్తురాలిమీద కోపమా?"

కంఠంలో ఎంత తీపి! ఎంత చనువు!!

"అలాగా, నాకు సరిగా వినబడలేదు; ఎవరినో అనుకున్నాను." గుడి తాళంచేతులు బొడ్లో దోపుకుంటూ అన్నాడు.

"మీరు వెళ్ళే దోవలోనే కదా నా ఇల్లు. మీ పాదధూళితో నా ఇంటిని ఒకసారి పావనం చెయ్యకూడదూ? ఏవైనా రెండు మంచి మాటలు చెప్పి, నా జన్మ తరింపచెయ్యండి."

ఆ మాటల్లో భక్తీ... ఇహలోకం మీద విరక్తీ...!!!

"అదెంత పని, అలాగే వస్తానమ్మా." మాటవరసకి అన్నాడు. దోవన పడుతున్నాడని ఆశపడింది సిట్టి. ఇద్దరూ ఊరిలోకి బయలుదేరారు. గట్టు కింద మినుకు దీపాలకాంతి ఊరి ఉనికిని తెలుపుతోంది.

వెన్నెట్లో చిన్నచిన్న బండలను గెంతుతూ, తన పక్కగా వస్తోన్న సిట్టిని పరకాయించి చూశాడు. నున్నటి రాళ్లమీదుగా పారే సెలయేరు గుర్తొచ్చింది. సిట్టి జెడలో మల్లెలు, సిట్టి కట్టుకున్న తెల్లచీర, సిట్టి నున్నటి చెంపలు... వెన్నెట్లో మెరుస్తున్నాయి.

తన సీతకు మల్లెపూలంటే ఎంత ఇష్టం!!!

ఏమిటి తన ఆలోచనలు ఈరోజు ఇలా సాగుతున్నాయి? వెన్నెల మహిమా? నాలుగు సంవత్సరాలనుండీ వెన్నెల కాస్తూనే ఉందే? నిశ్శబ్దరాత్రా? ఎన్ని నిశ్శబ్ద నిశీథులు గడిచిపోలేదు? ఏకాంతమా? కాంతా సమీపమా?

సిట్టి ఒక చిన్న గుట్ట దాటబోయి, దాటలేనట్లు తూలి, ముందుకు పడబోయి, పున్నయ్య మీద పడింది. పున్నయ్య సిట్టిని గట్టిగా పట్టుకున్నాడు. అమ్మయ్య అంటూ మీదకు వాలింది. సందిట్లో సుందరి!!! తలలోని పూలు తెస్తున్న మత్తుదనం!!! వెన్నెలకాంతిలో మెరుస్తున్న సిట్టి చెంప నున్నదనం!!!

పున్నయ్య పురుషుడు కాబట్టి ఒళ్ళు పులకరించింది.

నాలుగు సంవత్సరాల తరవాత స్త్రీ స్పర్శ!!

మధురస్మృతుల గుంపు!!

తీయటి భావాల ముంపు!!

తమాయించుకున్నాడు.

పట్టువిడుపు!!

గట్టు దిగారు. రోడ్డు మీదకొచ్చారు. దీపం మసకకాంతిలో సిట్టిని మరోసారి చూడాలనిపించింది. చూశాడు.

తెలనాగు!!

వర్షాకాలపు నాగు!!

ఏమిటీ విచిత్రం ఈరోజు? తనిలా మారిపోతున్నాడు? ఏమిటీ ఆకర్షణ? నిగ్రహానికీ, ఆకర్షణకూ సంఘర్షణ! ఏమిటో తనకే తెలియట్లేదు!

సిట్టి ఇంటిముందు ఆగారు.

"లోపలకు దయచేస్తారా? కాసిని మంచి తీర్థం పుచ్చుకుంటారా?"

ఆహ్వానాన్ని కాదనలేక పోయేటంతటి బలహీనుడైపోయాడు. పున్నయ్య బలమైన నరాల చివరన మెలిపెట్టింది సిట్టి అందం!!

ఇంటికి తాళం. తన చీరకొంగున మారుతాళం చెవి. గొళ్ళెం అందక సిట్టి ఎగురుతుంటే, పున్నయ్యకు చూడముచ్చటగా అదొకమాదిరిగా ఉంది. లోపలకు వెళ్లారు. తలుపు వేసిన చప్పుడు.

మన కథకు అక్కడ అడ్డంగా తలుపు పడింది. అంతవరకే తెలుసు కాబట్టి, లోపలేం జరిగిందో ఊహించాలి. ఊహించడానికేముంది, వయసుగత్తె వయ్యారం ముందు, ఎక్కడో చీకటిగుహలో నాలుగు సంవత్సరాలనుండీ నిద్రిస్తున్న పున్నయ్య పురుషత్వం ఆవలించి ఒళ్ళు విరుచుకొని ఉంటుంది. వగలాడి వలపు హొయల దరి, పున్నయ్య వివేకం తల వంచుకొని ఉంటుంది. పున్నయ్య నైతిక పతనం ప్రారంభమై ఉంటుంది.

ముచ్చటగా మూడవనాటి రాత్రి, పదిగంటల సమయాన... మసకగా వెన్నెల కాస్తున్నప్పుడు... మంచు కురుస్తూ పొడిని తడి చేస్తున్నప్పుడు... గుడి వెనక పచ్చగన్నేరు చెట్ల నీడల్లో... పున్నయ్య కౌగిలిలో సిట్టి కరిగిపోతున్నప్పుడు... గుడి నీడల దగ్గర దాక్కున్న కీనీడ నుండి ఒక మట్టిబెడ్డ సిట్టి జెబ్బను తాకింది.

అంతవరకూ ఏమరపాటుతో ఉన్న సిట్టి పున్నయ్య కౌగిలింత విడిపించుకొని నిలుచుంది. పమిటచెంగు తలమీద ముసుగు వేసుకుంది. ఎక్కడికి అన్నట్టు చూచాడు పున్నయ్య. పట్నం దారివైపు చూపించింది.

"ఎందుకు?"

"అంతే"

'ఏమిటి జాగు' అన్నట్టు రెండో బెడ్డ సిట్టి నెత్తిమీద మొట్టికాయ వేసింది.

"అర్థం కావట్లా!"

"నిదానంగా అదే అర్థమౌతుందిలే..." మాటలో నిర్లక్ష్యం.

"అంటే?"

"అంతే!!"

పున్నయ్యను ఆశ్చర్యంలో ముంచి, గుడిగోడ కీనీడలో కలిసిపోయింది సిట్టి. మరుక్షణం గుడిముందు గుడ్డిదీపం కాంతిలో రెండు ఆకారాలు తళుక్కున మెరిసాయి. పున్నయ్య ఒక్క అంగలో ఆ ఆకారాల ముందు నిలుచున్నాడు.

సిట్టిపక్కన కోరమీసాల వ్యక్తి. ఆవ్యక్తి చంకలో జాజికాయ పెట్టె. అది పున్నయ్య భార్య నగల పెట్టె. పున్నయ్య పంచప్రాణాలూ ఆ పెట్టె. మధురస్మృతులతో నిండిన పెట్టె.

పున్నయ్య బొడ్లో తడుముకున్నాడు ఇంటి తాళం చెవుల కోసం.

ఎక్కడున్నాయి?

పున్నయ్య సిట్టి ముద్దుల మైకంలో ఉన్నప్పుడు మాయమైపోయాయి. అప్పుడు తెలిసింది పున్నయ్యకు... జరిగినమోసం; తను పడిన గోతి లోతు.

పున్నయ్యలో ఆవేశం పొంగింది. కసి, జరిగిన మోసం, కోపం, సిట్టి అసలు రంగు, అతన్ని గట్టిగా ఊపాయి. ఒక్క ఊపులో గంగడిమీద కలియబడ్డాడు. కానీ, ఇట్లాంటి పోట్లాటల్లో ఆరితేరిన రౌడీగంగడి ముందు పున్నయ్య ఏపాటి? గంగడు తోసిన తోపుకు పూజారి కిందపడ్డాడు. కిందపడ్డ పున్నయ్య నెత్తిమీద ఒక పెద్ద రాయి పడింది.

వేడి రక్తం చిమ్మింది.

బిగించిన పిడికిలి... కసి చూపు... తుది శ్వాస... అంతే!!

“చచ్చేడేమో...” గాభరాతో సిట్టి పున్నయ్యమీదకు వాలబోయింది.

“మరీ మంచిది” అన్నాడు గంగడు. సిట్టి చేయి పట్టుకొని లాగాడు. ఇద్దరూ పట్నం దారివైపు ముసురుకున్న చీకటిలో కలిసిపోయారు.

గుడిముందు భక్తుడి శవం.


గుడిలోపల ఈ ఘోరచర్యను తిలకిస్తున్న త్రినేత్రుడు! లోకపాలకుడు!!

కానీ ఏంచేస్తారు...

రాతి (గుండె) దేవుళ్ళు...!!

# లీల

స్మైల్



## కథామార్గదర్శి కథ

***కోటిరెడ్డి చనిపోయినప్పటినుంచి లీల ప్రతిరోజూ కోటిరెడ్డి చనిపోయిన గదిలోకి వెళ్లిఅక్కడ కొంచెం సేపు కూర్చుని, గది నలుమూలలా పిచ్చిగా కలయజూసి, గది గుమ్మంమీద వేలాడే, తను, కోటిరెడ్డి ఉన్న ఫోటోమీద దృష్టి నిలిపి తర్వాత గది బయటకు నడిచేది.***
***శ్మశానం దగ్గరకు వెళ్లి కోటిరెడ్డిని దహనం చేసిన చోట కొంచెంసేపు కూర్చుని అటూ ఇటూదిక్కులు చూచేది, తలెత్తి ఆకాశంవైపు చూసేది, తలదించి దూరంగా కనిపించే పొలాలవైపు చూసేది లీల.***
***ఆ చూపుల్లో అదే అన్వేషణ, తిరిగిరాని వారికోసం ఏదో అన్వేషణ.***

"ప్రెసిడెంటట: ప్రెసిడెంటు! పంచాయితీని మురికిగుంట చేశాడు."

"చేయకేం చేస్తాడు వయసు ముసలెద్దు, మనసు కోడెదూడైతే! ఎంతసేపూ చెడిన ఆడవాళ్ల గురించే ఆలోచన!"

"ఛీ! ఛా! వెధవ పెసిడెంటు గిరికోసం పాలేరుల్ని తాగించి వాళ్లతో మంగిరెడ్డిని చంపించేశాడు, రాక్షసుడు!"

"మొత్తానికి పంచాయతీలో బాగానే సంపాయించాడు."

ఇంకా చాలారకాలుగా అనుకుంటారు పంచాయితీ ప్రెసిడెంటు కోటిరెడ్డి గురించి. ఆ మాటలు ఆనోటా ఈనోటా విని, 'నా కర్మ' అనుకునేది కోటిరెడ్డి భార్య రంగమ్మ.

'నాన్న ఇట్లా చేస్తాడా!' అనుకునేది కోటిరెడ్డి కూతురు సుశీల.

ఇలా అందరితోనూ రకరకాలుగా అనిపించుకున్న కోటిరెడ్డి నెల క్రితం నుంచి టైఫాయిడ్‌తో బాధపడి ఈరోజు మధ్యాహ్నం చనిపోయినపుడు గ్రామంలో సంతోషించినవారు చాలామంది ఉన్నారు.

"ఊరిపీడ వదిలింది" అన్నారు కొందరు...

"ఊరు బాగుపడుతుంది..." అన్నారు మరికొందరు.

"అయ్యో! నా దేవుడా!" రంగమ్మ కళ్లలో వరద గోదారి.

"నాన్నా! నాన్నా!!" సుశీల కళ్ళల్లో కృష్ణమ్మ వరద.

ఏడుపు, కన్నీరు.

ఏడుపూ, కన్నీరూ లేకుండా కోటిరెడ్డి శవం పక్క నిలబడివుంది ఒక్క లీల మాత్రమే.

"లీలా! నీ అయ్యగారు నీకులేరు!" లీల వీపునిమురుతూ ఏడ్చింది రంగమ్మ.

లీల అట్లాగే చూస్తూవుంది కోటిరెడ్డి శవం వైపు.

"ఒరేయ్! ఆ కుక్క చూడరా? ఎట్టామనేదగా చూస్తూ వుందో! దొర ఈ నెలరోజులూమంచం మీదుంటే ఆయన్నే చూస్తూ, దొరా ఎదుటే గదిలో కూరుసుండేదిరా! దొరకు అదంటే మాసెడ్డ ప్రాణం. పాపం! ఇప్పుడది ఎట్టావుందో చూడు!" కోటిరెడ్డి పాలేరు వెంకన్న తన పక్కనున్న వీరాయితో అన్నాడు.

ఏడుపులు! ఏడుపులు!

ఆఖరిసారిఅరుపులు.

"వెళ్ళిపోతున్నారా?" రంగమ్మ తలబాదుకుంటూ వుంది.



"నాన్నా!" సుశీల హృదయవిదారకంగా విలపిస్తూవుంది.

ఏడుస్తున్న వారివైపు దీనంగా చూస్తూవుంది లీల.

"లీలా! నీ అయ్యగారు వెళ్ళిపోతున్నారు?" రంగమ్మ గట్టిగా ఏడుపు.

నేను కూడా అంతదూరం వెళ్ళొస్తానన్నట్లు రంగమ్మవైపు చూసి శ్మశానానికి తీసుకుపోబడుతున్న కోటిరెడ్డి శవం వెంట నడుస్తున్న మనుషులను తప్పించుకుంటూ శవవాహకుల పక్కకువచ్చి వారివెంట నడుస్తూవుంది లీల.

"ఒరేయ్! మీ బావ ఏదీ వెంట తీసుకు వెళ్ళకపోయినా ఆ కుక్క విశ్వాసాన్నైనా వెంట తీసుకువెళ్తున్నాడురా! చూడు దాన్ని! పాడెమీదున్నకోటిరెడ్డి శవం కనిపించటంలేదనేమో తలెత్తిచూస్తూ ఎట్లా నడుస్తూ వుందో" శవం వెంట వెనక నడుస్తూవున్న పంచాయతీ మెంబరు రంగారెడ్డి తన పక్కనున్న పులిరెడ్డితో అన్నాడు.

కుక్కంటే అది కుక్క! 'మాలీలముందు జాతికుక్కలు బలాదూర్!' అనేవాడు మా బావ. పంచాయతీ ఆఫీసు కెళ్లినా, పొలం చూడ్డానికి వెళ్లినా అది బావ వెంటే ఉండేది. నీకు తెలుసుగా, అది మా బావ ప్రాణాన్ని మంగిరెడ్డి పాలేరు చేతుల్లోంచి ఎట్లా రక్షించిందో? అందుకే బావకు అదంటే ఎక్కడలేని ప్రేమగా ఉండేది. బావ దాన్ని పూజించేవాడనుకో! దాని మెడలోదండలు వేసేవాడు, కుంకంబొట్టు పెట్టేవాడు! నైవేద్యం పెడుతున్నట్లే మాంసం ముక్కలు తన చేతులతో తినిపించేవాడు! అబ్బో! ఇటువంటివి చాలా చేసేవాడు!" కోటిరెడ్డి బావమరది పులిరెడ్డి ఏదో బాధతో చెప్పాడు.

శ్మశానం.

మంటలు, మంటలు, మంటలు.

శవదహనం.

'నన్ను విడిచి వెళ్ళిపోతున్నారా!' అన్నట్లుదీనంగా మంటలవైపు చూస్తూవుంది లీల.

అంతా అయిపోయింది.

ఇళ్లకు బయలుదేరారు అందరూ.

లీల కదలలేదు.

'ఇంతకాలం నన్ను సాకిన మనిషి శరీరం ఇప్పుడేమై పోయింది' అన్నట్లు చూస్తూవుందిఅది కోటిరెడ్డి చితాభస్మాన్ని.

పాలేరు వెంకన్న శ్మశానంనుంచి బలవంతంగా ఇంటికి లాక్కు వచ్చాడు లీలను.

"లీలా!" బావురుమంది రంగమ్మ మళ్లీ.

'ఏడవకండి! నాకు మాత్రం బాధగాలేదూ! ఆమాటకొస్తే నాకే ఎక్కువ బాధగా ఉంది' అన్నట్లు రంగమ్మవైపు చూసి మెల్లగా ఇంట్లోకినడిచింది లీల.

కోటిరెడ్డి చనిపోయిన గది దగ్గరకు వెళ్లింది.

కోటిరెడ్డి చనిపోయిన గదిలోకి వెళ్లింది.

కోటిరెడ్డి చనిపోయిన మంచం దగ్గరకువెళ్ళింది.

ఆ మంచాన్ని కొంచెం సేపు తదేకంగా చూసి మంచానికి తలవైపు కూర్చుంది.

చూపులో ఏదో అన్వేషణ.

ఏదో ఆవేదన.

ఇంతవరకూ ఉండి ఇప్పుడు లేకుండా పోయిన మనిషి కోసం అన్వేషణ.

ఇంతవరకూ ఉండి ఇప్పుడు బూడిద అయ్యిపోయిన మనిషికోసం ఆవేదన.

దాని చిన్నతనంలో దాన్ని గేదె ఒకటి తొడమీద తొక్కినప్పుడు, తొడ విరిగిపోయినట్లున్నదాన్ని పశువుల డాక్టరుకు చూపించి, ఇంజక్షన్ చేయించి, కట్టు కట్టించి బాగుచేయించి, పెంచి పోషించి, పెద్ద చేసి, "లీలా!" అని పిలిచే మంచిమనిషి కోసం అన్వేషణ, ఆవేదన.

మంచం మీదున్న లీల చూపు గది గుమ్మంమీద గోడకు వేలాడుతున్న పెద్ద ఫోటోమీదకు మరలింది. ఆ ఫోటోలో లీలను పక్కన కూర్చోబెట్టుకునివున్న కోటిరెడ్డి మందహాసం చేస్తున్నాడు.

మంచం దగ్గర నుంచి లేచి కొంచెం ముందుకు వెళ్లి ఫోటోవైపు తలెత్తి చూసింది లీల.

'నాకింక ఒళ్లెవరు నిమురుతారు? స్నానం ఎవరు చేయిస్తారు?' అని ప్రశ్నిస్తున్నట్లు ఫోటోవైపు లీల చూపు.

'పక్కన కూర్చోబెట్టుకుని నా ముందుకాళ్ళను భుజాలమీద వేసుకుని "లీలా!" అని ఎవరుముద్దు పెట్టుకుంటారు?' అన్నట్లున్న చూపు, లీల చూపు.

మళ్ళీ మంచం వైపు తిరిగింది లీల.

మంచం దగ్గరకు వెళ్ళి మంచం కాళ్లు నాకి, గది బయటకు నడిచింది.

బయటకు వెళుతున్న లీలను చూసి సుశీలపిలిచింది. "లీలా! రా! అన్నం తిందుగాని."

లీల నిలబడలేదు.

"అమ్మా! పదిరోజులనుంచి లీల సరిగా అన్నం ముట్టటం లేదమ్మా!" అంది సుశీల రంగమ్మతో.

రంగమ్మ మాట్లాడలేదు. ఆయన పోయారని ఆ నోరులేని జంతువు ఎంత బాధపడిపోతూంది! అయ్యో, లీలా! ఆయనారోజు పొలంనుంచి వస్తుంటే, మంగిరెడ్డి పాలేరు డొంకలో కాపుకాసి ఆయనను చంపటానికి మీదపడినప్పుడు, వాణ్ణి ఎట్లా పడితే అట్లా కాటేసి, వాడి కాలికండ పీకి ఆయనను రక్షించావు. కాని మేము ఎన్నిమందులు వాడి కూడ ఆయన్ను రక్షించుకోలేకపోయాం' —అనుకుంది రంగమ్మ మనసులో.

లీలను చూస్తే ఆయన రంగమ్మ కళ్లముందు నిలిచేవాడు.

రంగమ్మను చూసి తలదించుకుని మెల్లగా లోపలకు వెళ్లిపోయేది లీల.

కోటిరెడ్డి చనిపోయినప్పటినుంచి లీల ప్రతిరోజూ కోటిరెడ్డి చనిపోయిన గదిలోకి వెళ్లిఅక్కడ కొంచెం సేపు కూర్చుని, గది నలుమూలలా పిచ్చిగా కలయజూసి, గది గుమ్మంమీద వేలాడే, తను, కోటిరెడ్డి ఉన్న ఫోటోమీద దృష్టి నిలిపి తర్వాత గది బయటకు నడిచేది.

శ్మశానం దగ్గరకు వెళ్లి కోటిరెడ్డిని దహనం చేసిన చోట కొంచెంసేపు కూర్చుని అటూ ఇటూదిక్కులు చూచేది, తలెత్తి ఆకాశంవైపు చూసేది, తలదించి దూరంగా కనిపించే పొలాలవైపు చూసేది లీల.

ఆ చూపుల్లో అదే అన్వేషణ, తిరిగిరాని వారికోసం ఏదో అన్వేషణ.

ఆ చూపుల్లో అదే ఆవేదన, కనిపించకుండా పోయినవారి కోసం మూగ ఆవేదన,

"కోటిరెడ్డి కుక్క బక్కచిక్కిపోయింది, పాపం, విచారంతో, ఒక పుల్లారెడ్డి సానుభూతి.

"ఎంత హుషారుగా ఉండే కుక్క చావుకళ వచ్చినట్లే ఎంతగా మారిపోయింది" – మరొకవెంకటరెడ్డి అభిప్రాయం.

"చచ్చిన మనిషికోసం అది పడుతున్న బాధ ఎవరికి ఉన్నట్లే లేదు!" ఒక సుబ్బారెడ్డి అభిప్రాయం.

"పాపం! మొన్న అది పంచాయతీ ఆఫీసుకువెళ్లి గదులన్నీ తిరిగిందట. కోటిరెడ్డి అక్కడున్నాడనుకుని వెదికిందేమో! కోటిరెడ్డి కూర్చునే కుర్చీ దగ్గరకు వెళ్ళి దాన్ని నాకి బయటకు వచ్చేసిందట. పంచాయతీ జవాను చెప్పాడు. చచ్చిన కోటిరెడ్డి దయ్యంగానైనా ఆ కుక్కకు కనిపిస్తే అది కాస్త బాగుపడేదేమో!" ఒక శివారెడ్డి సానుభూతి.

"అయ్యో! లీల నెలనుంచి సరిగా అన్నం తినటమే మానేసింది, ఎట్లా?" ఇది సుశీల సందేహం.

కోటిరెడ్డి చనిపోయి నెల కావస్తూ ఉంది.

లీల చిక్కిపోయి ఎముకల గూడుగా మారి కూడా నెల కావస్తూంది.

లీల కళ్లలో కాంతి తగ్గి పోయింది.

లీల కాళ్లలో శక్తి ఉడిగిపోయింది.

అయినా, ఇంకా అదే అన్వేషణ.

ఇంకా అదే ఆవేదన.

కోటిరెడ్డి గదిలో అన్వేషణ —— అన్వేషణ! అన్వేషణ! ఆవేదన!

పంచాయతీ ఆఫీసులో ఆవేదన! ఆవేదన! ఆవేదన! అన్వేషణ!

శ్మశానంలో అన్వేషణ——ఆవేదన – అన్వేషణ–ఆవేదన.

కోటిరెడ్డి అప్పటికే చాలామంది మనసుల్లోని మరపుల మారుమూలలకు జారిపోయాడు.

కాని లీల మెదడులో నిలిచే ఉన్నాడు కోటిరెడ్డి.

అందుకే అన్వేషణ, ఆవేదన, మనోవేదన.

"పెటపెటలాడే వయసులో ఉన్న ఆడపిల్లలాగ ఉన్న ఆ కుక్క, పాపం, ఇప్పుడు ముసలిదై పోయినట్లే ఉందిరా! మొన్న పంచాయతీ ఆఫీసుకుఅది వెళ్లే, దాన్ని 'ఛేయ్! చేయ్!' అని తోలేశారట, పాపం!" పుల్లారెడ్డి సానుభూతి.

"అందుకేమోరా! అదీమధ్య శ్మశానంలోనే కూర్చుని వుంటూవుంది. నేను పొలంనుంచి వస్తూ చూస్తూన్నాగా?" వెంకటరెడ్డి.

"అమ్మా! నిన్నటినుంచి మన లీల అసలు ఇంటికే రాలేదే! ఏమైందో?" సుశీల రంగమ్మనుఅడిగింది.

"అయ్యో,రామచంద్రా! ఆయన్ని తీసుకుపోతూ లీలను కూడా తీసుకుపోయినా పోయేది. దాని బాధ మేం చూడలేకపోతున్నాం, దేవుడా!" రంగమ్మ కంటనీరు.

“అమ్మా! సొశానంలో అయ్యగార్ని దహనం సేసినచోట మన కుక్క సచ్చిపడుందమ్మా!ఎప్పుడు సచ్చిపోయిందో ఏటో రాంబందులు పీక్కు తింటుండాయి –పొలంనుంచి వత్తూనేచూశానమ్మా!” అప్పుడే అక్కడకు వచ్చిన పాలేరు వెంకన్న చెప్పాడు..

“లీలా!!” ఏడుస్తూ కోటిరెడ్డి గదిలోకి పరుగెత్తింది సుశీల.

రంగమ్మ రాతిబొమ్మలా అలాగే నిలబడి ఉంది.



వెనుకటి రోజుల్లో.. అంటే ఓ నలభై, ఏభై ఏళ్ల క్రితమనుకోండి,
ఒక ఊరిలో, ఒక వీధిలో..
పిన్నీ! ఈ వారం ఆంధ్రప్రభ ఇమ్మంది అమ్మ!
ఇదిగో తీసుకెళ్లు. అలాగే మీ ప్రక్కవాటాలో రమణమ్మగారి నడిగి ఈ నెల యువ పట్టుకురా.

మరో వీధిలో..
అవును ఈ వారం ఆంధ్రపత్రిక వచ్చిందా అత్తా?
పిల్లలు స్కూలు నుంచి వచ్చే లోపల చదివిచ్చేస్తా ..
ఓసారి ఇయ్యి అత్తా.

దానికేం భాగ్యం! ఇదిగో తీసుకో. గోడమీంచి అందిచ్చింది ఆ అత్త

అందాక ఈ నెల జ్యోతి తీసుకుని చదువు అత్తా.

ఇది అప్పటి రోజుల్లో...

ఆంధ్రదేశంలో ప్రతీ ఊర్లో, వీధి వీధిన పుస్తకాలు, పత్రికలు ఒకింటి నుంచి మరో ఇంటికి మార్పిడవుతో కథలతో బాటు అప్యాయతలని, అనురాగాల్ని పంచుతుండేవి.

ఆ మనుషులు, ఆ పత్రికలు, ఆ కథలు అదో అనుబంధాల లోకం. ఆ రోజులే వేరు.

మరిప్పటి రోజుల్లో..

ముద్రణా పత్రికలు ఆగిపోయాయి. మార్పిడి ఆగిపోయింది. మనుషుల మధ్య ఎడం పెరిగింది.
అంతర్జాల పత్రికాయుగం ఆరంభమైంది.
కథలు సజీవంగానే ఉన్నాయి. కానీ, మునుపటిలా ఆ కథల కోసం ఇంటింటికి తిరిగే అవసరం మాత్రం పోయింది.

ఇటువంటి తరుణంలో కథాప్రియులందరి కోసం అంతర్జాలంలో అవతరించింది మీ కథామంజరి. మీరెక్కడ కావాలంటే అక్కడ, ఎప్పుడు కావాలంటే అప్పుడు చదువుకునే సజీవమైన కథలను నెలనెలా మీ కోసం అందిస్తుంది కథామంజరి.

మరింక ఆలస్యం దేనికి?
కథామంజరి చందాదారులుగా చేరండి.
కథలకు చేరువకండి.